thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 365 | కరీంనగర్ బుధవారం, 12 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కృష్ణా జలాల కోసం ఆంధ్రాకు తమిళనాడు అధికారులు..

చెన్నై: నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేలా కృష్ణ జలాల నిర్వహణ రుసుము చెల్లించేందుకు రాష్ట్ర అధికారులు త్వరలో ఆంధ్ర రాష్ట్రం వెళ్లనున్నారు. రాజధాని నగరం చెన్నై ప్రజల దాహార్తి తీర్చేలా నదీజలాల ఒప్పందంలో భాగంగా ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి ప్రతి ఏడాది 12 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంది.

కానీ, ఇప్పటివరకు ఒప్పందం మేరకు నీటిని విడుదల చేసిన దాఖలాలు లేవు. 2023-24వ సంవత్సరంలో 2.41 టీఎంసీలు, 2024-25వ సంవత్సరంలో 2 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేశారు.

ఈ నీటిని పొందేందుకు, ప్రతి ఏడాది నిర్వహణ రుసుముగా రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు చెల్లిస్తోంది.

# అసెంబ్లీకి కేసీఆర్.. హాజరు కోసమేనా?..

## జగన్ ఫార్ములానే ఫాలో అవుతున్నారా?




తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల తారకరామారావు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరు కానున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. అయితే ఆయన తాను అసెంబ్లీ సమావేశాలకు హాజరౌతానని ప్రకటించిన తరువాత కూడా కేసీఆర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు నిజంగా హాజరౌతారా? లేక హాజరు కోసం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం చేసే రోజు మాత్రమే హాజరై ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తన మిత్రుడు, వైసీపీ అధినేత జగన్ లా మిగిలిన రోజులన్నీ డుమ్మా కొట్టి ఫామ్ హౌస్ కు పరిమితమౌతారా అన్న సందేహాలు రాజకీయ వర్గాలలో వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే కేసీఆర్ తాను అసెంబ్లీకి హాజరు అవుతానని వెల్లడించారు. అదే సమయంలో బుధవారం నాడు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే రోజున తాను అసెబ్లీకి హాజరౌతానని ఆయన చెప్పారు. దీంతో కేసీఆర్ అసెంబ్లీకి కేవలం అటెండెన్స్ కోసమే వస్తారా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన రోజు ఆయన ప్రసంగం తరువాత సభ వాయిదా పడుతుంది. ఆ రోజు సభలో ఇంక ఎటువంటి కార్యక్రమాలూ జరగవు. కాగా ఈ విషయంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వివరణ ఇస్తూ.. గవర్నర్ ప్రసంగం రోజున మాత్రమే కాదు., ఆ తరువాత కూడా బడ్జెట్ సమావేశాల సమయంలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరగే రోజులలో కేసీఆర్ సభకు హాజరౌతారన్నారు. కేసీఆర్ కుమారుడిగా తాను ఆయన అసెంబ్లీకి రావాలని కోరుకోవడం లేదన్న కేటీఆర్.. అందుకు కారణం కాంగ్రెస్ సభ్యుల చౌకబారు వ్యాఖ్యలు, ప్రసంగాలను చూపారు. అంతే కాదు.. కాంగ్రెస్ లో ఎవరూ కూడా కేసీఆర్ కు తగ్గ స్థాయి ఉన్నావారు లేరన్నాని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ కుమారుడిగా కేటీఆర్ సెంటిమెంట్ ను అర్ధం చేసుకోవచ్చు కానీ, అసలు కేసీఆర్ సభలో ఏ మేరకు క్రియాశీలంగా వ్యవహరిస్తారన్నది చూడాల్సి ఉంది. కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడు. అయితే ఆ హోదాలో ఆయన ఇంత వరకూ సభకు కేవలం ఒక్కసారి మాత్రమే హాజరయ్యారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ సభకు హాజరై ప్రజా సమస్యలపై గళమెత్తాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే డిమాండ్ చేస్తున్నారు. అదలా ఉంచితే.. తెలంగాణ రాజకీయ వర్గాలలో మాత్రం కేసీఆర్ సభకు హాజరు కావడానికి అనర్హత వేటు నుంచి తప్పించుకునేలా హాజరు వేయించుకోవడానికే అన్న చర్చ జరుగుతోంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి జగన్ అసెంబ్లీని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించినా శాసనసభ సభ్యత్వం రద్దౌతుందన్న భయంతో ఒకే ఒక్క రోజు అసెంబ్లీకి హాజరైన సంగతిని గుర్తుచేస్తున్నారు పరిశీలకులు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అనర్హత వేటు భయంతో జగన్ ఫార్ములానే అనుసరిస్తున్నారని అంటున్నారు. అయితే ఇంత వరకూ తెలంగాణలో ఏ నాయకుడూ కూడా కేసీఆర్ అనర్హత గురించి మాట్లాడిన సందర్భం లేదు. అయినా నిబంధన అనేది అందరికీ ఒకేలా ఉంటుంది. ఏ సభ్యుడైనా వరుసగా 60 రోజుల పాటు అసెంబ్లీకి గైర్హాజరైతే, ఆ సభ్యుడిపై అనర్హత వేటు పడుతుంది. తెలంగాణ బడ్జెట్ సమావేశాలు బుధవారం (మార్చి 12) నుంచి ప్రారంభం అవుతాయి. మార్చి 27 వరకూ సాగుతాయి.

# నేడు 1,532 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు

హైదరాబాద్: జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి మార్చి 12న (బుధవారం) నియామక పత్రాలు ఇవ్వనున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు 1,292 మంది, పాలిటెక్నిక్ లెక్చరర్



పోస్టులకు 240 మందిని ఇటీవల టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. కొత్తగా నియమితులైన లెక్చరర్లకు విద్యా శాఖ విధానాలు, బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చి కాలేజీల్లో పోస్టింగులు ఇవ్వనున్నట్లు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. కొత్త లెక్చరర్ల నియామకాలతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు.




# ఈ సారి భారీగానే..

## రూ.3 లక్షల కోట్లతో... రికార్డు స్థాయిలో...

# తెలంగాణ బడ్జెట్!

హైదరాబాద్ : 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ రూ.3.20 లక్షల కోట్లకు కాస్త అటు ఇటుగా ఉండొచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. గతేడాది రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టగా, ఈసారి అంతకంటే ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఇంత పెద్ద మొత్తంలో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

దీనికి అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అప్పులకు వడ్డీల కింద అధిక నిధులు కేటాయించేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఆరు గ్యారంటీల్లో ఒకటి రెండు మినహా మిగిలినవన్నీ అమలవుతున్నాయి.

**అమలు కాని స్కీమ్స్ కోసం..** స్కీమ్స్ కొనసాగించేందుకు నిధుల కేటాయింపు, ఇంకా అమలు కాని వాటి కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నారు. అందులో చేయూత పెన్షన్, మహాలక్ష్మిలో స్కీంలో భాగమైన మహిళలకు నెలకు రూ.2500 పథకాలు అమలు కావట్లేదు. మిగతావి అమలవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓసారి ఓటాన్ అకౌంట్, మరోసారి ఫుల్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఈసారి ఫుల్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. అందుకు ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా శాఖల అంచనాలు, అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. రేపు గవర్నర్ ప్రసంగం తర్వాత బడ్జెట్ సెషన్స్ ప్రారంభం కానున్నాయి. మార్చి 28 లేదా 29 కల్లా సమావేశాలను ముగించేలా ఆలోచన చేస్తున్నారు. ఉగాది, రంజాన్ తదితర పండుగలూ మార్చి నెలాఖరునే ఉండటంతో వాటికి అనుగుణంగా సమావేశాలు నిర్వహించనున్నారు. అసెంబ్లీలో బడ్జెట్?ఆమోదం తర్వాత గవర్నర్ ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

**ఏటా పెరుగుతున్న ఆదాయం..** ఉమ్మడి రాష్ట్రంలో చివరి బడ్జెట్ 2013-14 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,36,629 కోట్లుగా ఉంది. అందులో 42 శాతం వాటాగా తెలంగాణకు తీసుకుంటే రూ.56,947 కోట్లుగా చెప్పొచ్చు. ఉమ్మడి రాష్ట్ర బడ్జెట్‌ను?2018-19లోనే తెలంగాణ దాటేసింది. ఏటా రాష్ట్ర ఆదాయం, తలసరి ఆదాయం పెరుగుతూ వస్తోంది. జీఎస్‌డీపీ కూడా పెరిగింది. నాన్ టాక్స్ రెవెన్యూ మినహా కాంగ్రెస్ సర్కారు హయాంలో అన్ని శాఖల్లోనూ ఆదాయం పెద్దగా ఎక్కడా తగ్గినట్లు కనిపించడం లేదు. గతేడాది స్థాయిలోనే ఈసారి ఆదాయం కొనసాగుతుంది. అదేవిధంగా కేంద్రం నుంచి పన్నుల శాతం పెరగడం, వచ్చే ఏడాది మరింత పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం గతంలో తీసుకున్న అప్పులను కేంద్రం రీషెడ్యూల్ చేయడంతో రాష్ట్రానికి మరింత ఆదాయం సమకూరనుందని టాక్. ఫలితంగా మార్కెట్లో డబ్బు సరఫరా పెరుగుతుందని చెబుతున్నారు. అప్పుడు అభివృద్ధి కార్యక్రమాలను కూడా పెద్దఎత్తున చేపట్టవచ్చని, క్యాపిటల్?వ్యయం ఎక్కువగా ఖర్చు చేసిన రాష్ట్రంగా నిలుస్తుందని విశ్లేషిస్తున్నారు.

**లక్ష్యానికి అనుగుణంగా ఈ ఏడాది ఆదాయం...** రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నా.. ఎక్కడా రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం తగ్గలేదు. హైడ్రా, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు వల్ల రియల్ రంగం?పడిపోయిందని బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా భూముల అమ్మకాల విషయంలో మినహా మిగిలిన వాటిల్లో ఆదాయం అంచనాకు అనుగుణంగా సమకూరుతోందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి చివరి నాటికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంచనాలో రూ.1,82,437 కోట్ల ఆదాయం వచ్చింది. అంచనా వ్యయంలో 66.57 శాతం నమోదైంది. గతేడాది కంటే 1.8 శాతం తక్కువగా ఉంది. నాన్‌టాక్స్ రెవెన్యూ తగ్గడంతోనే ఆదాయం తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కనీసం 15-18 శాతం ఇంకా ఆదాయం వస్తుందని అంచనా వేస్తుండగా.. గతేడాది కంటే ఈసారి అధికంగానే ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వానికి వచ్చే పన్నులు ఎక్కువగా ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే వస్తాయని తెలుస్తోంది. ఆర్థిక ఏడాది ముగుస్తున్న వేళ అధికారులు పన్నులు చెల్లించే వారిపై ఒత్తిడి తేవడం కామన్. అందుకే ఆర్థిక ఏడాది చివరలో ఎక్కువగా చెల్లింపులు జరుగుతాయని ఆర్థిక శాఖ గత రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గత పదేళ్ల ఆదాయం సగటు 82 శాతం ఉంది. గత మూడేళ్లుగా ప్రభుత్వ బడ్జెట్ వాస్తవ ఆదాయం వివరాలను పరిశీలిస్తే 79 శాతం మాత్రమే ఉంది. దీనిని సరిపోల్చి చూస్తే ఈ ఏడాది సైతం ఎక్కడా ప్రభుత్వ ఆదాయం తగ్గే అవకాశం లేదని ఆర్థికశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

## ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసిన కేసీఆర్!




హైదరాబాద్ : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో నిర్వహించిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు కేసీఆర్. అరగంట ముందే అసంబ్లీకి రావాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు జారీ చేశారు కేసీఆర్. 9 గంటల 30నిమిషాలకే అసెంబ్లీలో ఉండాలని.. ప్రతిరోజూ తప్పకుండా అసెంబ్లీకి రావాలని అన్నారు కేసీఆర్. ఎల్పీలో సమావేశం పెట్టుకొని అసెంబ్లీలోకి వెళ్లాలని అన్నారు కేసీఆర్. అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడే అంశాలపై పూర్తిగా అధ్యయనం చేసి మాట్లాడాలని అన్నారు కేసీఆర్. తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని.. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి పై, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చీల్చి చెండాడాలని అన్నారు. బీఆర్ఎస్ మీద ప్రభుత్వం చేస్తున్న తప్పుడు నిందలను తిప్పి కొట్టాలని అన్నారు కేసీఆర్. రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలు....ఎండిన పంటలు, అందని కరెంటు, అందని సాగునీరు, కాలిపోతున్న మోటర్లు తదితర రైతాంగ సమస్యలపై, మంచినీటి కొరత పై అసెంబ్లీలో మండలిలో పోరాడాలని అన్నారు కేసీఆర్. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలని.. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమౌతున్న తీరుపై మాట్లాడాలని అన్నారు కేసీఆర్. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగు, పీఆర్సీ అమలు పై అసెంబ్లీ, మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు.

దళిత బంధును నిలిపివేయడం పట్ల ప్రశ్నించాలని... గొర్రెల పెంపకం, చేపల పంపిణీ సమగ్ర అమలుపై అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు కేసీఆర్.



## మాది ఫామ్‌హౌస్‌లో పడుకునే ప్రభుత్వం కాదు ప్రజా ప్రభుత్వం

ఖమ్మం: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా మాది ఫామ్ హౌస్‌లో పడుకునే ప్రభుత్వం కాదని.. ప్రజా ప్రభుత్వమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం (మార్చి 11) ఖమ్మం జిల్లా వైరా మండల పరిధిలోని పుణ్యపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ.. అప్పులు తీరుస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళుతున్నామన్నారు. 56 నియోజకవర్గాలలో రెండు కోట్ల రూపాయల ఖర్చుతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా రైతు భరోసా, రైతు రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వమన్నారు. ప్రతిపక్ష నాయకులు అధికార పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ, పోలీస్ యంత్రాంగంపై ఉందని చెప్పారు. ఇసుక తరలింపుపై అభ్యంతరాలు పెట్టి లబ్దిదారులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు సూచించారు. 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లు కూడా నిర్మాణం చేయలేదని.. ఎక్కడ చూసినా మొండి గోడలు, అసంపూర్తి నిర్మాణాలేనని విమర్శించారు. కానీ ఇందిరమ్మ రాజ్యంలో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని గర్వంగా చెప్పారు.



## గ్రూప్-2 ఫలితాల్లో టాప్-10 ర్యాంకర్లు వీరే..

హైదరాబాద్ : తెలంగాణ గ్రూప్ -2 పరీక్ష ఫలితాల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 600 మార్కులకు పరీక్షలు జరగ్గా.. నారు వెంకట హర్షవర్ధన్ అనే విద్యార్థి 447.088 మార్కులతో తొలి ర్యాంకుతో మెరవగా.. వడ్లకొండ సచిన్ రెండో ర్యాంకు, బి. మనోహర్ రావు మూడో ర్యాంకులతో సత్తా చాటారు. టాప్- 31 ర్యాంకుల్లో అందరూ అబ్బాయిలే ఉండటం గమనార్హం. రాష్ట్రంలో 783 గ్రూప్ -2 ఉద్యోగాల భర్తీకి గతేడాది డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించిన టీజీపీఎస్సీ.. మంగళవారం మధ్యాహ్నం ఫలితాలు విడుదల చేసిన విషయం తెలిసిందే.

**టాప్ -10 ర్యాంకర్ల జాబితా ఇదే..** 1. నారు వెంకట హర్షవర్ధన్ (447.088 మార్కులు) 2. వడ్లకొండ సచిన్ (444.754 మార్కులు) 3. బి మనోహర్‌రావు (439.344 మార్కులు) 4. శ్రీరామ్ మధు (438.972 మార్కులు) 5. చింతపల్లి ప్రీతమ్ రెడ్డి (431.102 మార్కులు)

6. అఖిల్ ఎర్రా (430.807 మార్కులు) 7. గొడ్డేటి అశోక్ (425.842 మార్కులు) 8. చిమ్ముల రాజశేఖర్ ( 423.933 మార్కులు) 9. మేకల ఉపేందర్ (423.119 మార్కులు) 10. కరింగు నరేష్ (422.989 మార్కులు)



## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

బాన్సువాడ: బాన్సువాడ మండలం నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్?రెడ్డి భూమి పూజ చేశారు. అర్హులందరికీ ఇండ్లు ఇస్తామన్నారు. నాగారం గ్రామంలో 79 మందికి ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. విడతల వారీగా రూ. 5 లక్షలు లబ్ధిదారులకు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, అధికారులు, బాన్సువాడ మండల ప్రజాప్రతినిధులు అంజిరెడ్డి, మోహన్ నాయక్, రాచప్ప, నార్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలపై దూకుడుగా వెళ్లాలి: పార్టీ ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్: తెలంగాణలో బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన భారాస శాసనసభాపక్ష సమావేశం జరిగింది. అసెంబ్లీ, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. అప్పుల విషయంలో కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. భారీగా అప్పులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయట్లేదన్నారు. రైతు బంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. "హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూడోవంతు సమయం పూర్తయింది. ప్రభుత్వానికి సరిపడా సమయం ఇచ్చాం. అసెంబ్లీ, మండలిలో ప్రజల గొంతుకగా పనిచేయాలి. ప్రజల సమస్యలపై దూకుడుగా వెళ్లాలి. తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి. ప్రభుత్వం అవినీతి, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాడాలి. భారాసపై ప్రభుత్వ తప్పుడు నిందలను తిప్పి కొట్టాలి. రైతుల సమస్యలు, మంచినీటి కొరతపై సభలో పోరాడాలి. బీసీ, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలి. గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై ప్రశ్నించాలి. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. మహిళలకిచ్చిన హామీలను నెరవేర్చాలని కొట్లాడాలి. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఖరిని నిలదీయాలి. దళితబంధు నిలిపివేయడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ప్రజల కష్టాలపై ఉభయ సభల్లో ప్రశ్నించాలి" అని పార్టీ నేతలకు కేసీఆర్ సూచించారు.

## పార్టీకి రాజీనామా... ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ వైరల్?



తెలంగాణ ఉద్యమ పార్టీ అయిన భారత రాష్ట్ర సమితికి మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజీనామా చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మేరకు సోషల్ మీడియాలో కాంగ్రెస్... పోస్టులు కూడా పెట్టింది. దీంతో... నిజంగానే ఆర్ఎస్ ప్రవీణ్... పార్టీ మారుతున్నారని అందరూ చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఇస్తారని.. జోరుగా ప్రచారం జరిగింది. కానీ చివరి క్షణంలో దాసోజు శ్రవణ్ కు ఛాన్స్ ఇచ్చారు కల్వకుంట్ల చంద్రశేఖర రావు. ఇలాంటి నేపథ్యంలో.. నిజంగానే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పార్టీ మారబోతున్నట్లు చర్చ జరిగింది. అయితే రాజాగా దీనిపై క్లారిటీ ఇచ్చారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. తన రాజకీయ భవిష్యత్తుపై గత రెండు రోజులుగా కాంగ్రెస్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఈ చిల్లర వేషాలు మానుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. నేను రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానో.... ఏ వర్గాల ప్రజల కోసం వచ్చాను తనకు తెలుసు అన్నారు. పదవుల కోసం అస్సలు నేను రాలేదని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో తరతరాలుగా అణిచివేతకు గురైన వర్గాల విముక్తికి.... కెసిఆర్ స్థాపించిన గులాబీ పార్టీ సరైన వేదిక అని బలంగా నమ్మి ముందుకు వెళ్తున్నా అని ప్రకటించారు. రేపు కల్వకుంట్ల చంద్రశేఖర రావు మరోసారి ముఖ్యమంత్రి అవుతారని... అప్పుడు తెలంగాణ ప్రభుత్వంలో ఎలా ముందుకు వెళ్లాలో అనే దానిపైన ఇప్పటినుంచి ఆలోచన చేస్తున్నట్లు క్లారిటీ ఇచ్చారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. కానీ అనవసరంగా కాంగ్రెస్పార్టీ సోషల్ మీడియా తనపై ఫోకస్ చేసి తప్పుడు ప్రచారం చేస్తూ ఉందని.. ఆగ్రహం వ్యక్తం చేశారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ఇకపై ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తే... ఊరుకునేది లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం హస్తవ్యస్తమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు తెలంగాణను మళ్ళీ సరిదిద్దుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.





## రూ. 5 కోట్ల భూమికి రూ. 20 లక్షలు ఇస్తారా? హైదరాబాద్‌లో RRR బాధితుల ధర్నా

హైదరాబాద్ బంజారాహిల్స్ లో ఆర్ఆర్ఆర్ బాధితులు ఆందోళనకు దిగారు. భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలంటూ బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రిజినల్ ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు. చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల నుంచి వచ్చారు ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు. మార్కెట్ విలువ రూ.5 కోట్లకు పైగా ఉంటే ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే చెల్లిస్తోందని...తమ భూములకు మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు బాధితులు. మూడేళ్ళ నుంచి న్యాయం చేయాలని అన్ని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఆర్ఆర్ఆర్ బాధితులు. మున్సిపాలిటీల మధ్యలో నుంచి కాకుండా ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. వరంగల్ హైవే కోసం, కాళేశ్వరం కాలువల నిర్మాణానికి, ఎలక్ట్రిసిటీ హైటెన్షన్ టవర్స్ కోసం, యాదగిరి గుట్ట రోడ్స్ డెవలప్మెంట్ కోసం ప్రభుత్వం ఇప్పటికే తమ భూములు తీసుకుందన్నారు బాధితులు. అభివృద్ధి పేరుతో మళ్లీ తమ భూములను లాక్కుంటే వ్యవసాయం ఎలా చేసుకోవాలని..ఎలా బతకాలని ప్రశ్నించారు. భూముల కోల్పోతున్న బాధిత రైతులకు ప్రత్యామ్నాయం చూపి..సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ట్రిపుల్ ఆర్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా ప్రభుత్వం ట్రిపుల్ నార్త్ పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే దీనికి సంబంధించిన భూసేకరణ పూర్తయింది. 161.518 కిలోమీటర్ల( ట్రిపుల్ ఆర్ నార్త్) రోడ్డును రూ.7104.06 కోట్లతో నిర్మిస్తున్నారు.

## కాంగ్రెస్ ఫనైపోయింది - హరీష్ రావు




కాంగ్రెస్ - బిఆర్ఎస్ మధ్య రోజు రోజుకు వేడి పెరుగుతోంది. ఇదే క్రమంలో బీఆర్ఎస్ పార్టీ తన రజతోత్సవ సభను గ్రాండ్‌గా నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. వరంగల్ నగరాన్ని ఇందుకు వేదికగా ఎంచుకుని భారీ సభ ఏర్పాటు చేయాలని డిసైడ్ అయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు వరంగల్ అనుబంధమైన ప్రదేశమని, ఇక్కడే రజతోత్సవ సభను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, కేంద్ర ప్రభుత్వం కూడా వాటిని అనుసరిస్తోందని పేర్కొన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలకు ఎవరు సమర్థులు, ఎవరు అసమర్థులు అన్న విషయం స్పష్టమైందన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమితో, రేవంత్ రెడ్డిపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని హరీష్ రావు విమర్శించారు. అంతేకాక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, సాధారణ ప్రజలకు ఎలాంటి మేలు చేయలేకపోతుందన్న విషయం ప్రజలకు అర్థమైందని, రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీదే విజయం అని ధీమా వ్యక్తం చేసారు. వరంగల్ సభను లక్షలాది మందితో ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించిందని హరీష్ రావు తెలిపారు. తెలంగాణ కోసం 14ఏళ్ల ఉద్యమం, 9ఏళ్ల పరిపాలనలో బీఆర్ఎస్ చేసిన సేవలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ సభ ముఖ్యమైనదని చెప్పారు. వరంగల్ సభ విజయవంతం అయితే, అది బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చే బాటను మరింత దృఢంగా చేస్తుందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి ఆగిపోయిందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అనివార్యమని ఆయన స్పష్టం చేశారు.



## లిఫ్ట్ వచ్చిందనుకుని అడుగుపెట్టి..

సిరిసిల్ల: సిరిసిల్లలో ఓ భవనంలో లిఫ్ట్ ప్రమాదం జరిగింది. లిఫ్ట్ వచ్చిందనుకుని లోపలికి అడుగుపెట్టడంతో 17వ పోలీసు బెటాలియన్ కమాండెంట్ గంగారాం (58) కిందపడ్డారు. మూడో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై ఆయన పడటంతో తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించేలోపే గంగారాం మృతిచెందారు. స్నేహితుడిని కలిసి తిరిగి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గంగారాం స్వస్థలం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సిద్దులం.

## రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణం: మంత్రి కోమటిరెడ్డి



దిల్లీ: రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "సంగారెడ్డి - భువనగిరి - చౌటుప్పల్ వరకు ఆర్ఆర్ఆర్ టెండర్ల ప్రక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం భూసేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు" అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.



# సిరియాలో ప్రతీకార హత్యలు.. ఎక్కడ చూసినా శవాలే..!

సిరియాలో అంతర్యుద్ధం తీవ్ర స్థాయిలో జరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. గత 48 గంటల్లోనే 745 ప్రతీకార హత్యలు చోటుచేసుకొన్నాయి. చాలా ప్రాంతాల్లోని మైనార్టీలైన అలావైట్లను అణచివేసే దిశగా ఈ దాడులు జరుగుతున్నాయి. గురువారం అసద్ మద్దతుదారులపై హెచ్‌టీఎస్ ప్రభుత్వానికి అనుకూల సాయుధులు దాడులు చేయడంతో ఘర్షణలు మొదలయ్యాయి. ఈక్రమంలో అసద్ మద్దతుదారులను వెతికి మరీ చంపుతున్నట్లు ఓ బాధితుడు వెల్లడించాడు. వీధుల్లో శవాలు పడి ఉన్నాయని.. మగవారిని ఇళ్ల పైకప్పు మీదకు చేర్చి కాల్చేస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బనియాస్ అనే ప్రాంతంలో రోహిబ్ కమెల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి బాత్రూమ్‌లో దాక్కొని ప్రాణాలు కాపాడుకొన్నాడు. ఈ విషయాన్ని అతడే ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించాడు. "మా పొరుగు వారిపై సాయుధ మిలిటెంట్లు దాడులు చేస్తుండటంతో.. మేము లైట్లు ఆర్పేసి.. దాక్కొన్నాము. వీధుల్లో మృతదేహాలున్నాయి. ఈ పిల్లలు ఏం తప్పు చేశారు. అసద్ పాలన అంతం కావడానికి వీరు కూడా మద్దతు పలికారు" అని కమెల్ వెల్లడించాడు. ఇక సమీర్ హైదర్ అనే బాధితుడు మాట్లాడుతూ తన ఇంటిలోకి సాయుధులు చొచ్చుకొచ్చి తన ఇద్దరు సోదరులు, అల్లుడిని హత్య చేసినట్లు వెల్లడించాడు. వాస్తవానికి అతడు అలావైట్ వర్గానికి చెందినా.. సుదీర్ఘకాలంగా అసద్‌ను వ్యతిరేకిస్తూ వచ్చాడు. దాదాపు పదేళ్లు జైల్లో గడిపాడు. ఇక రేవు నగరమైన లటాకియాలో పరిస్థితి ఘోరంగా ఉంది. అక్కడ ప్రభుత్వ సాంస్కృతిక కేంద్రం అధిపతి యాసిర్ సబౌహ్‌ను గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపారు. అతడి ఇంటి ఎదుటే మృతదేహాన్ని పడేశారు. ఈ తీర ప్రాంత నగరంలో అలావైట్లు అత్యధికంగా ఉంటారు. ప్రస్తుతం అక్కడే అత్యధిక హింస చోటుచేసుకుంటోంది. మొత్తంగా మార్చి 6 నుంచి ఈ హింసలో 973 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. మరోవైపు దేశంలో తాజాగా చెలరేగిన హింసపై దర్యాప్తు చేస్తామని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారా ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అదే సమయంలో అసద్ వర్గానికి చెందినవారు, విదేశీ శక్తుల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. ప్రస్తుతం తాము సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నామన్నారు. సరికొత్త ముప్పును తాము ఎదుర్కొంటున్నామన్నారు. తమ దేశాన్ని అంతర్యుద్ధం దిశగా లాగుతున్నారన్నారు. సిరియాలో అలావైట్లు మతపరమైన మైనారిటీలు.. దేశ జనాభాలో వారు 12శాతం ఉంటారు. వారి మూలాలు షియా ముస్లింలలో ఉన్నాయి. అయితే వారి విశ్వాసాలు, పద్ధతులు భిన్నంగా ఉంటాయి. చారిత్రకంగా చూస్తే అలావైట్లు.. సిరియా తీర ప్రాంతంలో ఉంటారు. అదీ లటాకియా, టార్టస్‌లలో అధికంగా ఉంటారు. సిరియాను ఐదు దశాబ్దాలపాటు పాలించిన అసద్ కుటుంబం అలావైట్ల వర్గానికి చెందినదే. గత డిసెంబరు వరకు వారిదే ఆధిపత్యం. అసద్ పాలనలో అలావైట్లు కీలక స్థానాల్లో కొనసాగారు. సైన్యంలో, ప్రభుత్వంలో వారిదే పైచేయి.




# నకిలీ ఉద్యోగాలతో చీటింగ్.. 540 మంది భారతీయులకు విముక్తి

దేశంలో ఇప్పుడు జాబులు దొరకడం చాలా కష్టమైంది. ఒక్క జాబు కోసం పది మంది పోటీపడుతున్నారు. ఎవరైనా జాబ్ ఇస్తామంటే చాలు ముందూ వెనుకా ఆలోచించకుండా వచ్చేస్తున్నారు. ఇదే సైబర్ ముఠాలకు అవకాశమైంది. కొందరు భారతీయులకు వలవేసి కల్లోల ప్రాంతాల్లో కాల్ సెంటర్లు పెట్టి వారితో గొడ్డు చాకిరీ చేయించుకుంటున్న ఘటన వెలుగుచూసింది. నకిలీ ఉద్యోగాల ఆఫర్లతో మోసపోయి చిక్కుకున్న 540 మంది భారతీయులను మయన్మార్ సైన్యం రక్షించింది. వీరిలో 283 మందిని భారత వైమానిక దళం సోమవారం స్వదేశానికి తరలించింది. మిగతా బాధితులను మంగళవారం రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీరిలో కనీసం 42 మంది తెలుగు రాష్ట్రాలకు చెందినవారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. విముక్తి పొందిన భారతీయుల తరలింపునకు సంబంధించి ఆయన సమాచారం పంచుకున్నారు. సైబర్ ముఠాలు నకిలీ ఉద్యోగ ఆఫర్లతో యువతను ఆకర్షించి థాయిలాండ్, కంబోడియా, లావోస్, మయన్మార్‌లలోని నకిలీ కాల్ సెంటర్లకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. విదేశీ వ్యవహారాల శాఖ తెలిపిన వివరాల ప్రకారం... థాయ్‌లాండ్–మయన్మార్ సరిహద్దు ప్రాంతాల్లో నకిలీ కాల్ సెంటర్లను నడుపుతున్న సైబర్ ముఠాలు బాధితులను బలవంతంగా మోసపూరితమైన సైబర్ నేరాలకు ఉపయోగించాయి. బాధితులను మయన్మార్ సైన్యం రక్షించినట్టు పేర్కొంది. మయన్మార్, థాయిలాండ్‌లోని భారత రాయబార కార్యాలయాలు స్థానిక అధికారుల సహకారంతో వీరిని స్వదేశానికి రప్పించాయి. బాధితులను తొలుత థాయిలాండ్‌లోని మే సోట్ నగరానికి తరలించి, అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి పంపించారు. నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ ఉద్యోగ ఆఫర్లపై ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను అంగీకరించే ముందు భారత రాయబార కార్యాలయాలు, నియామక ఏజెంట్లు, సంబంధిత కంపెనీల ద్వారా ఆ అవకాశాల నిజమైనవో కావో నిర్ధారించుకోవాలని సూచించింది. ఇప్పటివరకు చైనాకు చెందిన సైబర్ ముఠాల నుండి 540 మంది భారతీయులను మయన్మార్ పోలీసులు రక్షించారు. అయితే స్వదేశానికి వెళ్లేందుకు ఇష్టపడని దాదాపు 1500 మంది భారతీయులు ఇంకా ఈ ముఠాలలోనే ఉన్నట్టు సమాచారం. మయన్మార్‌లో రక్షించిన బాధితులను థాయ్‌లాండ్ సరిహద్దులోని శిబిరాలకు తరలించి, అక్కడి నుండి భారత్‌కు పంపే ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరిలోనే వీరిని రక్షించినప్పటికీ, లాజిస్టిక్ సమస్యల కారణంగా తరలింపు ఆలస్యమైందని అధికారులు వెల్లడించారు.

# మరో సంచలనం : ప్రపంచ దేశాలకు అమెరికా సాయం కట్ చేసిన ట్రంప్!






అమెరికా ప్రభుత్వం అంతర్జాతీయ సహాయ కార్యక్రమాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఎయిడ్) ద్వారా నడుస్తున్న వేలాది కార్యక్రమాలకు ముగింపు పలకనున్నట్లు అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు.

**–5200 కాంట్రాక్టుల రద్దు...** అమెరికా ప్రభుత్వం చేపట్టిన ఆరు వారాల సమీక్ష అనంతరం యూఎస్ఎయిడ్‌లోని 83% కార్యక్రమాలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకుంది. దాదాపు 5200 కాంట్రాక్టులను రద్దు చేసినట్లు రూబియో వెల్లడించారు. "ఇప్పటివరకు వేలాది కోట్ల డాలర్లు వెచ్చించినా, ఆశించిన ఫలితాలు రాలేదు. కొన్నిచోట్ల ప్రతికూల ప్రభావాలు కూడా కనిపించాయి. అందుకే అమెరికా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ సంస్కరణలను చేపట్టాం," అని ఆయన ట్విటర్ ద్వారా వెల్లడించారు.

**–కాంట్రాక్టుల తగ్గింపునకు కారణాలు..** విదేశాంగశాఖ మంత్రి ప్రకటన ప్రకారం, ఈ చర్యలు అమెరికా ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకున్న చర్యలుగా పేర్కొన్నారు. అమెరికా కాంగ్రెస్‌లో చర్చించిన అనంతరం, కొన్ని కీలక కార్యక్రమాలను మాత్రం కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, యూఎస్ఎయిడ్ నిధుల కుదింపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**–ట్రంప్ పాలనలో ప్రారంభమైన ప్రక్షాళన...** అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన డొనాల్డ్ ట్రంప్, యూఎస్ఎయిడ్ నిధుల కుదింపుపై ప్రత్యేక దృష్టి సారించారు. అంతర్జాతీయ సహాయ నిధులను తాత్కాలికంగా నిలిపివేయడంతో పాటు, అనేక మంది ఉద్యోగులను తొలగించారు. ఈ నిర్ణయాలకు వ్యతిరేకంగా న్యాయస్థానాల్లో అనేక దావాలు కూడా నమోదయ్యాయి.

**–భవిష్యత్తులో ప్రభావం...** యూఎస్ఎయిడ్ ద్వారా అభివృద్ధి చెందుతున్న అనేక దేశాల్లోని ప్రాజెక్టులు ఈ నిర్ణయంతో ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆరోగ్య, విద్య, పేదరిక నిర్మూలన తదితర రంగాల్లో ఈ మార్పులు తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. అమెరికా ప్రభుత్వ ఈ సంస్కరణలు ప్రపంచ రాజకీయాల్లో మరిన్ని చర్చలకు దారితీయనున్నాయి.

# మహారాష్ట్రను ఊపేస్తోన్న ఔరంగజేబ్ రాజకీయ వివాదమేంటి?





మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ చరిత్రను గురించి ప్రతిసారి కొత్త వివాదాలు చెలరేగుతూనే ఉంటాయి. తాజాగా మహారాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సమాజ్వాదీ పార్టీ ఎమ్మెల్యే అబు అజ్మీ చేసిన కొన్ని వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారి తీశాయి. ఆయన "ఔరంగజేబ్ పాలనలో ప్రపంచ జీడీపీలో మన దేశ వాటా 24శాతంగా ఉంది. అప్పుడు భారతదేశాన్ని బంగారు పిచ్చుక అని పిలిచేవారు. ఔరంగజేబ్ అనేక ఆలయాలు నిర్మించాడు" అంటూ మాట్లాడారు.

**– ఔరంగజేబ్ పై వచ్చిన విమర్శలు...** ఔరంగజేబ్ పాలనకు సంబంధించిన వివాదాలు కొత్తవి కావు. అతను హిందూ దేవాలయాలను ధ్వంసం చేసాడనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. కాశీ విశ్వనాథ్ ఆలయాన్ని కూల్చి అక్కడ మసీదు నిర్మించాడని, హిందూ రాజులను తీవ్రంగా దెబ్బతీశాడని విమర్శలు ఉన్నాయి. అలాగే తన సొంత కుటుంబ సభ్యులను, సహోదరులను హత్య చేయించాడని, తన తండ్రిని (షాజహాన్) కాజీపట్టిన ఖైదులో ఉంచాడని కథనాలు ఉన్నాయి. ఈ కారణంగా అతని పాలనను సంప్రదాయ వాదులు, హిందుత్వవాదులు తీవ్రంగా విమర్శిస్తుంటారు.


**– రాజకీయ ప్రభావం...** ఔరంగజేబ్ గురించి అబు అజ్మీ చేసిన వ్యాఖ్యలు మహారాష్ట్రలో బీజేపీ, శివసేన (శిందే వర్గం) నాయకుల నుండి తీవ్ర వ్యతిరేకతకు గురయ్యాయి. ఆయన వ్యాఖ్యలను భాజపా నేతలు భారతీయ సంస్కృతిని అవమానించేలా ఉన్నాయని, అతను చరిత్రను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ ఔరంగజేబ్ నీచచరిత్ర ను తెలుసుకోవాలని.. చరిత్రను వక్రీకరించవద్దని.. అతడి కూరత్వాన్ని అర్థం చేసుకోవాలని హితవు పలికారు. 2015లో ఔరంగాబాద్ నగరాన్ని సంబాజీనగర్‌గా మార్చాలని ప్రతిపాదించారు. ఇది మరాఠా సామ్రాజ్యపు సంబాజీ మహారాజ్ పేరు మీదకు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.. అయితే ఈ మార్పు వివాదాస్పదంగా మారింది. ఇటీవలి కాలంలో ఔరంగజేబు సమాధి చుట్టూ కూడా వివాదాలు చోటుచేసుకున్నాయి, కొన్ని సమూహాలు అతని సమాధిని తొలగించాలనే డిమాండ్ చేశారు. ఈ వివాదాలు మహారాష్ట్రలో మతపరమైన, రాజకీయ అంశాలపై చర్చలకు దారితీశాయి.

**–సామాజిక వర్గాల ప్రతిస్పందన...** ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. కొంతమంది ఔరంగజేబ్‌ను అతిపెద్ద మతతత్వ పాలకుడిగా అభివర్ణిస్తుంటే, మరికొందరు అతని పరిపాలనా విధానాన్ని సమర్థిస్తున్నారు. అయితే భారతీయ చరిత్రకారులు కూడా ఈ అంశంపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఔరంగజేబ్‌ను క్రూరుడైన పాలకుడిగా, మతపరమైన అసహనం కలిగిన చక్రవర్తిగా పేర్కొనగా మరికొందరు అతన్ని పరిపాలనా పరంగా చారిత్రక ఆధారాలు ఖచ్చితమైనవి లేవని అభివర్ణిస్తున్నారు. ఔరంగజేబ్ చరిత్ర ఎంత వివాదాస్పదమైనదో, అతనిపై రాజకీయ దుమారం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఒకవైపు అతనిని దేశానికి నష్టం చేసిన చక్రవర్తిగా అభివర్ణిస్తుంటే, మరొకవైపు అతను దేశ ఆర్థిక స్థితిని బలోపేతం చేశాడని కొన్ని వర్గాల వారు పేర్కొంటారు. కానీ, చరిత్రను రాజకీయ అవసరాలకు అనుగుణంగా వక్రీకరించకూడదనే వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చారిత్రక అంశాలను అధ్యయనం చేసి, వాస్తవాలను తెలుసుకోవడం మనందరి బాధ్యత.

ఇప్పటికైనా ఇలాంటి రాజకీయ వివాదాల్లో పరిణతిగా రాజకీయ నాయకులు మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఏమిటీ జపాన్ డైట్? వారెందుకు ఆరోగ్యంగా ఉంటారు?

తినే తిండి.. ఉండే పరిసరాలు.. చుట్టూ ఉండే వాతావరణం ఏదీ ఆరోగ్యవంతంగా ఉండదన్న భావన అంతకంతకూ పెరుగుతోంది. ఇందుకు భిన్నంగా ఉంటుంది జపాన్. అక్కడి ప్రజలు వయసు మీద పడుతున్నా.. చలాకీగా ఉండటమే కాదు.. ఆరోగ్యంతో జీవిస్తుంటారు. దీనికి కారణం వారు తీసుకునే ఆరోగ్యకరమైన ఆహారం కూడా కారణమని చెబుతారు. జపనీయుల డైట్ చూస్తే.. వారి ఆరోగ్య రహస్యం ఇట్టే తెలుస్తుందన్నమాట వినిపిస్తూ ఉంటుంది. ఇంతకీ జపాన్ డైట్ లో ఏం ఉంటుంది? ప్రపంచంలోని అత్యుత్తమ ఆహార విధానాల్లో జపాన్ డైట్ ఎందుకు నిలిచింది? లాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతికితే.. మనం తెలుసుకోవాల్సినవి.. మనం మార్చుకోవాల్సిన ఆహార అలవాట్లు ఇట్టే అర్థమవుతాయి. ఆకలిగి మించి ఆహారం తీసుకోవటానికి జపనీయులు ఇష్టపడరు. తాము కడుపు నిండుగా తినకుండా అవసరమైన ఆహారానికి 80 శాతం మాత్రమే ఫుడ్ తీసుకోవటం.. 20 శాతం కడుపును ఖాళీగా ఉ



ంచుకోవటం వారు అనుసరించే విధానాల్లో ఒకటి. అది చిన్నప్పటి నుంచే పిల్లలకు నేర్పిస్తారు. జపనీయులు తాజాగా తయారు చేసిన ఆహారానికి ప్రాధాన్యతను ఇస్తారు. నూనెలు తక్కువగా వినియోగిస్తారు. పాలు.. వెన్నె.. పెరుగు.. ఐస్ క్రీం లాంటి పాల ఉత్పత్తులు.. కొవ్వు శాతం ఎక్కువగా ఉండే నూనెలు.. వెన్నె.. సాస్ లు.. ఆహారాన్ని నిల్వ ఉంచేందుకు రసాయనాలు వినియోగించరు. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే సాల్మన్.. ట్యూనా లాంటి చేపలు.. సముద్రపు నాచును తీసుకుంటారు. ఇది చాలా శక్తివంతమైన ఆహారం. ఇందులో కణాల్ని ఆరోగ్యంగా ఉంచే విటమిన్ ఎ..సీ.. ఇ.. కెరోటినాయిడ్లు.. ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఈ కారణంతోనే ఒబెసిటీ సమస్య తక్కువగా ఉండే దేశాల్లో జపాన్ ఒకటిగా నిలిచింది. ఆహారాన్ని నములుతూ తినటం.. నిదానంగా తినటం.. తక్కువ మోతాదులో ఆహారాన్ని తీసుకోవటం.. అందుకు చిన్న ప్లేట్లు.. గిన్నెల్ని వినియోగించటం లాంటివి చేస్తారు. ఆహారాన్ని తీసుకోవటానికి ముందు గ్రీన్ టీ తీసుకోవటం వారికి అలవాటు.

## విచారణ వేళ మాటలతో హింసిస్తున్నారు..

# కోర్టులో రన్యారావు కన్నీళ్లు

దుబాయ్ నుంచి వస్తూ.. దొంగచాటుగా పద్నాలుగు కేజీల బంగారాన్ని తనతో తీసుకొస్తూ అడ్డంగా దొరికిపోయిన సినీ నిరన్యారావు ఉదంతం తెలిసిందే. పెను సంచనలంగా మారిన ఈ ఉదంతం నేపథ్యంలో ప్రస్తుతం ఆమె డీఆర్ఐ కస్టడీలో ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఆమెకు చెందిన ఒక ఫోటో వైరల్ గా మారటం తెలిసిందే. కళ్ల కింద గాయమైనట్లుగా.. ముఖం ఉబ్బి ఉన్న ఫోటో విడుదలతో.. ఆమెను శారీరకంగా హింసిస్తున్నారన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బెంగళూరు సెషన్స్ కోర్టులో ఆమెను హాజరుపర్చారు. ఈ సందర్భంగా ఆమెను న్యాయమూర్తి ప్రశ్నిస్తూ.. కస్టడీలో ఏమైనా భౌతిక దాడులు జరిగాయా? అని అడగ్గా.. తనను శారీరకంగా ఏమీ ఇబ్బందులకు గురి చేయటం లేదని.. మాటలతో హింసిస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా కన్నీటిపర్యంతమయ్యారు. అయితే.. ఆమెను మానసికంగా హింసిస్తున్నారన్న మాటల్లో నిజం లేదని.. ఆమె వాదన తప్పని డీఆర్ఐ ఖండించింది. ఇందులో ఎలాంటి వాస్తవం



లేదని.. రూల్ ప్రకారమే ఆమెను ప్రశ్నిస్తున్నట్లుగా పేర్కొంది. కళ్ల కింద గాయాలున్న ఫోటో విడుదల నేపథ్యంలో కర్ణాటక మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు ఆమెపై దాడికి పాల్పడ్డారా? అన్న ప్రశ్నను మహిళా కమిషన్ ఛైర్మన్ నాగలక్ష్మీ చౌదరి లేవనెత్తారు. తమకు నేరుగా ఈ అంశంపై దర్యాప్తు చేసే అవకాశం లేదని.. రన్యారావు తమకు కంప్లైంట్ చేస్తే.. ఆమెకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. తమకు లేఖ రూపంలో కంప్లైంట్ చేస్తే సరిపోతుందన్నారు. అదే జరిగితే అన్ని విభాగాల్ని అప్రమత్తం చేయటంతో పాటు..సరైన రీతిలో దర్యాప్తు చేసి రిపోర్టు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఆమె ఏమైనా దాడికి గురైందా? అన్నది ఆమె కంప్లైంట్ రూపంలో ఇస్తేనే తాము ఏమైనా చేయగలమన్న నాగలక్ష్మీ.. తమను సంప్రదించకపోతే.. ఈ అంశంపైన తాము కనీసం మాట్లాడలేమని పేర్కొన్నారు. మరి.. కస్టడీలో తనకు ఎదురవుతున్న పరిస్థితుల గురించి మహిళా కమిషన్ కు రన్యారావు లేఖ రాస్తారా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది.

చురకలు

## సంపాదకీయం

# ఏఐలో ఉద్యోగాలు ఎంత భారీగా వస్తాయంటే?

సరికొత్త సాంకేతికత అందుబాటులోకి వచ్చినంతనే.. ఉద్యోగాలకు కోత పడుతుందన్న భావన మొదట్నించి ఉన్నదే. అయితే.. కొత్త ఆవిష్కరణలతో మరిన్ని ఉద్యోగాలు లభిస్తాయే తప్పించి తగ్గవన్న విషయాన్ని మర్చిపోకూడదు. ఎందుకుంటే.. ఆయా రంగాల విస్తరణ.. ఉపాధి అవకాశాల్ని మరింత పెంచేలా చేస్తుంది. చేతితో పనులు చేసే స్థానే మెషిన్లు వచ్చినప్పుడు వాటిపైన వ్యతిరేకత భారీగా ఉండేది. మెషిన్లు ఉపాధి అవకాశాలు కోల్పోయేలా చేస్తాయని. కానీ.. మనిషి పరిణామ క్రమాన్ని చూస్తే.. అవన్నీ ఉత్త భయాలే అన్న విషయం ఇట్టే అర్థమవుతుంది. కొద్ది రోజులుగా ఏఐ (కృత్రిమ మేధ)తో ఉద్యోగాలు భారీగా పోతాయని.. ఐటీ సంస్థలు ఉద్యోగుల్ని తొలగిస్తాయన్న ఆందోళన మార్కెట్ లో భారీగా ఉంది. అయితే.. అమెరికాకు చెందిన మేనేజ్ మెంట్ కన్సల్టింగ్ కంపెనీ బెయిన్ అండ్ కంపెనీ ఒక అధ్యయనాన్ని చేపట్టింది. ఇందులో పేర్కొన్న అంశాలు ఆసక్తికరంగానే కాదు.. భవిష్యత్ మీద మరింత భరోసాను కలుగజేసేలా ఉన్నాయని చెప్పక తప్పదు. కృత్రిమ మేధకు సంబంధించి అంతర్జాతీయ నిపుణుల కేంద్రంగా మన దేశం మారుతుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. ఈ విషయంలో నైపుణ్య అంతరం మీదనే సందేహాలు ఉన్నాయని చెప్పొచ్చు. 2027 నాటికి 10 లక్షల మందికి పైగా ఏఐ నిపుణుల కొరత ఏర్పడొచ్చున్న అంచనా వ్యక్తమవుతోంది. ఈ అవకాశాల్ని సొంతం చేసుకోవటానికి వీలుగా ఈ నైపుణ్యాల మీద పట్టు సాధించటం అవసరమని చెబుతున్నరు. 2027 నాటికి మార్కెట్ లో ఉండే ఏఐ నిపుణులకు 1.5 – 2 రెట్లు ఉద్యోగాలు కనిపిస్తాయని.. అదే సమయంలో ప్రస్తుత సిబ్బందిలో కచ్చితంగా 10 లక్షల మందికి ఏఐ నైపుణ్యాల్ని నేర్పించాల్సి ఉంటుంది. 2019 నుంచి ఏఐ ఆధారిత ఉద్యోగాలు పెరగటంతో పాటు. ఏటా దీని వృద్ధి 21 శాతంగా ఉంది. ఏఐ నిపుణుల జీతాలు సైతం ఏటా 11 శాతం చొప్పున పెరుగుతున్నాయి. గిరాకీ.. ఆకర్షణీయ వేతనాలు.. అర్హత కలిగిన ఏఐ ప్రతి నిపుణుల కొరత కనిపిస్తోంది. ఇక్కడే మరో ఆందోళన కలిగించే అంశాన్ని చెబుతున్నారు. ఏఐలో మహిళల సంఖ్య తక్కువగా ఉండటం సమస్య మాత్రమే కాదు.. భవిష్యత్తు నిర్మాణానికి ఇబ్బందిగా చెబుతున్నారు. ఏఐలోని వ్యక్తుల్లో వైవిధ్యం ప్రతిబింబించాలని లేదంటే భవిష్యత్తులో ఇప్పటి పక్షపాత ధోరణులే ఉంటాయని చెబుతున్నారు. అందుకే.. ఏఐలోకి పెద్ద ఎత్తున అమ్మాయిలు ముందుకు రావాలన్న మాట బలంగా వినిపిస్తోంది. ఏఐ ప్రతి మనిషి జీవితాన్ని.. అంశాన్ని మారుస్తుందని.. డేటాపైన ఆధారపడే అది పని చేస్తుందని చెప్పారు మైక్రోసాఫ్ట్ ఇండియా.. దక్షిణాసియా చీఫ్ పార్టనర్ ఆఫీసర్ హిమానీ అగర్వాల్. సో.. ఏఐ కారణంగా వచ్చే సమస్యల గురించి ఎక్కువగా ఆలోచించే కన్నా.. దానితో వచ్చే అవకాశాల మీద ఫోకస్ పెట్టటం చాలా అవసరం.

# లక్షలాది మందికి స్ఫూర్తి దాయకం... ఉప్పు సత్యాగ్రహం - మార్చి 12...ఉప్పు సత్యాగ్రహ ప్రారంభ దినం

తొమ్మిది దశాబ్దాల క్రితం జాతిపిత మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘట న. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం. ఉప్పు సత్యాగ్రహ ప్రచారం గాంధీ ప్రవచించిన సత్యాగ్రహ సూత్రాలపై ఆధార పడింది.1930 ప్రారంభంలో, బ్రిటిషు పాలన నుండి భారత సార్వభౌమత్వాన్ని, స్వయం పాలననూ సాధించు కోవటానికి భారత జాతీయ కాంగ్రెస్, తన ప్రధాన వ్యూహం గా సత్యాగ్రహాన్ని ఎంచుకుంది. ప్రచారాన్ని నిర్వహించడానికి గాంధీని నియమించింది. 1882 బ్రిటిషు ఉప్పు చట్టాన్ని గాంధీ తమ సత్యాగ్రహ మొదటి లక్ష్యంగా ఎంచుకున్నారు. గాంధీ, తన ప్రార్థన సమావేశాల లోనూ పత్రికలతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ, ప్రకటనలు ఇస్తూ ప్రపంచ వ్యాప్తంగా మీడియాను ఈ మార్చ్ కోసం సిద్ధం చేశాడు. మార్చ్‌కు ముందు రోజు సాయంత్ర పు ప్రార్థనలో గాంధీ చెప్పేది వినడా నికి వేలాది మంది భారతీయులు సబర్మతికి చేరుకున్నారు. అమెరి కన్ పత్రిక, ది నేషన్ ఇలా రాసింది: "గాంధీ ఇచ్చే పోరాట ప్రకటన వినడానికి 60,000 మంది ప్రజలు నది ఒడ్డున గుమిగూడారు. ఈ పోరాటపు పిలుపు బహుశా ఇప్పటి వరకు ఇచ్చిన పిలుపులన్నిటి లోకీ విలక్షణమైనది". భారతదేశంలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లం ఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రె సు జరిపిన అహింసాయుత సత్యా గ్రహమే ఉప్పు సత్యాగ్రహం. దీన్ని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ కూడా పిలుస్తారు. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ తీరం లోని దండి వద్ద ఉప్పు తయారు చేసాడు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించాడు. దండి సత్యాగ్రహం లో మహాత్ముని తో కలిపి 80మంది పాల్గొన్నారు. 1. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ, గుజరాత్, 2.ప్యారేలాల్ నయ్యర్, పంజాబ్, 3. ఛగన్‌లాల్ నాథ్థు భాయ్ జోషి,గుజరాత్, 4.పండిత నారాయణ్ మోరేశ్వర్ ఖరే మహా రాష్ట్ర, 5.గంపత్ రావ్ గోడ్సే మహారాష్ట్ర, 6.ప్రథ్వీరాజ్ లక్ష్మీదాస్



అషర్ గుజరాత్, 7.మహవీర్ గిరి 8. బాల్ దత్తాత్రేయ కాలేల్కర్ మహా రాష్ట్ర, 9.జయంతి నాథుభాయ్ పరేఖ్ గుజరాత్, 10 .రసిక్ దేశాయ్ గుజరాత్, 11. విఠల్ లీలాధర్ ఠక్కర్ గుజరాత్, 12. హరఖ్జీ రాంజీభాయ్ గుజరాత్, 13.తన్సుఖ్ ప్రన్శంకర్ భట్ట గుజరాత్, 14.కాంతిలాల్ హరి లాల్ గంధీ గుజరాత్, 15.ఛోటా భాయ్ ఖుషల్భాయ్ పటేల్ గుజ రాత్, 16.వాల్జీభాయ్ గోవింద్జీ దేశాయ్ గుజరాత్,17. పన్నాలాల్ బలభాయ్ ఝవేరిగుజరాత్, 18 .అబ్బాస్ వర్తేజీ గుజరాత్, 19. పుంజాభాయ్ షా కూడా గుజరాత్, 20. మాధవ్‌జీ భాయ్ ఠక్కర్ గుజరాత్, 21. నరంజీ భాయ్ గుజరాత్, 22.మగన్ భాయ్ వోర గుజరాత్, 23. దుంగార్సీ భాయ్ గుజరాత్, 24 .సోమాలాల్ ప్రాగ్జీ భాయ్ పటేల్ గుజరాత్, 25 .హస్ముఖ్రం జకాబార్ గుజ రాత్, 26. డౌడ్భాయ్ గుజ రాత్, 27.రాంజీభాయ్ వంకర్ గుజరాత్, 28. దినకర్‌రాయ్ పాండ్య గుజ రాత్, 29 .ద్వారకానాథ్ మహారాష్ట్ర, 30. గజానన్ ఖరే మహారాష్ట్ర, 31. జెథాలాల్ రూపా రెల్ కచ్ గుజరాత్, 32. గోవింద్ హర్కరే మహారాష్ట్ర, 33. పాండు రంగ్ మహారాష్ట్ర, 34.వినాయక్ రావ్ ఆప్టే మహారాష్ట్ర, 35. రాంధీర్ రాయ్ యునైటెడ్ ప్రావిన్స్, 36 .భాను శంకర్ దవే గుజరాత్, 37. మున్షిలాల్, 38. రాఘవన్ కేరళ, 39. రవీభాయ్ నాథలాల్ పటేల్ గుజరాత్, 40.షివభాయ్ గోఖల్భాయ్ పటేల్ గుజరాత్, 41. శంకర్భాయ్ భీకాభాయ్ పటేల్ గుజరాత్, 42. జష్భాయ్ ఇష్వర్భా య్ పటేల్ గుజరాత్, 43. సుమం గళ్ ప్రకాశ్, 44 థేవర్ తుండియిల్ టైటస్ కేరళ, 45. కృష్ణ నాయర్ కేరళ, 46 .తపన్ నైర్ కేరళ, 47. హరి దాస్ వర్జీవందాస్ గాంధీ గుజ రాత్, 48. చిమన్‌లాల్ నర్సిలాల్ షా గుజరాత్, 49. శంకరన్ కేర ళ, 50. సుబ్రహ్మణ్యం ఆంధ్రప్రదేశ్,51. రామనిక్లాల్ మగన్లాల్ మోది గుజరాత్, 52. మదన్ మోహన్ చతుర్వేది రాజస్థాన్,53. హరిలాల్ మహింతార మహారాష్ట్ర, 54. మోతీ బస్ దాస్ ఒడిశా, 55.హరిదాస్ ముజుందార్ గుజరాత్, 56 .ఆనంద్ హింగోరిని సింధ్, 57. మహదేవ్ మార్తాండ్ కర్నాటక, 58. జయంతిప్రసాద్ యునైటెడ్ ప్రావిన్స్, 59. హరిప్రసాద్ యునై టెడ్ ప్రావిన్స్, 60. అన్మగ్గా నారాయణ్ సిన్హా బీహార్,61.కేశవ్ చిత్రే మహారాష్ట్ర, 62 .అంబలాల్ శంకర్భాయ్ పటేల్ గుజరాత్, 63. విష్ణు పంత్ మహారాష్ట్ర, 64. ప్రేం రాజ్ పంజాబ్, 65. దుర్గేష్ చంద్ర దాస్ బెంగాల్,66. మాధవ్‌లాల్ గుజరాత్, 67.జ్యోతీరాం 68. సూరజ్ భాన్ పంజాబ్, 69. భైరవ్ దత్, 70 .లాల్జీ పర్మర్ గుజరాత్,71. రత్నజీ బోరీ గుజరాత్,72 .విష్ణు శర్మమహారాష్ట్ర,73. చింతామణి శాస్త్రి మహారాష్ట్ర, 74 .నారాయణ్ దత్ ,రాజస్థాన్,75.మనిలాల్ మోహన్‌దాస్ గాంధీ గుజరాత్, 76.సురేంద్ర, 77 .హరి కృష్ణ మోహిని మహారాష్ట్ర, 78 .పురతన్ బుచ్ గుజరాత్, 79 .ఖర్గ్ బహదూర్ సింఘ్ గిరి నేపాల్ సంస్థానం,80 .శ్రీ జగత్ నారాయణ్ ఉత్తర ప్రదేశ్. ప్రసిద్ద దండి యాత్రలో పాల్గొన్న ఈ సత్యాగ్రహులను గౌరవిస్తూ ఐటీ బొంబాయి అధికారులు ఒక స్మారక చిహ్నాన్ని ఏర్పాటుచేశారు. 1930 ఏప్రిల్ 6 న, ఉదయం 6:30 గంటలకు గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించినప్పుడు, ఇది కోట్లాది భారతీయులు బ్రిటిష ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున శాసనోల్లంఘన ఉద్యమం లో పాల్గొనడానికి స్ఫూర్తి నిచ్చింది. ఏప్రిల్ 6 ఉదయం, ప్రార్థన తరువా త, గాంధీ ఉప్పు బురదను పైకి లేపి, "దీనితో, నేను బ్రిటిష సామ్రాజ్య పునాదులను కదిలిస్తున్నాను" అని ప్రకటించారు. తరు వాత ఆయన దానిని సముద్రపు నీటిలో ఉడకబెట్టి, బ్రిటిష చట్టాన్ని ధిక్కరిస్తూ ఉప్పును తయారు చేశారు. తన వేలాది మంది అనుచరులను కూడా అదేవిధంగా సముద్ర తీరం వెంబడి "ఎక్కడ వీలుగా ఉంటే అక్కడ" ఉప్పును తయారు చేయమని చెప్పారు. గ్రామస్థులను కూడా ఉప్పును తయారు చేయమని చెప్పమని కూడా వారిని కోరాడు. ఇలా 79మందితో మహాత్ముడు ఈ కార్యక్రమం ప్రాంభించారు, సాధా రణంగా గాంధీ కార్యక్రమాలలో జనసమూహాన్ని తగ్గించి రాసే అధికారిక వార్తాపత్రిక ది స్టేట్స్‌మన్, సబర్మతి – అహ్మదాబాద్ రహదారిపై 1,00,000 మంది ప్రజలు ఉన్నారని పేర్కొనడం గమనార్హం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నిజాం వ్యతిరేక పోరాట యోధుడు మందుముల - మార్చి 12...మందుముల నరసింగరావు వర్ధంతి



శ్రీ మందుముల నర్సింగ్‌రావుగారు

మందుముల నరసింగరావు (మార్చి 17, 1896 – మార్చి 12, 1976) నిజాం విమోచన పోరాట యోధుడు, రాజకీయ నాయకుడు, పత్రికా రచయిత, న్యాయవాది, ఆంధ్ర జనసంఘ స్థాపకులు, సంఘ సంస్కర్త, పాలమూరు జిల్లాకు చెందిన సమరయోధుడు మందుముల నరసింగరావు మార్చి 17, 1896 న ప్రస్తుత రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో జన్మించారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన నరసింగరావు న్యాయ శాస్త్రంలో పట్టభద్రులు అయినారు. పర్షియన్ భాషలో కూడా అయన గొప్ప పండితులు, పత్రికా రచయితగా పేరు పొందారు. 1921లో ఆంధ్ర జనసంఘాన్ని స్థాపించిన వారిలో ఒకడు. 1927లో న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి పత్రికారచన, రాజకియాలు చేపట్టారు. 1927లో రయ్యత్ అనే ఉర్దూ వార్తాపత్రిక స్థాపించి సంపాదక బాధ్యతలు చేపట్టారు. మందుముల, సమర రంగంలో కూడా కీలకపాత్ర వహించి 1937లో ఇందూరు (నిజామాబాదు) లో జరిగిన 6వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. 1938–42 కాలంలో నిజాం లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. 1947లో జాయిన్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యారు. బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషి చేశారు. 1952లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యారు. 1957–62 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పని చేశారు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించారు. మందుముల నరసింగరావు... టేకుమాల రంగారావు, మాడపాటి హనుమంత రావు, మిట్ట లక్ష్మీనరసయ్య, ఆదిరాజు వీరభద్రరావు, నడింపల్లి జానకి రామయ్య, బూర్గుల రామకృష్ణా రావు, బోయినపల్లి వెంకట రామారావు, కొమ్మవరపు సుబ్బారావు బూర్గుల నరసింహా రావు, డాక్టర్ పందింటి రామస్వామి నాయుడు తదితరులతో కలిసి 'ఆంధ్ర జనసంఘం'ను స్థాపించారు. హైదరాబాద్ సంస్థాన ఆధునిక చరిత్రలో రావి నారాయణరెడ్డి, ముఖ్దూం మొహియుద్దీన్ వంటివారు అతివాద వర్గం ప్రతినిధులు కాగా, బూర్గుల రామ కృష్ణారావు, మందుముల నరసింగ రావు, మాడపాటి హనుమంత రావు, మాదిరాజు రామకోటీశ్వర రావుతదితరులు మితవాదులు. భువనగిరిలో జరిగిన ఆంధ్రమహా సభలకు వివిధ గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై వచ్చిన వారు...రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, మందుముల నరసింగరావు, బూర్గుల రామకృష్ణరావు లాంటి ప్రముఖులను ఎడ్ల బండ్ల మీద ఊరేగించారు. ఆయన బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషిచేశారు. 1952లో కల్వకుర్తి నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957–62 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పనిచేశాడు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించాడు. యాభై ఏళ్ల హైదరాబాదు నగర సమగ్రచరిత్ర ఈ గ్రంథం. హైదరాబాదు రాజకీయ సామాజిక జీవనంలో ప్రధానపాత్ర పోషించి, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన మందుముల నరసింగరావు కలం నుండి వెలువడిన రచన. ప్రత్యక్ష సాక్షిగా ఆయన కథనం. మందుముల నరసింగరావు కూతురు అనంతలక్ష్మిని బూర్గుల రామకృష్ణారావు రెండో వివాహం చేసుకున్నారు. సమర యోధుడిగా పేరుపొందిన మందుముల రామచంద్రారావు ఆయన సోదరుడు. మార్చి 12, 1976 న మందుముల మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో ఆంధ్రుల పాత్ర - మార్చి 12...ఉప్పు సత్యాగ్రహ ప్రారంభ దినం

భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లిం చేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేప ట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరేకించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. 1920 – 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది. ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... "గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం" అని అని పేర్కొన్నారు. ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజులకు ముందే బ్రిటిష్ వారు గాంధీని మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 78 మంది అనుచరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యాగ్రహం సమయంలోనే 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి... "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడి" అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల 'ది మదర్'ను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశ ద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే 'ఆంధ్రా




దండి'గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసుకున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలంగాణ గర్వించ దగిన గేయ కవి ... కందికొండ యాదగిరి - మార్చి 12... కందికొండ యాదగిరి వర్ధంతి

తెలుగు సినీ సాహిత్య చరిత్రలో ప్రజల మనసులను హత్తుకునే పదాలతో, సమాజపు చింతనలకు శబ్దాన్ని అందించిన గేయ రచయితల్లో కందికొండ యాదగిరి పేరు ప్రత్యేకంగా నిలుస్తుంది. సాంఘిక స్పృహ, ప్రాంతీయ సంస్కృతి, జీవిత యథార్థాల సమ్మేళనంగా ఆయన రచనలు మానవ హృదయాలను తాకేలా ఉండేవి. కందికొండ యాదగిరి 1973 అక్టోబరు 13న తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా, నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్యను స్వగ్రామంలో పూర్తి చేసిన ఆయన, మహబూబాబాద్ లో డిగ్రీ చదువుకున్నారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ (తెలుగు సాహిత్యం) మరియు ఎం.ఎ (పొలిటికల్ సైన్స్) పట్టాలు పొందారు. తెలుగు సాహిత్యంపై ఆయనకు ఉన్న ఆదరణ ఆయన జీవితానికి దిశను నిర్ణయించింది. కందికొండ విద్యార్థి దశ నుంచే పాటలు రాయడం ప్రారంభించారు. చక్రి తో ఉన్న పరిచయం సినీ రంగానికి మార్గాన్ని సిద్ధం చేసింది. చక్రి సంగీత దర్శకత్వంలో వచ్చిన 'ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం' సినిమాలో "మళ్లీ కూయవే గువ్వా" పాటతో సినిమాల్లో అడుగు పెట్టారు. ఆ పాట అద్భుతమైన ప్రజాదరణ పొందింది. అనంతరం పూరీ జగన్నాథ్ వంటి ప్రముఖ దర్శకులతో పనిచేశారు. ఇరవై సంవత్సరాల సినీ ప్రస్థానంలో 1300కు పైగా పాటలు రచించి, తెలుగు పాటల ప్రపంచానికి ఓ సరికొత్త హృదయా నుభూతిని అందించారు. కందికొండ గేయాలు తెలంగాణ జీవన విధానానికి అద్దంపట్టి నట్లుంటాయి. తెలంగాణ యాస, సంస్కృతి, బతుకు బడులు ఆయన రచనల్లో ప్రతిబింబిస్తాయి. ఆయన రాసిన బతుకమ్మ పాటలు పల్లె ప్రజల గుండె చప్పుడు లాగా మారాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన పాటలు ఉద్యమ కారులకు ప్రేరణగా నిలిచాయి. ఆయన గళం ఉద్యమ గీతంగా మారి, ఉద్యమ సంస్కృతికి ఓ అంతరాత్మగా నిలిచింది. కందికొండ రచించిన కొన్ని చిరస్మరణీయమైన పాటలలో...మళ్లీ కూయవే గువ్వా (ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం), గిచ్చి గిచ్చి, కొక్కొ కోలమిస్స, మల్లెతీగరోయ్ (ఆంధ్రావాలా), రెండు కళ్ళు సాలవట (లవ్ యు బంగారమ్), కదిలే కదిలే %-% ఆ చందమామ (మా అబ్బాయి), పూలే వారసులం, లాంటివి. సినీ గేయాలకే పరిమితమవకుండా, కందికొండ తెలంగాణ యాసలో ముచ్చటగా కవిత్వం రచించారు. ఆయన కవిత్వంలో పల్లె మనుగడ, మట్టిమనుషుల మనోభావాలు ప్రతిధ్వనించేవి. అలాగే కథకుడిగా కూడా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఆయన కథల్లో సామాజిక విమర్శ, వాస్తవికత స్పష్టంగా కనిపిస్తాయి. పాటలకే పరిమితమవకుండా, బతుకమ్మ నేపథ్యంలో రాసిన గీతాలు గ్రామీణ తెలంగాణకు ప్రతినిధిగా నిలిచాయి. మట్టిమనిషి జీవితాన్ని స్పృశించేలా ఆయన రచనలు ఉంటాయి. తెలంగాణ యాసలో హృదయాలను తాకేలా ఆయన పద ప్రయోగం ప్రత్యేకంగా నిలిచింది. కందికొండ గీతాల్లో తెలంగాణ స్వరూపం ప్రతిఫలించేది. ఆయన రచనలు ఉద్యమ గీతాలుగా మారాయి. "పోరాటం మొదలైంది..." వంటి పాటలు ఉద్యమ కారులకు శక్తినిచ్చాయి. తెలంగాణ సంస్కృతి, భాష, బతుకు బడులు ఆయన పదాల్లో పల్లవించారు. కందికొండ తెలుగు సినిమా పాటలపై పరిశోధన చేశారు. "సినిమా పాటలలో పరిస్థితుల ప్రభావం" అనే అంశంపై డాక్టరేట్ చేశారు. ఆయన రచనలకు అనేక పురస్కారాలు లభించాయి, తెలుగు చిత్రసీమలో తనదైన ముద్రవేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ , కందికొండ 2022 మార్చి 12న హైదరాబాదులో



తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం తెలుగు సినీ సాహిత్యానికి తీరని లోటుగా నిలిచింది. కవిగా, కథకుడిగా, ప్రజా గాయకుడిగా వెలుగొందిన కందికొండ యాదగిరి మృతితో తెలుగు సాహిత్యం ఓ విలక్షణ గళాన్ని కోల్పోయింది. కానీ ఆయన రచనలు మాత్రం ఇంకా ప్రతి పల్లెలో, ప్రతి ప్రదర్శనలో, ప్రతి గుండెల్లో శబ్దించతూనే ఉంటాయి. కందికొండ యాదగిరి పాటలతో ప్రజలను పలకరించిన కవి మాత్రమే కాదు...ఒక ప్రజా కవి, ఒక ఉద్యమ గళం, ఒక భావసంపద. ఆయన రచనలు భాషకు గౌరవాన్ని, భావాలకు పునాది అందించాయి. ఆయన్ని స్మరించుకోవడం అనేది కేవలం గుర్తింపుగా కాదు, భవిష్యత్తు రచయితలకు ఒక మార్గదర్శనంగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్...9440595494**

# ఆలోచన మారుతోంది..!


మిర్యాలగూడ : మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం కోసం మళ్లీ ఐటీఐ చేసి లైన్‌మెన్‌గా ఉద్యోగం సాధించాడు.

వేములపల్లి మండలానికి చెందిన ఓ యువకుడు సాధారణ డిగ్రీ పూర్తి చేసి అనంతరం ప్రత్యేక కోర్సులు చేసి సాఫ్ట్‌వేర్ కొలువు సాధించాడు. మిర్యాలగూడకు చెందిన ఓ యువకుడు ఎంబీఏ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కోసం వేచి చూస్తూ ఆ విరామ సమయంలో ప్రైవేట్ పని చేసుకుంటూనే చదువుకుని..ఎట్టకేలకు ప్రభుత్వ కొలువు సాధించాడు.

నాలుగైదు ఏళ్ల క్రితం వరకు గ్రామం, పట్టణం అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఇంజినీరింగ్, మెడిసిన్ చదివించాలని, యువత సైతం తమ స్నేహితులు, ఇరుగు పొరుగు వారిని చూసి అవే కోర్సుల్లో చేరి జీవితంలో స్థిరపడాలని అనుకునే వారు. అయితే ఆయా కోర్సుల్లో విపరీతమైన పోటీ పెరగడం, నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరచుకో లేకపోవడం, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉమ్మడి జిల్లా యువత తీరు మార్చుకుంటున్నారు. త్వరగా జీవితంలో స్థిరపడాలనే లక్ష్యంతో చదువుతో పాటు ఏకకాలంలో భౌతిక శిక్షణ అందించే వృత్తి విద్య కోర్సుల వైపు చూస్తున్నారు.

**వృత్తి విద్య కోర్సులు అనేకం..**

పదోతరగతి, ఇంటర్ పూర్తయిన తర్వాత వృత్తి విద్య కోర్సులు అనేకం ఉన్నాయి. పదో తరగతి తర్వాత పారా మెడికల్, ఐటీఐ, డిప్లొమా



వంటి కోర్సులు అందుబాటులో ఉండగా..ఇంటర్ తర్వాత అకౌంటింగ్, ట్యాక్సేషన్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఐటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, హాస్పిటాలిటీ, టూరిజం, రిటైల్ మార్కెటింగ్, ఆక్వా కల్చర్, క్రిటికల్ కేర్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటో మొబైల్, వ్యవసాయం, ప్రింటింగ్ టెక్నాలజీ, జర్నలిజం వంటివి అందుబాటులో ఉన్నాయి.

**డిప్లొమాతో ఉద్యోగం సాధించాను** నేను ఇంటర్ అనంతరం వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగంలో డిప్లొమా పూర్తి చేశాను. అనంతరం ప్రవేశ పరీక్షలో 400వ ర్యాంకు సాధించి ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో చేరాను. అనంతరం పవర్ ప్లాంటు ఇంజినీరింగ్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేసి..తమిళనాడు, ఒడిషాలోని థర్మల్ పవర్ ప్లాంట్లలో కొన్నేళ్లు ఉద్యోగం చేశా. ఆ తర్వాత 2018లో డిప్లొమా అర్హతతో విద్యుత్తు శాఖలో సబ్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించాను. త్రిపురారం, మిర్యాలగూడలో పని చేసి..ప్రస్తుతం వేములపల్లిలో సబ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. బి.కృష్ణారెడ్డి, విద్యుత్తు సబ్ ఇంజినీర్, వేములపల్లి.

# చింతపండు.. ఉపాధి మెండు

చేగుంట: చింతపండు కాలం వస్తే పలువురికి ఉపాధి లభిస్తుంది. మార్చి, ఏప్రిల్‌లో కూలీలకు ఉపాధి లభిస్తుండగా, వ్యాపారులకు తోడ్పాటును అందిస్తుంది. పలు గ్రామాల్లో కూలీలు పండు కొడుతూ దాని నుంచి చింత గింజలను తీయటంలో నిమగ్నమై ఉంటున్నారు. నెలల్లో రూ.కోట్ల విలువ చేసే చింతపండు చేగుంట, నార్సింగి మండలాల నుంచి హైదరాబాద్‌కు రవాణా జరుగుతుంది.

**రూ.400 వరకు కూలీ**

ప్రస్తుతం వ్యవసాయ పనులు లేని సమయంలో చాలా మంది మహిళలకు చింతపండు కొట్టడం కల్పతరువుగా మారింది. జిల్లాలో చేగుంట మండలం అనంతసాగర్, ఉల్లితిమ్మాయిపల్లి, రుక్మాపూర్, నార్సింగి మండలం భీంరావుపల్లి గ్రామాల ప్రజలు చింతపండు కొట్టి హైదరాబాద్‌కు రవాణా చేయటంలో ప్రసిద్ధి. గత 66 ఏళ్ల నుంచి ఈ వ్యాపారం చేస్తున్నారు. మహిళలు రోజుకు సుమారు రూ.400 వరకు సంపాదిస్తున్నారు. ప్రతి గ్రామంలో 100 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. నీడపట్టులో పని కాబట్టి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కూలీలు ప్రతి రోజు 40కిలోల వరకు పండు కొట్టి గింజలు, నార వేరు చేస్తుంటారు. ఒక్కో కూలీ రెండు నెలల్లో సుమారు రూ.25 వేల వరకు సంపాదిస్తున్నారు. సెర్ప్ అధికారులు ప్రోత్సహిస్తే మరింత ముందుకు సాగేందుకు వీలుంటుంది.

**వ్యాపారులే వచ్చి కొనుగోలు**

ఏటా ఈ గ్రామాల నుంచి రూ.5 కోట్ల విలువైన చింతపండు హైదరాబాద్‌కు రవాణా అవుతుంది. వ్యాపారులే వచ్చి కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు. రైతుల వద్ద నుంచి కిలో రూ.35 వరకు కట్టెపండు(గింజతో ఉన్నది) కొనుగోలు చేస్తుంటారు. ఈసారి దిగుబడి తగ్గడంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. వ్యాపారస్థులు కొని శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుతారు. ధర ఎక్కువగా ఉన్న సమయంలో విక్రయిస్తుంటారు. గింజలను కిలో రూ.20 వరకు అమ్ముతుంటారు. నార, పొట్టును కూడా విక్రయిస్తుంటారు.

# నిధులు మంజూరు.. పనులే బేజారు

మెదక్: వర్షపు నీరు వాగుల గుండా వృథాగా పారకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తూ భూమిలోకి ఇంకేలా చేసేందుకు చెక్‌డ్యాంలు నిర్మిస్తుంటారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడాదిన్నర కిందట మంజూరైన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాగులపై రూ.22.75 కోట్లతో 10 చెక్‌డ్యాంల నిర్మాణానికి 2023 ఆగస్టులో ప్రభుత్వం అనుమతులిచ్చింది. దానికి సంబంధించిన పనులకు టెండర్లు పిలిచారు. గుత్తేదారులు షెడ్యూల్ వేశారు. ఒప్పందం చేసుకునే సమయంలోనే ఎన్నికలు రావడంతో పనులు పక్కనబెట్టారు. ఆ తరవాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పనుల స్థితిగతులుపై ఆరా తీశారు. మళ్లీ పనులు చేసేందుకు గతేడాది జులైలో ప్రభుత్వం పచ్చజెండా ఊపినా.. ఇప్పటికీ ప్రారంభం కాలేదు.

**వెంటనే నిర్మిస్తే ప్రయోజనం..**

నిర్మాణ పనులు వెంటనే మొదలు పెడితేనే వర్షాకాలం వచ్చే నాటికి పూర్తి చేసే అవకాశముంటుంది. లేదంటే వానలు ప్రారంభమైతే పనులు సాగడం కష్టం. ఇప్పటికే రెండేళ్లు కురిసిన వర్షపు నీరంతా వాగుల గుండా వృథాగా పోయింది. వాగుల్లో నిర్మించే ఒక్కో చెక్‌డ్యాం చుట్టూ సుమారు పది కి.మీ.ల మేర భూగర్భ జలాలను స్థిరీకరిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా వందల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతుందంటున్నారు. దీంతో పంట దిగుబడులు అధికమయ్యే అవకాశముంటుంది. పనులను తక్షణమే ప్రారంభించాలని అన్నదాతలు కోరుతున్నారు.గుత్తేదారుతో మాట్లాడుతున్నాం..: శ్యాం, డీఈఈ, చేర్యాల సబ్ డివిజన్ఏడాదిన్నర కిందటే నిధులు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల కారణంగా పనులు మొదలు కాలేదు. తరవాత మళ్లీ కొత్త ప్రభుత్వం ఆ పనులు ప్రారంభించాలని చెప్పింది. ఆ దిశగానే ముందుకు సాగుతున్నాం. గుత్తేదారుతో మాట్లాడుతున్నాం. ఒప్పుకుంటే పనులు ప్రారంభిస్తాం.

# మక్కల రవాణాకు ఆన్‌లైన్ టెండర్లు



ఖమ్మం : మొక్కజొన్నల రవాణాకు ఈసారి ఆన్‌లైన్ విధానంలో టెండర్లు నిర్వహించాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఏటా ప్రకటన ఇచ్చి మాన్యువల్ పద్ధతిలో ప్రక్రియను నిర్వహించేవారు. ఈసారి నుంచి పౌర సరఫరాల సంస్థ మాదిరిగానే ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్లతో జూమ్ సమావేశం నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు నిల్వలను తరలిచేందుకు సంస్థ ఈసారి కొత్త విధానం అమలుచేస్తోంది.

**కొనుగోలు కేంద్రాల పెంపుపై దృష్టి...**

ఖమ్మం జిల్లాలో గతేడాది రైతులు 65 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఈసారి విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సుమారు 1.05 లక్షల ఎకరాల్లో సాగైంది. చింతకాని, బోనకల్లు, కొణిజర్ల, వైరా, ముదిగొండ, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో ఈ పంట సాగవుతోంది. ఏప్రిల్ రెండో వారంలో పంట చేతికొచ్చే అవకాశం ఉన్నందున అందుకనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలి. ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. 35 క్వింటాళ్ల లెక్కన ఒక్క ఖమ్మం జిల్లాలోనే 3.50 లక్షల క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉంది. గతేడాది 35 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి పెరిగిన పంట విస్తీర్ణానికి అనుగుణంగా కేంద్రాల సంఖ్య లేకుంటే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి. కనీసం లక్ష క్వింటాళ్ల సరకును రైతుల నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 16,938 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైంది. ఇక్కడ గతేడాది 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసారి కేంద్రాల సంఖ్య పెంచాలని రైతులు కోరుతున్నారు.

**రైతులకు సహకారం...**

రైతులకు అవసరమైన సంచులను మార్క్‌ఫెడ్ సరఫరా చేస్తుంది. రవాణా ఖర్చులు సైతం భరిస్తుంది. ప్రభుత్వం ఈసారి మక్కలు క్వింటాకు రూ.2,225 చొప్పున కనీస మద్దతు ధర ప్రకటించింది. ఇది రైతులకు కొంత ఊరట కలిగించే విషయం.

ఖమ్మం జిల్లాలో మిరప పంట దారుణంగా దెబ్బతిన్న కారణంగా చాలామంది రైతులు తోటలు తొలగించి మొక్కజొన్న సాగు చేశారు. ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.50 వేల వరకు నికరాదాయం వస్తుందన్న భరోసా రైతుల్లో వ్యక్తమవుతోంది.

# కాల్వ కట్టి.. కష్టాలు తీర్చి



నర్సాపూర్: చినుకుపడితే వణికిపోయే కాలనీలో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రూ.లక్షల వ్యయంతో మురుగు కాల్వ నిర్మాణం చేపడుతున్నారు. దీంతో చుక్క వరద నీరు కూడా కాలనీలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. కొన్నేళ్లుగా ముంపు సమస్యతో నరకం చూసిన కాలనీ ప్రజలు మురుగు కాల్వ నిర్మాణంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. 'ఈనాడు'లో ఎన్నోసార్లు కథనాలు రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు కేటాయించారు. నర్సాపూర్ పురపాలిక పరిధిలోని విఘ్నేశ్వర కాలనీలోని ప్రధాన సమస్య పరిష్కారంపైకథనం...

**కుంటను పూడ్చడంతో..**

భారీ వర్షాలు పడితే చాలు నర్సాపూర్ 9వ వార్డులోని విఘేశ్వర కాలనీని వరద నీరు ముంచెత్తేది. కాలనీ పైభాగంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని కుంటను పట్టణ ప్రగతిలో భాగంగా రూ.20లక్షలు వ్యయం చేసి పురపాలిక అధికారులు పూడ్చివేశారు. దీని స్థానంలో ఉద్యానం ఏర్పాటు చేస్తామన్నారు. అది కాస్త అటకెక్కింది. కుంటలోకి వచ్చే వరద నీటిని దారి మళ్లించడానికి మురుగు కాల్వ నిర్మించడం చేపట్టేందుకు పుర అధికారులు నాలుగేళ్ల క్రితం ప్రణాళికలు రూపొందించారు. రూ.35లక్షల నిధులు కేటాయించారు. గతేడాది పనులు ప్రారంభించిన గుత్తేదారు 250 మీటర్ల పొడవునా కాల్వ పనులు చేపట్టాల్సి ఉండగా రూ.11లక్షల వ్యయంతో 93మీటర్ల పొడవునా కాల్వ పనులు పూర్తిచేశారు. భారీ వర్షాలు కురవడంతో మధ్యలోనే నిలిపివేశారు. రెండేళ్ల పాటు పనులు ప్రారంభం కాలేదు. దీంతో మురుగు ముందుకు సాగక పారిశుద్ధ్యం లోపించింది.

**మురుగు ఇళ్లలోకి చేరి..**

ప్రస్తుతం మురుగు కాల్వ పనులు ప్రారంభం కావడంతో విఘ్నేశ్వర కాలనీ వాసుల ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. గతంలో అసంపూర్తి పనులతో వర్షం పడితే చాలు కాల్వ మురుగంతా కాలనీలోని ఇళ్లలోకి ప్రవేశించేది. ఇళ్ల లోనికి వరద నీరు వచ్చేది. నీటితో పాటు మురుగు, చెత్తాచెదారం, మట్టి, ఇసుక, విష పురుగులు, కప్పలు రోడ్లపైకి వచ్చేవి. ఈనేపథ్యంలో పురపాలిక అధికారులు, ప్రజాప్రతినిధులు ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి సాధారణ సమావేశంలో పలుమార్లు తీర్మానాలు చేశారు. రూ.35లక్షల నిధులు కేటాయించి పనులు పునఃప్రారంభంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అనుమతి కొంత.. తరలింపు కొండంత



రెబ్బెన : ఇసుక అక్రమరవాణా జోరుగా సాగుతోంది. ఒక్క ట్రాక్టర్‌కు అనుమతి తీసుకొని పదుల సంఖ్యలో తరలిస్తూ దందా కొనసాగిస్తున్నారు. దొరికితే దొంగ, లేదంటే దొర అన్నచందంగా సాగుతోంది. రాత్రింబవళ్లు అడ్డూఅదుపు లేకుండా జరుగుతున్నా అడిగేవారు కరవయ్యారు. అప్పుడప్పుడు రెండు, మూడు ట్రాక్టర్లు, లారీలను పట్టుకుంటున్నారే తప్పితే.. పూర్తి చర్యలు లేవని, తెల్లవారితే మళ్లీ కొనసాగడం షరా 'మామూలే'నని విమర్శలు వస్తున్నాయి.

జిల్లాలోని రెబ్బెన మండలం లక్ష్మీపూర్, గంగాపూర్, రాళ్లపేట, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, అందవెల్లి తదితర వాగుల వద్ద లభించే నాణ్యమైన ఇసుకకు డిమాండ్ ఉండటంతో.. కొంత మంది దీనినే వ్యాపారంగా మల్చుకున్నారు. ట్రాక్టర్ల ద్వారా తమకు అనుకూలమైన ప్రాంతాల్లో కుప్పలు పోసి, రాత్రి వేళల్లో పట్టణ ప్రాంతాలకు లారీల ద్వారా తరిస్తున్నారు. పులికుంట వాగు నుంచి నిత్యం ఇసుక అక్రమ దందా జరుగుతోంది. గోలేటి ప్రాంతంలో జరిగే సింగరేణి, ఇతర పనులకు వాగును అడ్డాగా మార్చుకుని అక్రమ రవాణా చేస్తున్నారు. రాళ్లపేట, గొల్లగూడ, దేవులగూడ, గోలేటి క్రాసు రోడ్డు సమీపంలోని వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక నిల్వచేసి, రాత్రి వేళల్లో జేసీబీ సాయంతో లారీల్లో తరలిస్తున్నారు. రాళ్లపేట, గొల్లగూడ, నక్కలగూడ, తదితర ప్రాంతాల్లో అక్రమంగా రవాణా చేసేందుకు వందల సంఖ్యలో ఇసుక కుప్పలు నిల్వ ఉండటం, వాటిని అధికారులు సీజ్ చేయడం, మళ్లీ కుప్పలు పోయడం కొంతకాలంగా కొనసాగుతూనే ఉంది.

**జరిమానాలు పట్టించుకోవట్లే!**

ఒక ట్రాక్టర్ ఇసుక ట్రిప్పునకు అనుమతి తీసుకొని, అయిదారు ట్రిప్పులు తరలిస్తున్నారు. ఒకవేళ అధికారులకు పట్టుబడినా, ఎన్నిసార్లు ట్రాక్టర్ పట్టుబడినా రూ.5 వేలకు మించి జరిమానా విధించకపోవడంతో.. యాజమానులు తేలికగా తీసుకుంటున్నారు. జరిమానా కట్టి వాహనాలను విడిపించుకుని మళ్లీ దందా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో అయితే ఇసుక రవాణాకు అడ్డేలేకుండా పోతోంది.

**ఆ వాగు.. దళారుల సిరి**

నాణ్యమైన ఇసుక లభించే లక్ష్మీపూర్, రాళ్లపేట వాగులు దళారులకు వరంగా మారాయి. అనుమతులతో కొన్ని, లేకుండా మరి కొన్ని ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నాయి. కొందరు ట్రిప్పు కోసం రెవెన్యూ కార్యాలయంలో డబ్బులు చెల్లించిన పత్రం చూపించకపోగా.. మరి కొంతమంది ట్రాక్టర్ డ్రైవర్లు యజమానివద్ద ఉందని చెబుతూ మభ్యపెడుతున్నారు. వాగుల్లో ఇసుకను ఇష్టానుసారంగా తరలిస్తుండటంతో.. భూగర్భ జలాలు పడిపోతున్నాయి. మరోవైపు ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతల్లో వర్షాకాలంలో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే కొంతమేరకైనా అక్రమ రవాణాను అరికట్టేందుకు అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**చర్యలు తీసుకుంటాం**

అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం. పట్టుబడిన ట్రాక్టర్లకు జరిమానా విధిస్తున్నాం. ఇప్పటికే సీజ్ చేసిన కుప్పలకు వేలం కూడా వేశాం. పి.రామ్మోహన్‌రావు, తహసీల్దార్ రెబ్బెన

# బుగ్గి కాకముందే.. ఆర్పాలి అగ్గి!

కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఏటా వేసవిలోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఆయా ఘటనలు అపార నష్టాలను మిగుల్చుతున్నాయి. అసలు ప్రమాదాలకే ఆస్కారం లేకుండా అప్రమత్తమైతే నష్ట తీవ్రతను తగ్గించవచ్చు. ఈ విషయమై సంబంధిత అగ్నిమాపక, ఇతర శాఖలు ముందే అప్రమత్తం కావాలి. ప్రజల్ని చైతన్యపరచాలి.

**ప్రమాదాలకు ముఖ్య కారణాలు**

సాగు పనులు పూర్తయ్యాక పంట వ్యర్థాలకు రైతులు నిప్పంటించడం.

నాణ్యత లేని విద్యుత్తు ఉపకరణాలు, పరికరాలతో షార్ట్‌సర్క్యూట్‌లు సంభవించడం.


విద్యుత్తు తీగలకు సమీపంలో గడ్డివాములు ఏర్పాటు చేయడం.

వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల షార్ట్‌సర్క్యూట్ తలెత్తి మంటలు చెలరేగడం.సిగరెట్, చుట్ట, బీడీల పీకలను నిర్లక్ష్యంగా పడేయడం.

ప్లాస్టిక్ ఉత్పత్తుల పరిశ్రమలు, దుకాణాల్లో అగ్నిమాపక వ్యవస్థలేకపోవడం. వంట గదుల్లో సిలిండర్ రెగ్యులేటర్లను బంద్ చేయకపోవడం.

**కొత్త కేంద్రాల ఊసేదీ...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కూసుమంచి, వైరా, మధిర, సత్తుపల్లి, నేలకొండపల్లి, భద్రాచలం, పినపాక, మణుగూరు, కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందులో ప్రస్తుతం అగ్నిమాపక కేంద్రాలున్నాయి. ప్రస్తుత జనాభా అవసరాలకనుగుణంగా కొత్తగా గుండాల, కల్లూరు, జూలూరుపాడు(ఏన్కూరు), పాల్వంచ, చర్ల, పెనుబల్లి, బోనకల్లు ప్రాంతాల్లో కొత్త కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. అవి కార్యరూపం దాల్చలేదు.




ఒక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక అధికారి, ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్లు, ముగ్గురు డ్రైవర్లు/ఆపరేటర్లు, పది మంది ఫైర్‌మెన్లు, ఇతర కార్యాలయ సిబ్బంది ఉండాలి. కానీ, ఉభయ జిల్లాల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. భద్రాద్రి జిల్లాలో 50కి గాను 29 మంది ఫైర్‌మెన్లు మాత్రమే ఉన్నారు. ఖమ్మం జిల్లాదీ ఇదే పరిస్థితి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పాఠశాలలు, షాపింగ్‌మాల్స్, ఆసుపత్రుల్లో ఫైర్ అలారం, స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటు చేసుకోవాలి.

సెల్లార్లలో ఆటోమెటిక్ స్ప్రింక్లర్లను అందుబాటులో ఉంచుకోవాలి.

విద్యుత్తు ప్రమాదాల నియంత్రణకు సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి.

బీ వంట పూర్తికాగానే సిలిండర్ రెగ్యులేటర్లను ఆపివేయాలి.

ఎక్కువ రోజులు ఊరికి వెళ్లాల్సి వస్తే ఇంట్లోని విద్యుత్తు మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి.

గ్రామీణ ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా నిప్పంటించకుండా, సిగరెట్ పీకలు పడేయకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలి. బీ ప్రమాదం సంభవిస్తే ఆలస్యం చేయకుండా '101, 100' టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారమివ్వాలి. 'వేసవిలో అగ్ని ప్రమాదాల నియంత్రణకు సన్నద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం ఇటీవల కొత్తగూడెం, భద్రాచలం కేంద్రాలకు ఒక్కొక్కటి చొప్పున అదనపు ఫైర్ ఇంజిన్‌ను మంజూరు చేసింది. ఫైర్‌మెన్లు సహా మిగతావారు తగిన స్థాయిలో ఉన్నారు. గుండాల, చర్లలో వెంటనే కొత్త కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ప్రజల్ని అప్రమత్తం చేస్తాం'. – క్రాంతికుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి, భద్రాద్రి

# విపత్తు దళం.. సింగరేణి బలం

శ్రీరాంపూర్: విపత్తుల సమయంలో ఆదుకోవడంలో సింగరేణి రెస్క్యూ సిబ్బందికి దేశవ్యాప్త గుర్తింపు ఉంది. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ కోసం శ్రమిస్తున్న సైన్యం, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు సింగరేణి నుంచి వంద మంది రెస్క్యూ బృందం ఉంది. ఎన్‌డీఆర్ఎఫ్‌తోపాటు సింగరేణి బృందం వెంటనే అక్కడికి వెళ్లి సహాయ పనుల్లో నిమగ్నమైంది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి దాదాపు 60 మంది రక్షక చర్యల్లో పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్యం రెస్క్యూ బృందాలను అత్యంత సమర్థంగా ఖర్చుకు వెనుకాడకుండా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం సింగరేణిలో 483 మంది సుశిక్షితులైన రెస్క్యూ సిబ్బంది ఉన్నారు. వీరంతా భూగర్భ గనుల్లో తమ రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే, విపత్తుల సమయంలో సేవలు అందించడానికి ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందుతారు. కోల్ ఇండియా వెలికితీసే ఉత్పత్తిలో పది శాతం బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణి రెస్క్యూ సేవల్లో మాత్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఉండే ఐఆర్ఎంబీ (ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ బాడీ)లో కోల్ ఇండియాకు దక్కని సభ్యత్వం సింగరేణికి 2002లోనే లభించింది. దేశంలో ఎక్కడ విపత్తులు సంభవించినా, సహాయక చర్యల కోసం సింగరేణివైపు చూడటం జరుగుతోంది. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్), హట్టి గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (హెచ్‌జీఎంఎల్), యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐ) లాంటి సంస్థలకు సింగరేణి విపత్తుల నిర్వహణపై ఆయా సంస్థలకు రెస్క్యూ బృందాలకు శిక్షణ ఇస్తోంది. అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లోనూ సింగరేణి సంస్థ పలు మార్లు బహుమతులు సాధించింది. ప్రస్తుతం సింగరేణి రెస్క్యూ జీఎం కె.శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ బి.మాధవరావు (డీజీఎం), శిక్షకులుగా అదనపు మేనేజర్ భాస్కర్‌రెడ్డి, డీవైఎస్ఈ నర్సింహామూర్తిలు గోదావరిఖని కేంద్రంగా సింగరేణి వ్యాప్తంగా రెస్క్యూ బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు.

**వీరు అందించిన సేవల్లో కొన్ని..**

ఎనిమిదేళ్ల కింద కోల్ ఇండియాలో పైకప్పు కూలి అత్యంత విలువైన కంటిన్యూయస్ మైనర్ యంత్రం కూరుకుపోతే సింగరేణి రెస్క్యూ బృందం అధునాతన న్యూమటిక్ హైడ్రాలిక్ కట్టర్స్, స్లిట్టర్స్ సహాయంతో ఆ యంత్రాన్ని వెలికి తీసింది. కొత్తగూడెం సమీపంలోని కేటీపీఎస్‌లోని కేబుళ్లకు మంటలు అంటుకుని దట్టమైన పొగ కమ్ముకుంటే అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేని స్థితిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రానైట్ గనిలో పేలుళ్ల సందర్భంగా పెద్ద బండకింద చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీశారు. సింగరేణిలో చోటు చేసుకున్న ప్రతీ విపత్తులోనూ రెస్క్యూ బృందం సహాయక చర్యలు చేపట్టిన ఘటనలు కోకొల్లలు. బోర్‌బావుల్లో పడినప్పుడు పిల్లల్ని కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయి. బోర్‌లోకి ఆక్సిజన్ సరఫరా చేయడం, చిక్కుకున్న పిల్లల కదలికల్ని గుర్తించడానికి సెర్చ్‌కామ్ ప్రోబ్ లాంటి అధునాతన వస్తువులు సింగరేణి సొంతం.

చురకలు



# అత్యవసర సేవలు అందేదెన్నడో..!

నకిరేకల్: నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. నిధులు అందక ఆరునెలల పాటు నిలిచిపోయిన పనులు మళ్లీ మొదలయ్యాయి. ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవతో ఇటీవల రూ.3.50 కోట్లు విడుదల కావడంతో గుత్తేదారు సంస్థ పనులను పునఃప్రారంభించింది. రూ.32 కోట్లతో మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్న ఈ వైద్యశాల పనులను 2022లో మొదలుపెట్టారు. 2024 ఏప్రిల్ నాటికే పనులు పూర్తికావాల్సి ఉంది. ఇప్పటి వరకు 75 శాతం మేర పూర్తయ్యాయి. ప్రస్తుతం పెయిటింగ్, ఫ్లోరింగ్, డ్రైనేజీ, తలుపులు, కిటికీల ఏర్పాటు వంటి పనులు కొనసాగుతున్నాయి. ఇంకా ప్రహరీ, సీసీ రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం, విభాగాల వారిగా యంత్రపరికరాలు వంటివాటిని సమకూర్చాల్సి ఉంది. మరో నాలుగు నెలల్లో పనులు పూర్తిచేసే విధంగా గుత్తేదారు సంస్థ గడువు కోరినట్లు సమాచారం. పనుల్లో మరింతగా వేగం పెంచేందుకు టీఎస్ఎంఐడీసీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. నకిరేకల్, శాలిగౌరారం, కట్టంగూరు, కేతేపల్లి మండలాల



ప్రజలతో పాటు నల్గొండ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలోని పలు గ్రామాల ప్రజలు ఈ వైద్యశాలకు వస్తుంటారు. ఇక్కడ వంద పడకల వైద్యశాల సేవలు అందుబాటులోకి వస్తే గ్రామీణులకు మేలు జరగనుంది. హైదరాబాద్- విజయవాడ, నకిరేకల్-తానంచర్ల, నకిరేకల్-సాగర్- గుంటూరు జాతీయ రహదారులు ఇక్కడి నుంచే వెళ్తున్నందున తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాద బాధితులకు ప్రస్తుతం ప్రథమ చికిత్సలే అందుతున్నాయి. వంద పడకల వైద్యశాలతో ఈ క్షతగాత్రులకు అత్యవసర వైద్యసేవలు మెరుగవుతాయి.

**పూర్తిస్థాయిలో సేవలు..**

పాత భవనంలో వంద పడకలకు సరిపడా వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వారు కూర్చునేందుకు సరైన వసతి లేదు. కొత్త భవనం ప్రారంభమైతే నాలుగు ఆపరేషన్ థియేటర్లు, చిన్నపిల్లల ఐసీయూ, డయాలసిస్ యూనిట్లు, సహా పలు రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి. డా.మాతృనాయక్ ,డీసీహెచ్ఎస్, నల్గొండ

# నిధుల కొరత.. దాహార్తి తీరేదెలా?

కరీంనగర్ : రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. జిల్లాలోని ఆయా మెట్టప్రాంతాల్లో సాగునీరు దేవుడెరుగు.. తాగునీటికే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మూడు నెలలు ప్రజల దాహార్తి తీర్చే మంచినీటి పథకాల నిర్వహణకు నిధుల కొరత అధికారులను కలవరానికి గురి చేస్తుంది. గతంలో మిషన్ భగీరథ పథకం అమలుకు ముందే తాగునీటి పథకాల నిర్వహణకు నిధులు కేటాయించేవారు. కానీ నేడు నిధుల విడుదల నిలిచిపోయి పథకాలు మూలకు పడ్డాయి. గ్రామాల్లోని తాగునీటి పథకాల మోటారు పంపుసెట్టు, పైపులైన్లు మరమ్మతులకు గురైన సందర్భాల్లో పంచాయతీలపైనే భారం పడుతోంది. సర్పంచుల పదవీకాలంలో చేసిన పనుల బిల్లులు అందక వారు ఇబ్బందులు పడుతున్నారు.

**మరమ్మతులకు రూ.41.86 లక్షలు**

జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో 2632 చేతిపంపులు ఉండగా.. అందులో 375 పనిచేయడం లేదు. 1771 సింగిల్‌ఫేజ్ మోటారు పంపుసెట్లకుగాను.. 289 మరమ్మతులకు గురయ్యాయి. 346 పీడబ్ల్యూఎస్ మోటార్లకుగాను 25 పంపుసెట్లు చెడిపోయాయి. వీటి మరమ్మతులకు రూ.41.86 లక్షల నిధులు అవసరం ఉంటుందని అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు తెలిపారు.

# తడి..పొడి.. తడబడి

ఆలేరు : గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్టు ఎరువులు తయారీ అటకెక్కింది. మూడున్నరేళ్ల కిందట గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించగా.. మొదట్లో కొన్నింటిలో సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టారు. తర్వాత వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం పది నెలల క్రితం సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. నెల, రెండు నెలలు హడావుడి చేసిన అధికార యంత్రాంగం ఎప్పటి లాగే మిన్నకుండిపోయింది.

**నిర్మాణాలు..** నల్గొండ ఉమ్మడి జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 16 వందల పంచాయతీల్లో కంపోస్ట్ షెడ్లను నిర్మించారు. ఒక్కోదానికి రూ.2.5 లక్షలు చొప్పున రూ.40 కోట్లు వెచ్చించారు. చెత్త సేకరణకు ట్రాక్టర్లు, కొన్ని పంచాయతీలకు రిక్షాలు కొనుగోలు చేశారు. తడి, పొడి చెత్త సేకరణకు ఇంటింటికి ప్రత్యేక బుట్టలు అందించారు. కొన్నింటిలో మొదట్లో ఎరువులు తయారు చేశారు. కొద్ది కాలానికే నిర్వహణ భారంతో చేతులెత్తేశారు. ప్రస్తుతం చెత్తను డంపింగ్ యార్డుల్లోనే పారబోస్తున్నారు.

**లక్ష్యం నీరుగారింది**

వానపాముల సాయం తీసుకుంటే 40-60 రోజుల్లోనే సేంద్రియ ఎరువు తయారవుతుంది. ప్రభుత్వ సూచనల మేరకు చాలా పంచాయతీలు వానపాములు కొనుగోలు చేసి కంపోస్టు షెడ్లలో వేశారు. ఇలా చేసిన తర్వాత సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్‌లో వేయాల్సి ఉంటుంది. దానిపై రోజూ నీరు పట్టడంతో వానపాముల పునరుత్పత్తి పెరుగుతుంది. వాటి విసర్జితాలతో సేంద్రియ ఎరువు తయారవుతుంది. వానపాముల కోసం పంచాయతీలు రూ.4 వేలు ఖర్చుచేశాయి. షెడ్లకు సరిగా నీరు పట్టకపోవడంతో వానపాములు చనిపోయాయి.

**వేరుచేయడం లేదు...**ప్రజల్లో అవగాహన లేక తడి, పొడి చెత్తను వేరుచేయడం లేదు. సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులే తడి, పొడి చెత్తను వేరుచేయాల్సి వచ్చింది. ప్లాస్టిక్, గాజు, ఇనుము, రబ్బరు వంటి వాటిని వేరుచేసి అక్కడే సెగ్రిగేషన్ షెడ్‌లోని అరలలో నిల్వచేయాలి. ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్‌కు పంపించాలి. ఈ ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో దాదాపు ఎక్కడా అమలు కావడం లేదు. నిత్యం ట్రాక్టరులో చెత్త తరలించడానికి ఇంధనం ఖర్చులు తప్పడం లేదు. కంపోస్ట్ ఎరువుల తయారీపై పంచాయతీలు దృష్టిని సారిస్తే అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

# అనుమతులు నిల్.. కాలుష్యం ఫుల్



హైదరాబాద్: అనుమతుల్లేకుండా ఏర్పాటు చేస్తున్న బల్క్‌డ్రగ్, ఫార్మా 'ఆర్ అండ్ డీ'(రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) యూనిట్లతో రాజధాని పరిధిలో విపరీతమైన కాలుష్యం నమోదవుతోంది. 2018లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు తూట్లు పొడుస్తూ కాలుష్య నియంత్రణ మండలి నుంచి సీఎఫ్ఈ(కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్), సీఎఫ్‌వో(కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్) అనుమతులు లేకుండానే వ్యాపారం సాగిస్తున్నారు. కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నెలకొల్పకుండా వ్యర్థాలను నేరుగా జలాశయాలు, నాలాలు, కాలువల్లోకి వదులుతుండటంతో కాలుష్యం నురగలు కక్కుతోంది. భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీఎస్టీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ నుంచే అనుమతి.: బల్క్‌డ్రగ్, ఫార్మా యూనిట్ల(రెడ్, ఆరెంజ్ కేటగిరీ)తోపాటు ఇతర పరిశ్రమలకు మధ్యంతర ఉత్పత్తులను ఆర్‌అండ్‌డీ యూనిట్ల నుంచి సరఫరా చేస్తుంటారు. ఆయా యూనిట్ల సామర్థ్యం ఆధారంగా సీఈటీపీ(కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), ఘాటు వాసనను నియంత్రించేలా స్క్రబ్బర్లు ఏర్పాటు చేసుకోవాలని నిబంధనలు సూచిస్తున్నాయి. ఈ యూనిట్లను నెలకొల్పిన నిర్వాహకులు కేవలం జీఎస్టీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ నుంచే అనుమతులు తీసుకుంటున్నారు. పీసీబీ నుంచి అనుమతులు తీసుకుంటే కాలుష్య లెక్కలు చెప్పడం, తనిఖీలు, సీఈటీపీ ఏర్పాటు, సభ్యత్వాలు, సీఈటీపీకి వ్యర్థజలాల తరలింపునకు ఖర్చు పెరుగుతుందని భావిస్తున్నారు. ఇష్టారాజ్యంగా వ్యర్థాలను పారబోస్తుండటంతో కాలుష్యం పెరుగుతోంది.

**ఈ ప్రాంతాల్లోనే 50కిపైగా యూనిట్లు..**

మల్లాపూర్, నాచారం, చర్లపల్లి ఫేజ్ -1, 2, 3, 4, 5, కీసర, ఉప్పల్, జీడిమెట్ల, ప్రశాంత్‌నగర్, గాంధీనగర్, మేడ్చల్, బౌరంపేట, అమీన్‌పూర్, బొల్లారం, పటాన్‌చెరు, కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం, ఆటోనగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లో 50 నుంచి 60 'ఆర్‌అండ్‌డీ' యూనిట్లు స్థాపించి కార్యకలాపాలు సాగిస్తున్నారు. వెలువడే వ్యర్థ జలాలను కాలువల ద్వారా చెరువుల్లోకి, మిగిలిన విషపూరిత మురుగును మైదానాల్లో పారబోస్తున్నారు. నాచారం, మల్లాపూర్‌లోని హెచ్‌ఎంటీ చెరువు, ఉప్పల్‌లోని నల్లచెరువులో కాలుష్య నురగలు పెరుగుతున్నాయి. జీడిమెట్ల ఫాక్స్‌సాగర్, మేడ్చల్‌లోని జలాశయాలు కలుషితమవుతున్నాయి. **కొరవడిన పీసీబీ నిఘా...**అనుమతుల్లేకుండానే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నా పీసీబీ అధికారులు పట్టించుకోవడం లేదు. యూనిట్ల నిర్వాహకులకు కొందరు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మున్సిపల్, జీఎస్టీ, పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు తీసుకున్న జాబితాను..పీసీబీలో అనుమతులు తీసుకున్న జాబితాను పరిశీలిస్తే ఎక్కడ, ఎవరు ఏఏ పరిశ్రమలు నెలకొల్పారో తెలిసే అవకాశం ఉంటుంది.

# బైపాస్ వేగవంతం.. ప్రయాణం సులభం



కొడంగల్ : కొడంగల్‌లో బైపాస్ రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతమున్న ఇరుకు రహదారి వల్ల పట్టణంలో విపరీతంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేయడానికి జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ కొడంగల్, తాండూరు పట్టణాల వెలుపలి నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. దీనివల్ల భవిష్యత్తులో కూడా రాకపోకలకు ఇబ్బందులు ఉండవని అధికారులు వివరిస్తున్నారు.

**62 హెక్టార్ల భూ సేకరణ**

మహబూబ్‌నగర్ నుంచి చించోలి వరకు 110 కిలోమీటర్ల రహదారిని జాతీయ రహదారిగా గుర్తించి అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.600 కోట్లు మంజూరు చేసింది. రెండో ప్యాకేజీలో ఉన్న దుద్యాల స్టేజీ నుంచి చించోలి వరకు (తెలంగాణ సరిహద్దు) 45 కిలో మీటర్ల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించి నిర్మిస్తున్నారు. వచ్చే 15 ఏళ్లలో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకుని కొడంగల్‌తో పాటు తాండూరులో కూడా బైపాస్ రోడ్డును నిర్మిస్తున్నారు. కొడంగల్‌లో 4.5 కిలో మీటర్లు, తాండూరులో 8.5 కిలో మీటర్ల మేర వీటిని నిర్మిస్తున్నారు. జాతీయ రహదారితో పాటు బైపాస్ రోడ్ల నిర్మాణానికి 62 హెక్టార్ల భూమిని సేకరించారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందుకు సంబంధిత రైతులు సానుకూలం వ్యక్తం చేస్తుండటంతో ఎలాంటి అవాంతరాలు ఏర్పడటంలేదు. **కొడంగల్ పట్టణంలోకి వెళ్లాల్సిన పనిలేదు**

బైపాస్ రహదారి నిర్మాణం వల్ల కొడంగల్, తాండూరు పట్టణాలలో వాహనదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి. పరిగి నుంచి కోస్గి, మహబూబ్‌నగర్ వైపు, కోస్గి వైపు నుంచి పరిగి, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులు కొడంగల్ పట్టణంలోకి వెళ్లకుండా బైపాస్ ద్వారా పట్టణం వెలుపల నుంచి వెళ్లే అవకాశం కలుగుతుంది. భారీ వాహనాలు వెళ్లే సమయంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇది పూర్తయితే సమస్యలు దూరమవుతాయి. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నుంచి బైపాస్ వెళుతుండడంతో ఈ రహదారిపై అండర్‌పాస్ నిర్మిస్తున్నారు. చించోలి వైపు నుంచి నిత్యం నాపరాయి లోడుతో వెళ్లే లారీలు, ఇతర వాహనాల రాకపోకలతో తాండూరు పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. బైపాస్ నిర్మాణంతో వాహనదారులు, ప్రజలకు కష్టాలు తీరుతాయి. పనులు వేగంగా జరుగుతున్నాయని, తాండూరు బైపాస్ రోడ్డు పనులు కూడా ఇటీవలే ప్రారంభమయ్యాయని జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ ఏఈ సురేందర్ తెలిపారు.

# దృష్టి సారిస్తే.. దాహం తీర్చు..!



సూర్యాపేట : గతంలో చేతి పంపులే నీటికి ఆధారం.. పట్టణాలు, గ్రామాల్లో ప్రతి కాలనీలో ఉన్నాయి. బోర్లు, ట్యాంకుల నిర్మాణం, ఇంటింటికీ నీటి సరఫరా చేస్తుండడంతో వాటి వినియోగం తగ్గింది. దీంతో చేతిపంపుల నిర్వహణ వదిలేశారు. ఫలితంగా మరమ్మతులకు గురయ్యాయి. ప్రస్తుతం పట్టణాల విస్తరణ, వేసవిలో భూగర్భ జలాలు అడుగంటిన ఫలితంగా మున్ముందు నీటి సమస్య ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రత్యామ్నాయ వనరైన చేతిపంపులు కూడా అక్కరకు రానున్నాయి.? సూర్యాపేట జిల్లాలో 5 పురపాలికల్లోని చేతిపంపుల్లో చాలావరకు మరమ్మతుకు గురయ్యాయి. వాటిని వార్డుల్లోని ప్రతి కాలనీలో ఏర్పాటు చేశారు. బాటసారులు, అత్యవసరమైన వారు వీటిని వినియోగించుకుంటున్నారు. గతేడాది పట్టణాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. బోర్లు పోయకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చేతి పంపులను వినియోగంలో ఉంచితే నీటి ఎద్దడిని నివారించచొచ్చు.

జిల్లాలో చేతిపంపులు 4184.. పనిచేయనివి 1430

జిల్లాలోని గ్రామాలు, పురాల్లో 4184 చేతిపంపులుండగా 1430 పనిచేయడంలేదు 475 గ్రామాల్లో 2,967 చేతి పంపులు ఉండగా 650 పంపులు వినియోగంలో లేవు. గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణం లేని సమయంలో ప్రతి గ్రామంలో చేతి పంపుల ద్వారా నీటిని వినియోగించుకున్నారు. రానురాను ట్యాంకులు ఏర్పాటు చేసి ఇంటింటికి నల్లాలు వచ్చాయి. వీటి కారణంగా చేతి పంపులపై ఆధారపడటం తగ్గింది. ఇటీవల సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి గుర్తించారు. వాటిని మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పల్లెల్లోని చేతి పంపులను సిద్ధంగా ఉంచితే నీటి సమస్య రాకుండా ఉంటుంది.

అన్నింటిని వినియోగంలోకి తీసుకొస్తాం -శ్రీనివాస్, పుర కమిషనర్

నీటి ఎద్దడి లేకుండా చేతిపంపులను కూడా వినియోగంలోకి తెస్తాం. వార్డుల్లోని చేతి పంపులకు కొన్నింటికి సామగ్రి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పరిశీలించి సిబ్బందితో ఏర్పాటు చేయిస్తాం. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూస్తాం. జిల్లాలో పురపాలికలు: 5చేతిపంపులు: 1,217పనిచేస్తున్నవి: 780 మరమ్మతులకు గురైనవి: 437

# తాగునీటి ఇబ్బందులు షురూ!

వైరా : వేసవి ఆరంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. 'మిషన్ భగీరథ' నీళ్లు పూర్తిస్థాయిలో అందకపోవటంతో అక్కడక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బావులు, బోర్ల నుంచి తాగునీరందించే క్రమంలో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించేందుకు నిధుల కొరత వేధిస్తోంది. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవటంతో కేంద్రం నుంచి నిధులు అందటం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులూ రావటం లేదు. 'జనరల్ ఫండ్'ను వినియోగించాలని ఉన్నతాధికారులు చెబుతున్నా అవీ అక్కరకు రావటం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చింతకాని మండలం వందనం గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలకు మిషన్ భగీరథ జలాలు సక్రమంగా అందటం లేదు. స్థానిక బోర్లు, బావుల నీళ్లు సరిపోకపోవటంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే మండలంలోని బొప్పారం గ్రామపంచా యతీకి ఆరు నెలలుగా మిషన్ భగీరథ నీరందటం లేదు. పంచాయతీలో నిధులు లేకున్నా అధికారులు సొంతంగా ఖర్చుపెట్టి తాగునీటి పంపిణీకి చర్యలు చేపట్టారు. రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో మోటార్లు కాలిపోవటంతో పంచాయతీ అధికారులు సొంతంగా రూ.వేలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. అయినా తరచూ ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతోంది. తాజాగా పైపులైన్ పగిలిపోవటంతో అప్పోసొప్పో చేసి బాగు చేయించి నీరందిస్తున్నారు.

వైరా మండలంలో సుమారు 370 చేతిపంపులు ఉన్నాయి. వీటిలో దాదాపు 100 పనిచేయటం లేదు. చాలాచోట్ల ప్రత్యామ్నాయ వనరులు బలంగా లేవని, మోటార్లు, లైన్లకు మరమ్మతులు చేపట్టాలని, నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

వేధిస్తున్న నిధుల కొరత

ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నప్పటికీ వారికి నిధులు, అధికారాలు లేకపోవటంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేకపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎక్కడెక్కడ బోర్లను అద్దెకు తీసుకోవాలి.. ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేయాలనే అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వేసవి ముందస్తు ప్రణాళికపై కసరత్తు జరిగినా నిధులు సమకూర్చితేనే అంతిమంగా ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సకాలంలో స్పందించకపోతే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్నచోట్ల తాగునీటి కష్టాలు తప్పటం లేదు. అశ్వాపురం మండలం రథంగుట్ట, పాల్వంచ సమీపంలోని తోగ్గూడెం నుంచి 1,500 గ్రామాలకు రోజుకు 15కోట్ల లీటర్ల తాగునీరు సరఫరా అవుతోంది. అయితే చాలా గ్రామాలకు సామర్థ్యం మేరకు మిషన్ భగీరథ పైపులైన్లు వేయలేదు. కొన్నిచోట్ల లైన్లు వేసినప్పటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, టేకులపల్లి, బూర్గంపాడు, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని కొన్నిగ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోంది. భద్రాచలం వంటి చోట్ల కొన్నేళ్ల క్రితం ఏర్పాటుచేసిన సురక్షిత మంచినీటి పథకాలను నిర్వహిస్తున్నా లీకేజీలు, మోటార్లు కాలిపోవడం, లైన్లు పగిలినప్పుడు సత్వరం పునరుద్ధరించకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఖమ్మం జిల్లాలోని 579 గ్రామ పంచాయతీలున్నాయి. నిధుల కొరతతో ప్రత్యేకాధికారులు నామమాత్రంగా తయారయ్యారు. చాలాచోట్ల తాగునీటి వనరుల కోసం రూ.వేలల్లో అప్పు చేయాల్సి వచ్చిందని పలువురు అధికారులు వాపోతున్నారు. సుమారు 300 గ్రామపంచాయతీలకు అవసరం మేరకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. పంచాయతీ కార్యదర్శులపై భారం పడుతున్నా తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి కార్యాచరణ ప్రణాళిక కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

రాంబాబు, డీఎల్‌పీఓ, ఖమ్మం

# పేరులోనే ఉంది అంతా

మంచిర్యాల : ధ్రువపత్రాల కోసం దరఖాస్తుల సమయంలో చాలా మంది తప్పులు చేస్తున్నారు. పేరు, ఇంటి పేరు, పుట్టిన తేదీని రాయడంలో చేస్తున్న పొరపాట్లు పెరుగుతున్నాయి. చాలా మంది తడబాటుకు గురవుతున్నారు. ధ్రువపత్రం వచ్చాక దోషాన్ని గుర్తించి ఆందోళన చెందుతున్నారు. పేర్లు, ఇతర వివరాలు సరిచూసుకోకుండా దరఖాస్తు చేస్తుండటంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. తమ పిల్లల విషయంలో తల్లిదండ్రుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ కార్యక్రమం ద్వారా విద్యార్థుల పురోగతిని పరిశీలించవచ్చన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం అపార్(ఆటోమేటెడ్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)ను ప్రవేశపెట్టింది. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్లాలన్నా, ప్రవేశ పరీక్షలు రాయాలన్నా అపార్ నంబరు వినియోగించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన నమోదు ప్రక్రియ సాంకేతిక కారణాలతో ముందుకు సాగడం లేదు. పాఠశాల రికార్డులో ఉన్న విద్యార్థుల వివరాలు, ఆధార్ నంబరును అపార్‌లో నమోదు చేయాలి. పాఠశాల రికార్డుల్లో ఉన్న పేరు, ఆధార్‌లో ఉన్న పేరు ఒకే రకంగా ఉండాలి. తేడా ఉంటే నమోదు కావడం లేదు.

ప్రస్తుతం చాలా మంది విద్యార్థులకు సంబంధించి పాఠశాల రికార్డుల్లో పేర్లు, ఆధార్ కార్డుల్లో పేర్లతో అక్షరదోషాలుగా ఉండడంతో వివరాల మార్పులకు తమ పిల్లల్ని వెంటేసుకొని ఆయా కార్యాలయాలు తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. ఆధార్‌కార్డుల్లో పేరు, అక్షర దోషాల సవరణకు తగిన ధ్రువపత్రాలు సమర్పించాలి. పుట్టిన తేదీకి మార్పులకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. చిన్నారులు పుట్టినప్పుడే పుట్టిన తేదీని నమోదు చేసుకోవాలి. బిడ్డ ఆసుపత్రిలో జన్మిస్తే సదరు ఆసుపత్రి వారు తల్లిదండ్రుల వివరాలు అడుగుతారు. మనం చెప్పిన వివరాలు సరిగ్గా నమోదు చేశారో లేదో ఒకటి రెండు సార్లు ఆరా తీయాలి. చిన్నారుల నామకరణం రోజు పెట్టే పేరును తల్లిదండ్రులు ముందుగానే నిర్ణయించుకుంటే మంచిది. జనన ధ్రువీకరణ పత్రం మీసేవలో దరఖాస్తు చేసుకుంటే ఆసుపత్రిలో మనం ఇచ్చిన వివరాలే సంబంధిత అధికారులు ఆమోదించి ధ్రువపత్రాన్ని జారీ చేస్తారు. చాలా మంది ఆసుపత్రుల్లో వివరాలు నమోదు తప్పుగా చేయించడంతో మరోసారి ఆసుపత్రుల ద్వారా సవరణకు దరఖాస్తు చేస్తున్నారు. పాఠశాల ప్రవేశాల్లో తమ చిన్నారులను బడికి పంపేందుకు ప్రవేశాల సమయంలో ఆధార్‌కార్డు, ఇంటిపేరు, తల్లిదండ్రుల పేర్లు పుట్టిన తేదీ వివరాలు కచ్చితంగా సరిచూసుకోవాలి. మనం ఇచ్చిన వివరాలు, పాఠశాల సిబ్బంది నమోదు చేసుకున్న వివరాలు ఒకేలా ఉన్నాయా లేదా సరిచూసుకోవాలి. పొరపాట్లు ఉంటే స్పందించి వెంటనే మార్పించుకోవాలి. ఆధార్...ప్రతి వ్యక్తికి ప్రస్తుతం ఆధార్ తప్పనిసరిగా మారింది. చిన్నారి ఆధార్ నమోదుకు వెళ్లినపుడు మనం ఇచ్చిన దరఖాస్తులో పొందుపర్చిన వివరాలు సరిగ్గానే ఉన్నా ఆధార్ కేంద్రం నిర్వాహకుడు వివరాలు నమోదులో తప్పులు చేసే అవకాశం ఉంది.

## పంచాయతీ పోరుకు ఏర్పాట్లు

సిరిసిల్ల : పంచాయతీ ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పల్లె ఓటర్లతోపాటు పోలింగ్ కేంద్రాల జాబితాను అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. జిల్లాలో 255 పంచాయతీలకు గతంలో 253కు ఎన్నికలు జరిగాయి. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి, ఇల్లంతకుంటలోని గొల్లపల్లి గ్రామాలకు ఎన్నికలు జరగలేదు. వీటితోపాటు ఈసారి ఇల్లంతకుంట, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఈరాలాల్‌తండా, రాచర్లబాకురుపల్లితండా, జైసేవాలాల్‌తండా, బోటివానిపల్లి, తాళ్లపల్లి పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. ఈసారి జిల్లాలో మొత్తం 260 పంచాయతీలు, 2,268 వార్డులకు ఎన్నికలు జరిపేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దీనికోసం ఇప్పటికే జిల్లా నుంచి పది మంది హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఎన్నికల శిక్షణకు వెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని అందుకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో జిల్లాలోని ఉన్నతాధికారులు సన్నాహక చర్యలు చేపట్టారు.

**ముద్రణ పూర్తి**-జిల్లాలో రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళిక చేశారు. వీటికి అవసరమైన బ్యాలెట్ పత్రాల ముద్రణకు ఎన్నికల సంఘం సూచించడంతో ముద్రణలు పూర్తయ్యాయి. సామగ్రిని మండల, జిల్లా పరిషత్తులకు పంపారు. పార్టీ రహితంగా జరిగే సర్పంచి ఎన్నికలకు ఒక్కో బ్యాలెట్ పత్రంపై ఎన్నికల సంఘం సూచించిన గుర్తులు, నోటాను ముద్రించారు.

ఎన్నికల సంఘం సర్పంచి అభ్యర్థికి 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను సూచించింది. వీటితోపాటు నోటాను సైతం ముద్రించారు.

ఏయే గుర్తులు ఏర్పాటు చేయాలో ఇప్పటికే అధికారులకు సమాచారం ఇచ్చారు.

బ్యాలెట్ పత్రాలను రెండు రంగుల్లో ఏర్పాటు చేయనున్నారు.

సర్పంచికి పింక్, వార్డు సభ్యులకు తెల్లరంగుపత్రాలు ఉన్నాయి.

పంచాయతీ ఎన్నికల్లో సూచనలు తెలిపే కరదీపికలు, చేతి పుస్తకాలు ఇప్పటికే మండలాలకు చేరాయి.

నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీటిలో ముద్రించారు.

పీవోలకు, ఆర్వోలకు శిక్షణ, విధి విధానాలు పోస్టల్ బ్యాలెట్ వంటి అంశాలు ఈ పుస్తకాల్లో పొందుపరిచారు.

## బాలబడుల్లో ఖాళీలు

జగిత్యాల : మూడేళ్లుగా వివిధ కారణాలతో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయినులు, ఆయాల పోస్టులు ఖాళీలు ఏర్పడటంతో అంగన్‌వాడీల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. నాలుగో వంతుకు పైగా ఖాళీలు ఉండటంతో కేంద్రాల నిర్వాహకులకు అదనపు బాధ్యతలు తప్పడం లేదు. 63 ఉపాధ్యాయినులు, 317 సహాయకుల పోస్టులు మొత్తం కలిపి 317 ఖాళీలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసున్న సహాయకులను తొలగించింది. జిల్లాలో మొత్తం 1065 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో గర్భిణులు 6037, బాలింతలు 6593, టీహెచ్‌ఆర్ లబ్ధిదారులు 32,929, ప్రీస్కూల్ విద్యార్థులు 13,426 మొత్తం కలిపి 58,985 మంది లబ్ధి పొందుతున్నారు.

**పదోన్నతుల తర్వాతే భర్తీ** ఖాళీల భర్తీ చేపట్టాలంటే మొదట అర్హత మేరకు ఆయాలకు పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. బదిలీలు, రేషనలైజేషన్, షిఫ్టింగ్ తదితర చర్యలు పూర్తయ్యాక ఖాళీలను గుర్తించి జాబితా రూపొందిస్తారు. అనంతరం నియామకాల అనుమతి కోసం కమిటీ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ ద్వారా కమిషనర్‌కు నివేదిస్తారు. అనుమతి లభించగానే నోటిఫికేషన్ విడుదల చేస్తారు. నిర్దేశిత షెడ్యూలు మేరకు దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, రికార్డులు, వివరాలు కమిషనర్‌కు నివేదిస్తారు. కమిటీ ఆధ్వర్యంలో విచారణ, అభ్యంతరాల స్వీకరణ, తరువాత కలెక్టర్ పరిశీలన పూర్తయ్యాక ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపడతారు. వితంతువులు, దివ్యాంగులు, అనాథ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఖాళీల భర్తీ కోసం మరో మూడు నెలల వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నేళ్లుగా 5 నుంచి 10వ తరగతి చదివిన వారిని ఆయాలుగా నియమించడంతో ఉపాధ్యాయినులు లేని కేంద్రాల్లో వారితోనే నెట్టుకొస్తున్నారు. ఉపాధ్యాయినులు, ఆయాలు రెండు పోస్టులు ఖాళీగా సుమారు 10 కేంద్రాలు ఉండగా వీటిని సమీపంలోని కేంద్రాల వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మరికొన్ని ప్రాంతాల్లో రెండు కేంద్రాలను కలిపి నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల వారికి అదనపు భారం తప్పడం లేదు.

**ఎన్నికల కోడ్ తర్వాత- డాక్టర్ బోనగిరి నరేశ్, జిల్లా సంక్షేమాధికారి**

ఎన్నికల కోడ్ తొలగిన తరువాత ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది. 2022 సక్షమ్ అంగన్‌వాడీ 2.0 నిబంధనల మేరకు ఉపాధ్యాయినులు, ఆయాల నియామకానికి కనీస అర్హత ఇంటర్మీడియట్ తప్పనిసరి. కేంద్రం కల్పించిన వెసులుబాటు ప్రకారం 2022కు ముందు పదో తరగతి, పదేళ్ల అనుభవం ఉన్నవారికి కూడా పదోన్నతుల్లో అకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే భర్తీ ప్రక్రియ మొదలవుతుంది.

## రూ.5 లక్షలతోనే ఇల్లు

పెద్దశంకరంపేట : ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌస్‌నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. దీని ఆధారంగానే లబ్ధిదారులు నిర్మించుకునేలా రూపొందిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షల సాయంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా ప్రతి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దీనిని నిర్మించేలా కార్యాచరణ చేపట్టారు.

సాయంలోనే పూర్తయ్యేలా..ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించనుంది. ఈ మొత్తంతో ఏ విధంగా ఇల్లు నిర్మించుకోవచ్చనేది ప్రయోగాత్మకంగా చూపడానికే నమూనా ఇళ్లను తయారు చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి కనీసం 60 గజాల స్థలం ఉండాలని నిబంధన విధించింది. ఇందులో స్లాబ్ ఏరియా 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. 12.5 వెడల్పు, 10.5 పొడవుతో పడక గది నిర్మించనున్నారు. 6.9 వెడల్పు, 10 చదరపు అడుగుల విస్తీర్ణంతో వంట గది, 9 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో ముందు గది నిర్మిస్తున్నారు. డాబా పైకి మెట్లు అనేది లబ్ధిదారుని ఇష్టం. దీంతో పాటు సాన్నాల గది, టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నారు. 8 పిల్లర్లలోనే పూర్తి చేసేలా నమూనాను రూపొందించారు. సంబంధించి మ్యాప్ బట్టి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఒకేలా ఉండేలా..స్థలాలు ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేలా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను తొలి విడతగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటి నిర్మాణానికి గృహనిర్మాణశాఖ ద్వారా ఇచ్చే నమూనా అందరికీ ఒకేలా ఉండేలా ప్రతి మండలంలో మోడల్ హౌస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిరిగానే నిర్మాణాలను చేపడుతున్నారు. ఇందుకోసం గృహనిర్మాణశాఖకు జిల్లాలో ఒక పీడీ, నియోజకవర్గానికి ఒక డీఈ, ఏఈలను నియమించారు. వీరి ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని నిర్వహించనున్నారు.

# సొమ్ము పక్కదారి.. ఏదీ రికవరీ



కరీంనగర్ : మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆసరాగా నిలవాల్సిన స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాల్లో అక్రమాల గోల ఆగడం లేదు. బోగస్ సంఘాలతోపాటు రుణాల రికవరీల్లో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్న ఘటనలు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా రామడుగు మండలంలో రూ.13 లక్షల లెక్క తేలడంలేదు. సీఏతోపాటు ఇతరులు చేతివాటాన్ని ప్రదర్శించిన తీరుతో మరోసారి రుణాల స్వాహాపై చర్చ జరుగుతోంది. పర్యవేక్షణలోని డొల్లతనాన్ని ఈ సంఘటన బహిర్గతం చేస్తోంది. ఇప్పటికే కరీంనగర్ నగరపాలక సంస్థలో రెండేళ్ల కిందట పొదుపు సొమ్మును బ్యాంక్‌ల్లో చెల్లించకుండా చేతిఖర్చులకు వాడుకున్న పలువురు రిసోర్స్ పర్సన్లు సిబ్బందిపై చర్యలు తీసుకున్నా పరిస్థితుల్లో మార్పు కనిపించడంలేదు. కఠినమైన చర్యలు తీసుకోకపోవడంతో స్వాహా అయిన సొమ్ము తిరిగి సర్కారు ఖజానాకు చేరడం లేదు. పైగా అక్రమాల్లో భాగమైన ఉద్యోగులు, సిబ్బంది ఇదంతా మామూలు వ్యవహారమేనని తేలిగ్గా తీసుకుంటున్నారు. ప్రతి ఏడాది ఇచ్చిన రుణాల్లో 70-80 శాతం రికవరీ అవుతుండగా.. పక్కదారి పట్టిన సొమ్ము 5-8 శాతం ఉంటోంది.

**పర్యవేక్షణ కరవు**

క్షేత్రస్థాయిలో సంఘాల సభ్యులు తీసుకునే రుణాల చెల్లింపు విషయంలో పారదర్శకంగా వ్యవహరించాల్సిన అధికారులు నామమాత్రపు పర్యవేక్షణను కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం జరిగే చెల్లింపుల విషయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు(సీవో), వారిపై టీఎంసీ, ఏడీఎంసీ, డీఎంసీ స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. వీరందరిపై పీడీ(ప్రాజెక్ట్ డైరెక్టర్) ఉంటారు. కానీ ప్రతినెల రుణాల రికవరీ విషయంలో పురోగతి లేని సందర్భంలో వీరి నిఘా పెరగాలి. సమీక్షలు, సమావేశాల్లో పక్కాగా వ్యవహరించాలి.

స్త్రీనిధి విషయంలోనే ఒక్క ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్లను రుణాలుగా ఇస్తున్నారు. బ్యాంక్ లింకేజీల్లో పట్టణాల్లోనే రూ.169.73 కోట్లు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇచ్చారు. జిల్లాలో 13,709 సంఘాల్లోని 1,48,089 మంది సభ్యులు గ్రామాల్లో ఉన్నారు. పట్టణాల్లో 6,199 సంఘాల్లో 64,818 మంది మహిళలున్నారు.

ఒక్క కరీంనగర్ కార్పొరేషన్‌లో గతేడాది మే నెలలో గుర్తించిన ఆడిట్‌లో రూ.69.84 లక్షల బకాయిలు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఇందులో ఓడీలు నలుగురు, 15 మంది ఆర్పీల ప్రమేయం ఉన్నట్లు నిగ్గుతేల్చారు. అత్యధికంగా ఒక ఆర్పీ రూ.15లక్షలు వాడుకున్నట్లు తెలిసింది. మొదట నోటీసులిచ్చి తరువాత కేసులు నమోదు చేశారు. అయినా పూర్తిస్థాయిలో మాత్రం పక్కదారి పట్టిన సొమ్ము తిరిగి రాలేదు. జిల్లా వ్యాప్తంగా గడిచిన రెండేళ్లకు సంబంధించి దాదాపు రూ.3 కోట్లకుపైగా సొమ్మును అధికారులు వసూలు చేయాల్సి ఉంది. తాఖీదులతోనే సరిపెడుతుండటంతో మళ్లీ అదే తరహా తప్పిదాలకు ఆస్కారం ఉంది. ముఖ్యంగా రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యల దిశగా వెళ్తేనే మెక్కిన సొమ్మును తిరిగి వసూలయ్యే అవకాశముంటుంది. ఈ దిశగా ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరముంది.

# ఆకలి చదువులు ఇంకెన్నాళ్లో..?




సిరిసిల్ల : ఏళ్లుగా ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రం ఆకలి కష్టాలు తీరడం లేదు. కొందరు చిరుతిళ్లను తింటూ అర్ధాకలితో, మరికొందరు ఖాళీ కడుపుతోనే పాఠాలు వింటున్నారు.

**ఇదీ పరిస్థితి** జిల్లాలోని మండల కేంద్రాల్లో పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. 2,590 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో మినహాయిస్తే ఇక్కడ చదువుకునే విద్యార్థులు గ్రామీణ ప్రాంత నేపథ్యానికి చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. కళాశాల సమయానికి చేరుకోవాలంటే ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల్లోపు ఇంటి నుంచి బయలుదేరుతున్నారు. సర్కారు కాలేజీల్లో చదివే బాలబాలికలు పేద కుటుంబాలకు చెందిన వారే కావడంతో ఉదయం అల్పాహారం తీసుకోకుండానే వస్తున్నారు. తల్లిదండ్రులకు పనుల దృష్ట్యా ఇంట్లో భోజనం తయారు కాదు. కొంతమంది తప్ప టిఫిన్ బాక్సులు తీసుకురాకుండానే కళాశాలకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం బయట దొరికే చిరుతిళ్లతో కడుపులు నింపుకొంటే, మరికొందరూ నీటితో సరిపెట్టుకుంటున్నారు. కొందరు మధ్యాహ్నం కాగానే ఇంటి ముఖం పడుతున్నారు. ఫలితంగా చదువుల్లో వెనకబడే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్నాహ్న భోజనం అమలు చేయాలని తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. వచ్చే ఏడాది నుంచి అమలు చేసేలా ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని వివరణ కోరగా మార్గదర్శకాలు అందలేదన్నారు. ప్రభుత్వం దగ్గర కళాశాలలు, సమాచారం ఉందన్నారు.

మధ్నాహ్న భోజనం అమలు చేస్తే జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరుగుతుందని.. త్వరితగతిన అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు కోరుతున్నారు.

**మధ్యాహ్న భోజనం అమలు చేస్తే మేలు**

– కోడం ప్రభాస్, నల్లగొండ

వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుతున్నా. 18 కి.మీ.ల దూరం నుంచి రావాల్సి ఉండటంతో ఉదయం టిఫిన్ కూడా చేయకుండా బయలుదేరాల్సి వస్తోంది. డబ్బులు ఉన్న రోజు ఏదైనా తినుబండారాలతో సరిపెట్టుకుంటాను. లేని రోజు సాయంత్రం వరకు నీరసించడం తప్పడం లేదు. దీంతో పాఠాలపై దృష్టి పెట్టలేకపోతున్నా. మధ్నాహ్న భోజనం అమలు చేస్తే విద్యార్థులందరికీ మేలు జరుగుతుంది.

# లక్షణంగా ఉపాధి



సంగారెడ్డి : వలసలను నిరోధించి.. స్థానికంగానే కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. యాసంగి సీజన్‌కు సంబంధించి ఇప్పటికే వరినాట్లు ముగిశాయి. కలుపుతీత సైతం కొద్ది రోజుల్లో పూర్తికానుంది. ఈ సీజన్‌లో వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉండటం.. వేసవి సమీపిస్తుండటంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఉపాధి హామీ పథకంపై దృష్టి సారించారు. తొలుత 60 వేల మందికి పని కల్పించడాన్ని లక్ష్యంగా నిర్దేశించారు. ఆ తర్వాత వారం వారం లక్ష్యాన్ని పెంచనున్నారు. మొత్తం లక్ష మందికి పని కల్పించాలని సంకల్పించారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు కార్యాచరణ సిద్ధం చేసి.. అమలుకు సన్నద్ధమయ్యారు.

**614 పంచాయతీల పరిధిలో..**

జిల్లాలో మొత్తం 647 గ్రామ పంచాయతీలు ఉండగా.. 614 పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి పంచాయతీ పరిధిలో 50 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్లేలా చూడాలని ఇటీవల అధికారులు నిర్ణయించారు. మరో 10 రోజుల తర్వాత ప్రతి గ్రామం నుంచి 100 మందికి ఉపాధి పనులు కల్పించనున్నారు. ఇలా క్రమక్రమంగా లక్ష్యాన్ని పెంచుకుంటూ.. జిల్లావ్యాప్తంగా లక్ష మంది కూలీలకు ఉపాధి పనుల ద్వారా భరోసా కల్పించాలని జిల్లా అధికారులు దిశా నిర్దేశం చేశారు.

**జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం**

జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పంట కాల్వల్లో పిచ్చి మొక్కల తొలగింపు, నీటి కుంటలు, ఊట కుంటలు, చెక్ డ్యాంలు, ఇంకుడు గుంతలు నిర్మించనున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మట్టిదారులకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీలకు చెందిన లబ్ధిదారుల భూములు చదును చేసి సాగుకు యోగ్యంగా మార్చుతారు. పశువుల షెడ్ల నిర్మాణం, నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయడం, వాటిని వివిధ ప్రాంతాల్లో నాటి సంరక్షించడం, క్రీడా మైదానాలను శుభ్రం చేయడం తదితర పనులు చేపట్టనున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంగా వ్యవహరించనున్నాయి.

**కూలీల సంఖ్య పెంచేలా చర్యలు: జ్యోతి, డీఆర్‌డీవో**

జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగింపు దశకు చేరాయి. కూలీలు ఉపాధి హామీ పథకం పనులకు వచ్చేలా కృషి చేస్తున్నాం. వారికి స్థానికంగా పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. తొలుత 60 వేల మందికి.. ఆ తర్వాత లక్ష మందికి పని కల్పించేలా లక్ష్యాన్ని నిర్దేశించాం. దీన్ని అమలు చేసేలా సిబ్బంది చొరవ చూపుతున్నారు. గుర్తించిన పనులను కూలీలకు కేటాయించడంతో పాటు.. వెంటవెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

పథకం అమలు ఇలా..

జిల్లాలో మండలాలు: 27

ఉపాధి పథకం అమలయ్యేవి: 25

మొత్తం పంచాయతీలు: 647

ఉపాధి పనులు అమలవుతున్నవి: 614

జాబ్ కార్డు కలిగినవారు: 2.19 లక్షలు

వారిలో యాక్టివ్ కూలీలు: 1.31 లక్షలు

## ప్లాస్టిక్‌తో పెను ప్రమాదం!

భువనగిరి : నిషేధిత ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి ఉంది. మార్కెట్‌లో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. 120 మైక్రాన్ల మందం లోపు పాలిథిన్ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించినప్పటికీ మార్కెట్‌లో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతుండటం గమనార్హం. పట్టణంలో నిత్యం 22 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. ఇందులో రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను మున్సిపల్ కార్మికులు సేకరిస్తున్నారు. సుమారు పది మంది వ్యాపారులు డిస్పోజల్ సరకులు విక్రయిస్తున్నారు. నిత్యం కార్మికులు సేకరిస్తున్న చెత్తలో హానికారక ప్లాస్టిక్ యార్డుకు చేరుతుంది. తనిఖీల పేరిట అడపాదడపా మున్సిపల్ అధికారులు హడావుడి చేయడం, సోదాలు నిర్వహించి జరిమానాలు విధించి వదిలేయడంతో నిషేధం అమలు పూర్తిస్థాయిలో కొనసాగడం



లేదు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్య పర్చే కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఫలితాలు రావడం లేదు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు మట్టిలో త్వరగా కలవదు. భూమిలోకి వర్షపు నీటిని ఇంకనీయదు. భూసారాన్ని దెబ్బతీస్తుంది. చివరికి మనషుల ఆరోగ్యానికి హానికరంగా మారింది. కర్మాగారాల్లో తయారవుతున్న సామగ్రిని అక్కడే నియంత్రిస్తే పాక్షికంగానైనా నిషేధం అమలయ్యే అవకాశం ఉంది. ఈ విషయమై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా.. ఇప్పటికే తనిఖీలు నిర్వహించి రూ.20 వేల వరకు జరిమానా విధించామని, పేపర్, నారతో తయారు చేసిన సంచుల వినియోగించాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

## పట్టని ప్రణాళిక

భువనగిరి : భువనగిరి పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక విభాగంలో ఇష్టారాజ్యం కొనసాగుతోంది. అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా భవనాల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగంలో పట్టణ ప్రణాళిక అధికారి, ఇద్దరు పర్యవేక్షకులు, క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు కార్మికులు ఉన్నప్పటికి నియంత్రణ పట్టుతప్పుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు పలు ఆవాస ప్రాంతాల్లో గత కొద్ది నెలలుగా నిర్మాణాల ఊపందుకున్నాయి. పట్టణ పరిధిలో ప్రస్తుతం 14018 నిర్మాణాలు ఉన్నాయి. 2023 సంవత్సరం నుంచి నేటి వరకు 248 నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చినప్పటికి, క్షేత్రస్థాయిలో నిర్మాణాల సంఖ్య అధికంగా ఉండటం గమనార్హం. సీతానగర్, న్యూరాంనగర్, ఎల్లమ్మగుడి, నల్గొండ రోడ్, సింగన్నగూడెం చౌరస్తా, ఆబాది ప్రాంతం, క్రిస్టల్ వెంచర్, పహాడీనగర్‌లలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు పూర్తికావడం గమనార్హం. పట్టణంలోని పలు ప్రాంతాల్లో గతంలో నిర్మించిన ఇళ్లపై అదనపు అంతస్థులను పలువురు అనుమతులు లేకుండానే నిర్మించుకుంటున్నారు. పట్టణంలోని జక్కయ్యనగర్, అర్బన్ కాలనీ, కోట శివారు, సీతానగర్, సింగన్నగూడెం, ప్రగతి నగర్‌లలో యజమానుల వద్ద సరైన ఆస్తి ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా మున్సిపల్ అధికారులు టీఎస్‌బీపాస్‌లో అనుమతులు ఇవ్వని కారణంగా, పలువురు నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు.


అనుమతులు లేకుండా నిర్మిస్తున్న 19 మంది యజమానులకు, ఆదనపు అంతస్థులు నిర్మించిన మరో తొమ్మిది మందికి నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతుండటం హాస్యాస్పదంగా మారింది. క్షేత్ర స్థాయిలో వందలాది నిర్మాణాలు ఉండగా ఇచ్చిన నోటీసులు స్వల్పంగా ఉండటం పనితీరుకు అద్దం పడుతోంది. నిబంధనల మేరకు 100 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించే ఇంటికి కనీసం 0.5 మీటర్లు, ముందు, వెనకా 1.5 మీటర్ల నుంచి 3 మీటర్లు సెట్ బ్యాక్ వదలాల్సి ఉంది. 200 నుంచి 300 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించే భవనానికి మూడు నుంచి ఐదు మీటర్ల సెట్ బ్యాక్, 300 నుంచి 750 మీటర్ల స్థలంలో చేపట్టే నిర్మాణానికి స్టిల్ట్ నిర్మాణాలకు అనుమతి ఉంటుంది. దీనికితోడు ముందు, వెనకా నాలుగు నుంచి ఆరు మీటర్ల సెట్‌బ్యాక్‌ను వదిలి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. సెట్‌బ్యాక్‌లు వదలకుండా నిర్మాణాలు చేపడ్తుండటంతో రహదారులు, అంతర్గత రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. కొందరు ఇంటి నిర్మాణాలకు అనుమతులు తీసుకుని ఆస్పత్రులు, వాణిజ్య సముదాయాలు నిర్మించడం గమనార్హం.

ఈ విషయమై టీపీఎస్ నరేష్‌ను వివరణ కోరగా.. ఇప్పటికే 28 మందికి నోటీసులు జారీ చేశామని, నాలుగు నిర్మాణాలను కూల్చివేశామని అన్నారు. నియంత్రణ చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టేందుకు సహకరించాలని కోరుతూ ఉన్నతాధికారులకు లేఖలు రాశామని వివరణ ఇచ్చారు.

## అరచేతిలో ఆరోగ్యశ్రీ సమాచారం

చొప్పదండి: రేషన్‌కార్డు కలిగిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తుండగా.. సేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచింది. ఈ పథకానికి అనుసంధానమైన నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీకార్డు లేదా రేషన్‌కార్డు చూపించి మనకు కావాల్సిన వైద్య సేవలు ఉచితంగా పొందే అవకాశముంది. అయితే కొన్ని ఆసుపత్రుల్లో అన్ని సేవలు లభించడంలేదు. ఈ క్రమంలో మనకు అవసరమైన సేవలు ఏఏ ఆసుపత్రుల్లో అందిస్తున్నారో తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు.

ఇలా చేయండిస్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌లో ఇంటర్నెట్‌లోకి వెళ్లి



రాజీవ్ ఆరోగ్యశ్రీ పోర్టల్ అని టైప్ చేస్తే యాప్ ఓపెన్ అవుతుంది. వెబ్‌సైట్ తెరవగానే (%search by Geography, search by speciality,search by locality%) అనే మూడు ఎంపికలు కనిపిస్తాయి. మీరు ఎంచుకున్న ఆప్షన్‌పై క్లిక్ చేస్తే కొత్త పేజీ తెరుచుకుంటుంది. జిల్లా, మండలం, ఆసుపత్రి ఎంచుకోగానే అందుబాటులో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు, వాటిలో అందించే సేవలు చూపెడుతాయి. ఆసుపత్రి చిరునామా, ఆరోగ్యమిత్రల పేర్లు, సెల్‌ఫోన్ నంబర్లు సైతం అందుబాటులో ఉంటాయి. ఏవైనా సందేహాలుంటే మీరు వెళ్లాలనుకుంటున్న ఆసుపత్రిలోని ఆరోగ్యమిత్ర సభ్యులను సంప్రదించవచ్చు.

# బ్యాంకర్ల రుణపాశం

భీమవరం : డ్వాక్రా సంఘాల ద్వారా సామాన్య, మధ్యతర గతి మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతమవడమేమో గాని కొన్నిచోట్ల చేయని అప్పులకు సైతం వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. బ్యాంకర్లు తమ టార్గెట్లు పూర్తిచేసుకునేందుకు కొన్ని డ్వాక్రా సంఘాల ఖాతాలకు అప్పులిచ్చినట్లు నిధులు జమ చేస్తూ అవసరం లేకపోయినా అప్పుల పాల్జేస్తున్నారు.

మండపాకలోని ఓ డ్వాక్రా గ్రూపునకు వెంకట్రాయపురంలోని ఓ బ్యాంకు సిబ్బంది వారి ప్రమేయం లేకుండా ఖాతాలో కొంత సొమ్ము జమ చేశారు. రోజుల వ్యవధిలో తిరిగి వెనక్కి తీసుకున్నారు. వేల్పూరులోని మరో బ్యాంకు సిబ్బంది సైతం ఇలాగే చేశారు. గమనించిన గ్రూపు సభ్యులు బ్యాంకు సిబ్బందిని నిలదీయగా సమాధానం దాటవేశారు.

కొంతమంది బ్యాంకర్లు తమ టార్గెట్ల కోసం మహిళల ఖాతాలకు రుణం మంజూరు చేసినట్లు సీసీ ఖాతా ద్వారా సొమ్ములు వేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే రుణం అవసరం లేదా అంటూ వడ్డీ సహా వెనక్కి తీసుకుంటున్నారు. బ్యాంకర్లకు అటు రుణం మంజూరు చేసినట్లు, ఇటు రికవరీ చేసినట్లు అవుతుంది. సామాన్యులపై ప్రాసెసింగ్ ఫీజు, వడ్డీ, ఇతరత్రా అంటూ బాదేస్తున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో ఇలాంటివి ఎక్కువైనట్లు పలువురు ఏపీఎంలు వాపోతున్నారు.

భారంగా.. పది మంది మహిళలు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి, బ్యాంకు ద్వారా రుణం పొందుతారు. దీనికి సభ్యులందరి తీర్మానం, వారి ఫొటోలు, సంతకాలు తదితర పత్రాలు సమర్పిస్తే బ్యాంకర్లు రుణం మంజూరు చేస్తారు. వీటిని ఆర్పీలు, వారిపైన సీవో(కమ్యూనిటీ ఆర్గనైజర్)లు పర్యవేక్షించాలి. రుణం పొందిన సంఘం ప్రతినెలా



కొంతమొత్తం చెల్లిస్తుంది. తీసుకున్న రుణం పూర్తికాకుండా మరో రుణం ఇచ్చేందుకు అనేక పత్రాలు బ్యాంకుకు సమర్పించాలి. ఒక్కోసారి అన్ని అర్హతలున్నా ఇవ్వరు.

**కానీ టార్గెట్ల సాకుతో..** కొంతమంది బ్యాంకు సిబ్బంది మహిళా సంఘాల ఖాతాలకు వారి అనుమతి లేకుండానే సీసీ (క్యాష్ క్రిడెట) అకౌంటు ద్వారా రుణం ఇచ్చినట్లు సొమ్ములు వేసేస్తున్నారు. రుణం మంజూరు చేసినందుకు ప్రాసెసింగ్ ఫీజు, వడ్డీ మినహాయిస్తున్నారు. ముందుగా తీసుకున్న రుణానికి అసలు, వడ్డీతో పాటు ఖాతాలో వేసిన నగదుకు వడ్డీ చెల్లించాల్సి వస్తోందని, తిరిగి కట్టే సమయంలో భారమవుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ కోసం.. డ్వాక్రా సంఘాల్లోని ఆర్థిక లావాదేవీలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన ఆర్పీలు, సీవోలు(కమ్యూనిటీ ఆర్గనైజర్లు) కొంతమంది తమకొచ్చే కమీషన్ కోసం ఏమీ చెప్పడం లేదు. కొన్నిచోట్ల బ్యాంకర్లతో కలిసి దగ్గరుండి వారే ఈ మోసాలకు పాల్పడుతున్నారు.

డ్వాక్రా గ్రూపు సభ్యుల తీర్మానం లేకుండా వారి ఖాతాల్లో రుణం వేయడానికి లేదు. బ్యాంకర్లకు దీనిపై స్పష్టమైన సూచనలు చేశామని డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్ తెలిపారు.

2024-25 ఆర్థిక సంవత్సరం
గ్రూపుల సంఖ్య: 7018
రుణ లక్ష్యం: రూ. 130.67 కోట్లు

## పల్లె పండగకు బిల్లుల బెంగ

తాడేపల్లిగూడెం : అయిదేళ్ల వైకాపా పాలనలో అస్తవ్యస్తంగా మారిన రహదారులను బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో గ్రామాల్లో పెద్ద ఎత్తున సీసీ, బీటీ, డబ్ల్యూబీఎం రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ ఏడాది సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో చేపట్టగా వివిధ కారణాలతో పూర్తికాలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నా బిల్లులు రాకపోవడంతో పనులు మందగించాయి.

ఉభయ జిల్లాల్లో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన 2,469 పనులకు గత ఏడాది అక్టోబరు 14 నుంచి 20వ తేదీ వరకు ప్రజాప్రతినిధులు భూమి పూజలు, శంకుస్థాపనలు చేశారు. ఈ పనులకు కూటమి ప్రభుత్వం రూ.173.60 కోట్లు కేటాయించింది. సంక్రాంతి పండగ నాటికి గ్రామాల్లో పల్లె పండగ పేరుతో చేపట్టే అన్ని పనులు పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ చేపట్టారు. సీసీ, బీటీ, డబ్ల్యూబీఎం రహదారుల నిర్మాణానికి మొదట్లో బిల్లుల సమస్య లేదు. పని ప్రారంభించిన తర్వాత ఉపాధి హామీ పోర్టల్లో అప్లోడ్ చేసిన వెంటనే వచ్చేవి. వారం వారం చెల్లింపులు జరిగేవి. రెండు నెలలుగా గుత్తేదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. 60 శాతం పూర్తయినా.. ఉభయ జిల్లాల్లో రూ.67.91 కోట్లు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. దాదాపు 60 శాతం పైనే పనులు పూర్తయ్యాయి. మినీ గోకులం షెడ్లదీ ఇదే పరిస్థితి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల డ్వామా పీడీలు సుబ్బారావు, అప్పారావులు మాట్లాడుతూ ఈ నెలాఖరుకు నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. మందలపర్రు-క్రొవ్విడి మధ్య రూ.1.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న డబ్ల్యూబీఎం రహదారి పనులు 50 శాతం పూర్తయ్యాయి. బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు మందగించాయి.

# వాహన బీమా.. యజమానికి ధీమా



అనకాపల్లి : రోడ్లపై ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో వాహనానికి, అవతలి వారికి జరిగిన ఆర్థిక నష్టానికి వాహన బీమా పరిహారం అందిస్తుంది. ఇంతటి సౌకర్యం కలిగిస్తున్న బీమాను మాత్రం చాలామంది వాహనదారులు విస్మరిస్తున్నారు. వాహనం కొనుగోలు చేసేటప్పుడు మినహా ఆ తర్వాత బీమా చేయించుకోవడం లేదు. అధిక శాతం మంది బీమా భారంగా భావించి పునరుద్ధరించుకోవడం లేదు. దీంతో అనుకోని ఘటనలు జరిగి కుటుంబ పెద్దను కోల్పోయి అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహన బీమా చాలా ముఖ్యమని రవాణా, పోలీస్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 45 శాతం వాహనాలకు..**

రూ.లక్షలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసి రూ.వేలల్లో చెల్లించే బీమాకు మాత్రం ముందుకు రావడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.15 లక్షల వరకు ద్విచక్ర వాహనాలు ఉండగా వీటిలో దాదాపు 45 శాతం వాహనాలకు బీమా లేకుండానే రహదారులపై తిరుగుతున్నట్లు రవాణా, పోలీసు శాఖ విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. బీమా పత్రాలు లేకుండా ద్విచక్ర వాహనం, ఆటో, కారు, లారీ బస్సు ఏ వాహనం నడిపినా ఎంవీ యాక్ట్ ప్రకారం రూ.3500 వరకు జరిమానా చెల్లించాల్సిందే.

**సంఘటన-1**

ఆర్అండ్బీ ప్రాంతానికి చెందిన కె.అప్పారావుకు జనవరిలో తాటిచెట్ల పాలెం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాలవ్వడంతో పాటు, వాహనం పూర్తిగా దెబ్బతింది. వాహనం కొనేటప్పుడు చేసిన బీమా ఉన్నప్పటికీ, సమయం ముగిసిన తర్వాత పునరుద్ధరించుకోకపోవడంతో బీమా వర్తించలేదు. దీంతో అతను రూ.లక్ష వరకు ఖర్చు చేసి వాహనాన్ని బాగు చేయించుకోవాల్సి వచ్చింది.

**సంఘటన-2**

గత నెలలో మర్రిపాలెంలో లారీ ఢీకొన్న ప్రమాదంలో కంచరపాలేనికి చెందిన పి.ప్రసాదరావు స్వల్ప గాయాలయ్యాయి. వాహనం ముందు, వెనుక భాగాలు పూర్తిగా నుజ్జయ్యాయి. వాహనం బాగు చేసేందుకు రూ.80 వేలు ఖర్చు చేయగా వాహనానికి బీమా ఉండటంతో పూర్తి వివరాలతో క్లెయిం చేయడంతో వెసులుబాటు పొందాడు.

**ఎక్కువగా ద్విచక్రవాహనాలే..:** ఉమ్మడి విశాఖ జిల్లాలో ద్విచక్ర వాహన విక్రయ షోరూంలు 45 వరకు ఉన్నాయి. ఒక్కోదాంట్లో ప్రతి రోజు 7 నుంచి 10 వరకు వాహన విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు తప్పనిసరి కావడంతో బీమా చేయించుకుంటున్నారు. ఆ తర్వాత పూర్తిగా విస్మరిస్తున్నారు. ద్విచక్ర వాహనదారుల్లో ఈ నిర్లక్ష్యం ఎక్కువగా కనిపిస్తోందని, బీమా పునరుద్ధరణకు కొంతమంది ముందుకురావడం లేదని రవాణ శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఇదే విషయమై నగరంలో 15 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో వాహనాలు (సుమారు)
ద్విచక్ర: 15.23 లక్షలు
కార్లు: 2.75 లక్షలు
ఆటోలు: 48,000
సరకు రవాణా: 35,568

# చిక్కినా .. బరి తెగింపే!



విశాఖపట్నం :గంజాయి మత్తు కొందరి నిత్య జీవితంలో భాగమైంది. అది లేనిదే రోజుగడవదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆకు రూపంలో, ఆయిల్ రూపంలో ఎలాగైనా గంజాయి సిగరెట్లలో పెట్టి పొగ పీల్చాల్సిందే అన్నట్లు అలవాటు పడిపోయారు. కేసుల్లో చిక్కి కేంద్ర కారాగారానికి వచ్చే రౌడీషీటర్లు, నిందితులు గంజాయి కోసం బరితెగిస్తున్న తీరు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే.

**అలా రహస్యంగా..:** పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న 11 మందిపై ఇప్పటికే పీడీ యాక్టు అస్త్రం ప్రయోగించి రిమాండ్కు పంపారు. ఈ క్రమంలో ఇటీవల రిమాండ్ విధించిన ఓ రౌడీషీటర్ను బ్యారక్లోకి పంపే ముందు దుస్తులు తీసేసి తనిఖీలు నిర్వహించగా జైలు అధికారులు విస్తుబోయారు. ఐడ్రాప్స్ బాటిల్లో ద్రవ రూప గంజాయి నింపి దానిని రహస్యభాగంలో దాచిపెట్టాడు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆరిలోవ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే..కోర్టు నుంచి కారాగారానికి తరలించే సమయంలో ఎవరు.. ఎక్కడ...ఎలా గంజాయిని రౌడీషీటర్కు అందించారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే వారిని గుర్తించినట్లు సమాచారం.

గతేడాది నవంబరులో కారాగారంలో డిప్యుటేషన్పైవచ్చిన ఓ ఫార్మాసిస్టును రిమాండ్ ఖైదీగా ఉన్న గుర్రాల సాయి పరిచయం చేసుకున్నాడు. భోజన బాక్సులో 95 గ్రాముల గంజాయి తెచ్చిన ఆ ఫార్మాసిస్టు సాయికి అందించేందుకు యత్నిస్తూ తనిఖీల్లో పట్టుబడ్డారు. అంతకుముందు ములాఖత్కు వచ్చిన ఓ పాత నేరస్తుడు గోడపై నుంచి ఖైదీలున్న చోటికి గంజాయి ప్యాకెట్లు విసిరేయగా గమనించిన సిబ్బంది పట్టుకుని ఆరిలోవ స్టేషన్లో అప్పగించారు.

**సిబ్బందికి కాసులు:** కేంద్ర కారాగారంలో వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న, రిమాండ్ ఖైదీలు 2వేల మందికి పైగా ఉన్నారు. అందులో సుమారు 1,145 మంది గంజాయి కేసుల్లోని రిమాండ్ ఖైదీలే. కారాగారానికి రాకముందు మత్తుకు అలవాటుపడిన చాలా మంది... జైల్లో ఉన్నప్పుడూ గంజాయి కోసం దారులు వెతుక్కుంటున్నారు. ఎలాగైనా కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో కారాగారంలో గంజాయి సరఫరాకు డిమాండ్ పెరిగిపోయింది. ఇదే అవకాశంగా సొమ్ములు ఆశించి గతంలో కొందరు సిబ్బంది సరఫరా చేశారన్న ఆరోపణలున్నాయి. కొన్ని ఉదంతాలు సైతం వెలుగులోకొచ్చాయి. ప్రస్తుతం కారాగారంలో తనిఖీలు పెంచారు. మత్తుకు అలవాటు పడిన ఖైదీల కోసం డి-అడిక్షన్ కేంద్రాన్ని కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది.

# సు'జలం'.. సఫలమయ్యేలా



చిత్తూరు: హంద్రీ- నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. వైకాపా హయాంలో ఎన్నికలకు ముందు తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకుని నామమాత్రంగా నీరు విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా కృష్ణా జలాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తెచ్చేందుకు యత్నిస్తోంది. ఇప్పటికే పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువల లైనింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రధాన, నీవా బ్రాంచినీ పట్టాలెక్కించాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. ఇందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు కోరారు.

తెలుగుదేశం హయాంలో 2014- 19 మధ్య ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ పనులు వేగంగా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటపడి మరీ పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువల నిర్మాణంతో పాటు ప్రధాన, నీవా ఉప కాలువల నిర్మాణ పనులు చేయించారు. ఈ క్రమంలో కేవీపల్లె మండలం అడవిపల్లె రిజర్వాయర్ను పూర్తి చేశారు. ప్రధాన కాలువ నిర్మాణం సింహభాగం అప్పట్లోనే జరిగింది. కేవలం 1.40 కి.మీ మేర మట్టి పనులు, 51 స్ట్రక్చర్లు అసంపూర్తిగా ఉన్నాయి.

**బకాయిలు, లైనింగ్కు రూ.500 కోట్లు!**

గతంలో పనులు చేసిన గుత్తేదారులకు రూ.125 కోట్ల బకాయిలు చెల్లించాలి. ప్రధాన, నీవా బ్రాంచి కాలువల లైనింగ్తో కలుపుకొని సుమారు రూ.500 కోట్లు అవసరమని ఇప్పటికే హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు విన్నవించారు. పాలనా అనుమతులు మంజూరు చేసి టెండర్లు పిలవాలని కోరారు. త్వరలోనే ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 మండలాల్లోని 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది. చిత్తూరు నగరానికి తాగునీటి ఎద్దడి ఉండదు.

**ఐదేళ్లలో అడుగు పనీ జరగక**

చిన్నమండ్యం మండలం పడమటి కోన వద్ద 200 మీటర్లు, కలకడ దగ్గర 300 మీటర్లు మాత్రమే కాలువ తవ్వాలి. రెండు- మూడు నెలల్లోనే చేసే అవకాశం ఉన్నప్పటికీ సీమ బిడ్డనని చెప్పుకొనే జగన్ పట్టించుకోలేదు. ఐదేళ్ల పాలనలో తట్ట మట్టీ ఎత్తిన పాపాన పోలేదు. ఒక్క అడుగు పనీ జరగలేదు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పదేపదే గుర్తు చేసినా ఫలితం లేదు.

పోలవరం తర్వాత అత్యధిక నిధులు

ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షలతో కాలయాపన చేయకుండా 2024-25 బడ్జెట్లో రూ.1,867.76 కోట్లు కేటాయించడమే కాకుండా ఈ ఏడాది జనవరి నాటికి రూ.1,586.18 కోట్లు ఖర్చు చేశారు. మిగతాదీ ఈ నెలలోగా వెచ్చిస్తామని అధికారులు చెబుతున్నారు. 2025- 26 బడ్జెట్లో పోలవరం ప్రాజెక్టు తర్వాత అత్యధికంగా హంద్రీ- నీవా సుజల స్రవంతికే నిధులు ఇచ్చారు.

# ఎన్నాళ్లో వేచిన ఉదయం

మద్దిపాడు : పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలన్న మహాత్ముని పలుకులను గత పాలకులు పెడచెవిన పెట్టారు. ఫలితంగా గుంతల రహదారులు..దెబ్బతిన్న మురుగు కాలువలు..అపరిశుభ్రతతో నిండిన పరిసరాలతో పరిస్థితి దుర్భరంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీలో భాగంగా రూ.కోట్లు వెచ్చించి కొత్త సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో ఇవన్నీ నందనవనాల్లా మారుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పల్లె పండగ మొదలైంది. ఉపాధి హామీ నిధులతో ప్రతి గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇందుకోసం జిల్లాకు దాదాపు రూ.150 కోట్లు వెచ్చించి 1143 రోడ్ల నిర్మాణానికి సంకల్పించారు. దాదాపు 80 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి.

**తప్పిన అవస్థలు:** గతంలో ఏమాత్రం చిన్న వాన పడినా మోకాళ్ల లోతు నీళ్లలో వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడేవారు. పాఠశాలలకు వెళ్లాలంటే దాదాపు అసాధ్యమే! ఈ నేపథ్యంలో పల్లె పండగలో భాగంగా పనులు చేపట్టి సంక్రాంతి నాటికి



వాటి దశ మార్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. జిల్లాకేంద్రానికి ఆనుకుని ఉన్న మండలాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మద్దిపాడు మండలంలో 29 పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 7.3 కి మీ మేర సీసీ బాటల నిర్మాణానికి రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేశారు. నాలుగు దశాబ్దాల కిందట ఏర్పడిన మద్దిపాడు బీసీ కాలనీకి ఇప్పటికీ రోడ్డు లేదు. ఇప్పుడు వారు హాయిగా జాతీయ రహదారిని చేరుకునే అవకాశం దక్కింది. మద్దిపాడు, దొడ్డవరం, పెద కొత్తపల్లి, నాగన్నపాలెం, కొలచనకోటలో ఇప్పటికే ఏర్పాటయ్యాయి. బసవన్నపాలెం, ఇనమనమెళ్లూరు, రాచవారిపాలెం తదితర గ్రామాల్లోనూ పనులు పూర్తయ్యాయి. మిగిలినవి సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సంతనూతలపాడు మండలంలో మొత్తం 30 రోడ్లు మంజూరు కాగా, వీటికి రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు 25 పనులు పూర్తవ్వగా, మిగిలినవి జరుగుతున్నాయి.

# రూ.60 కోట్లు... బూడిదలో పోసిన పన్నీరు!

కడప: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన సొంత నియోజకవర్గం పులివెందులలో సైతం అభివృద్ధి పనులు పూర్తి చేసుకోలేకపోయారు. చాలా వరకు పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయాలనే ధ్యాస లేకుండా పోయిందనే విమర్శలు మూటగట్టుకున్నారు. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించినా ప్రయోజనం లేకుండా బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ కోవకు చెందినదే సూక్ష్మసేద్యం ప్రాజెక్టు. సూక్ష్మసేద్యం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే లక్ష్యాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. గతంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్రెడ్డి పాలనలో పెండింగ్లో ఉన్న సూక్ష్మసేద్యం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో 2021, మార్చిలో అప్పటి సీఎం జగన్ మరోసారి శిలాఫలకం ఆవిష్కరించారు.

క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగలిలా అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. పులివెందుల నియోజకవర్గంలోని పైడిపాలెం, లింగాల కుడి కాలువ, పీబీఆర్ జలాశయాల పరిధిలోని మొత్తం 1,22,480 ఎకరాలకు సూక్ష్మసేద్యం ద్వారా సాగునీరందించే దిశగా ప్రయత్నాలు జరిగాయి. ఈ నేపథ్యంలో వాటి నిర్మాణపనులు పూర్తిచేసేందుకు రూ.1,256 కోట్ల అంచనాలతో పనులను మెగా కంపెనీకి వైకాపా ప్రభుత్వం కట్టబెట్టింది. 2021,



మార్చిలో చేసుకున్న ఒప్పందం ప్రకారం 2024, మార్చి ఆఖరి నాటికి వాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి 10.50 శాతం పనులు పూర్తి చేసి రూ.60 కోట్ల బిల్లులు గుత్తేదారుకు చెల్లించేశారు. సూక్ష్మసేద్యం పనులు పూర్తయితే కరవు నేలలో పచ్చని పైర్లతో కళకళలాడుతుంది.

**రెండేళ్లుగా ముందుకు సాగని పనులు :** ఆకృతుల మేరకు ఒక సంపు నుంచి సూక్ష్మసేద్యం పద్దతిలో 100 నుంచి 120 ఎకరాలకు సాగునీరందేలా వాటి నిర్మాణాలు రూపుదిద్దాల్సి ఉంది. ఈ విధంగా 1,22,480 ఎకరాలకు సాగునీరు సరఫరా చేసేందుకు 1,275 సంపులు నిర్మించాల్సి ఉండగా, 60 సంపులు పూర్తి కాగా, మరో 10 వరకు నిర్మాణ దశలో నిలిచిపోయాయి. మిగతా సంపుల నిర్మాణాలు చేపట్టేందుకు కావాల్సిన భూసేకరణ కార్యక్రమం ఆగిపోయింది. ఒక్కో సంపు నిర్మాణానికి 60 సెంట్ల స్థలం కావాల్సి ఉంది. ఈ మేరకు స్థలాన్ని వదులుకునేందుకు చాలామంది రైతులు ముందుకు రాలేదు. ఎక్కువ విస్తీర్ణం భూమి ఉన్న రైతులు మాత్రమే ముందుకొచ్చారు. ఎకరా లేదా రెండు ఎకరాలు భూములు ఉన్న కర్షకులు ఆ మేరకు భూమి కోల్పోయేందుకు ససేమిరా అన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు ముందుకు సాగలేదు. చేపట్టిన పనుల మేరకు సంపుల నుంచి నీటిని తోడేందుకు మోటార్లు, పొలాల్లో బిందు, తుంపర సేద్యం పరికరాలు అమర్చాల్సి ఉంది. గుత్తేదారు క్షేత్ర స్థాయి నుంచి వెళ్లిపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో వెచ్చించిన రూ.60 కోట్లు వృథాగా పోయాయి.

# సౌర.. ఔరా!

తిరుపతి : సహజ వనరుల వినియోగంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం దూసుకెళ్తోంది. సౌరవిద్యుత్‌ను ఉపయోగించుకుంటూ ఏటా రూ.15 లక్షలు ఆదా చేస్తోంది. మంచి ఫలితాలు రావడంతో అధికారులు సౌర విద్యుత్తు ప్లాంట్ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మహిళా వర్సిటీలో న్యూ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ (నెడ్ క్యాప్) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు వినియోగించుకుంటూ రెండు ప్రాంతాల్లో సౌరవిద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసి.. విద్యుత్ అవసరాలను తీర్చుకుంటున్నారు. పరిపాలనా భవనంపై 300 చదరపు అడుగుల్లో 30కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేశారు. దీనికి రూ.30 లక్షలు అవసరం కాగా.. నెడ్‌క్యాప్ రాయితీ రూ.9 లక్షలు (30 శాతం) ఇచ్చింది. దీని నుంచి రోజుకు 135 కిలోవాట్లు, నెలకు 4,050 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. దీనివల్ల నెలకు రూ.33,440, ఏటా రూ.3,89,280 విద్యుత్ బిల్లు ఆదా చేస్తున్నారు. హ్యుమానిటీస్ బ్లాకుపైన 900 చదరపు అడుగుల స్థలంలో 90 కిలోవాట్లతో మరో సౌర ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని వ్యయం రూ.62,10,000 కాగా.. నెడ్‌క్యాప్ 20 శాతం సబ్సిడీ ఇవ్వడంతో రూ.51,82,245/-తో ప్లాంటు నిర్మించారు. దీని నుంచి రోజుకు



405 కిలోవాట్లు, నెలకు 12,150 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. తద్వారా నెలకు రూ.98,321, సంవత్సరానికి రూ.11,67,858 విద్యుత్ బిల్లును ఆదా చేస్తున్నారు. రెండు ప్లాంట్ల ద్వారా ఏటా రూ.15 లక్షల వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతోంది. త్వరలో పీఎం నిధులతో 230 కిలోవాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్‌ను వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల భవనంపై ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీనికి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తారు.

**పూర్తిస్థాయిలో సౌర పలకల ఏర్పాటుకు కృషి**

ప్రస్తుతం వర్సిటీలోని రెండు ప్లాంట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇస్తుండటంతో విద్యుత్ బిల్లు తగ్గుతోంది. వర్సిటీ అవసరాలన్నింటినీ సౌర విద్యుత్తు ద్వారా తీర్చుకునేందుకు పీఎం ఉష పథకం కింద రూ.కోటితో ఇంజినీరింగ్ కళాశాలపై పలకల ఏర్పాటుకు అనుమతి పొందాం. త్వరలో టెండర్లకు వెళ్తున్నాం. ఆచార్య వి.ఉమ, వీసీ, మహిళా వర్సిటీ

# వేసవి జలాశయానికి ముప్పున్నా.. గ్రావెల్ తవ్వకాలు



సూళ్లూరుపేట : ప్రజలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన వేసవి జలాశయం (సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు) చెంతే మట్టి తవ్వకాలు చేపడుతుండటంతో ముప్పు పొంచి ఉంది. సూళ్లూరుపేట మండలం లోని మంగళంపాడు చెరువులో రాత్రి సమయాల్లో భారీ యంత్రాలతో గ్రావెల్, మట్టి తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. సూళ్లూరుపేట పురపాలక సంఘంలో శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు రూ.162 కోట్లతో ఏడీబీ నిధులతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. ఇక్కడ నీటి నిల్వలను అన్నీ ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా తరలించాల్సి ఉంది. ఈ ప్రాంతంలో ఇబ్బడిముబ్బడిగా తవ్వుతుండటంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పలుమార్లు అధికారులకు విన్నవించినా.. మట్టి మాఫియా మాత్రం తగ్గడం లేదు. ఈ విషయమై జల వనరుల శాఖ డీఈఈ శ్రీధర్‌ను అడగ్గా మంగళంపాడు చెరువులో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. ట్యాంకు విషయమై ప్రజారోగ్యశాఖ డీఈఈ శ్రీనివాసులురెడ్డి అడగ్గా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులివ్వలేదని తెలిపారు.

# ఆదర్శ పాఠశాలల ఆహ్వానం

విశాఖపట్నం : ఆదర్శ విద్యాలయాల్లో ప్రవేశం పొందితే ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా చదువుకోవచ్చు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2011లో అక్షరాస్యతారంగా వెనకబడిన ప్రాంతాల్లో ఈ పాఠశాలలను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఐదు ఆదర్శ పాఠశాలలు ఉండగా.. 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రాత పరీక్ష నిర్వహించి సాధించిన మార్కుల ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తారు. జిల్లాలోని చీడికాడ మండలం మంచాల, రావికమతం మండలం మరుపాక, నర్సీపట్నం మండలం వేములపూడి, కశింకోట మండలం తేగాడ, మునగపాక మండలం పాటిపల్లిలో ఈ పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో వంద చొప్పున మొత్తం 500 సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీటు సాధిస్తే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు.

**అర్హతలు ఇవీ..** ఓసీ, బీసీ విద్యార్థులు 01.09.2013 నుంచి 31.08.2015 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2011 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఒకేచోట 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో చదివి ఉండాలి. ప్రస్తుత సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఆరో తరగతికి ప్రమోట్ అయి ఉండాలి. రాత పరీక్షలో సాధించిన మార్కులు, రోస్టర్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. **దరఖాస్తు ఇలా** ఆసక్తి, అర్హత ఉన్న బాలబాలికలు ముందుగా %www.apms.apcfss.in, www.csc.ap.gov.in% వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అభ్యర్థుల ఫీజు చెల్లించాక ఓ ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఆ నంబరు ఆధారంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. **ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష..** ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదర్శ పాఠశాలల్లో ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల మధ్యాహ్నం 12 గంటలకు వరకు పరీక్ష ఉంటుంది. ఎంపిక చేసుకున్న కేంద్రంలోనే పరీక్ష రాయాలి. ఐదో తరగతి సిలబస్ నుంచి తెలుగు, ఆంగ్లంలో ప్రశ్నపత్రం ఉంటుంది. గణితంలో 20, తెలుగులో 20, సాంఘిక శాస్త్రంలో 20, ఆంగ్లంలో 20, సైన్సులో 20 మార్కులు చొప్పున మొత్తం వంద మార్కులకు పేపర్ ఇస్తారు. ఏప్రిల్ 27న మెరిట్ జాబితా విడుదల చేస్తారు. 30న ప్రవేశాలు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారు. వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల, చీడికాడ

# ‘వక్క’ దిగుబడి ఉన్నా దిగాలే!



మడకశిర : రాష్ట్రంలోనే వాణిజ్య పంటగా వక్కను ఉమ్మడి అనంత జిల్లాలో అత్యధికంగా సాగు చేస్తున్నారు. ప్రధానంగా మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకర్గాల్లో పండిస్తున్నారు. దిగుబడి బాగున్నా మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రెండేళ్లుగా పండించిన వక్క పంటను రైతులు ఇళ్లల్లోనే నిల్వ ఉంచుకున్నారు. ఇదిలా ఉండగా మళ్లీ దిగబడి చేతికి రావడానికి సిద్ధమైంది. ఎకరాకు సుమారు 6 క్వింటాళ్ల చొప్పున 40 వేల క్వింటాళ్ల పంట వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**కర్ణాటకకు వెళ్లాల్సిందే..**

మడకశిర నియోజకవర్గంలో 3 వేల మంది రైతులు దాదాపు 10వేల క్వింటాళ్ల ఎండబెట్టిన వక్క ఇళ్లల్లోనే ఉంచుకున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు రూ.46వేల నుంచి రూ.48 వేల వరకు ధర పలుకుతోంది. ధర ఆశాజనకంగా ఉన్నా నాణ్యత లేదనే సాకుతో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో రూ.46 కోట్లు విలువ చేసే వక్క రైతుల ఇళ్లల్లో మూలుగుతోంది. దిగుబడిని అమ్ముకోవాలంటే కర్ణాటక రాష్ట్రంలోని భీమసముద్రం, తుమకూరు, శివమొగ్గ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దాదాపు 150 కిమీ వ్యయప్రయాసలకు ఓర్చి తరలిస్తే క్వింటాకు రూ.2వేలు వరకు ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు.

**ముఖ్యమంత్రి మాటిచ్చారు..**

గత ఏడాది ఆగస్టు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర మండలంలో పర్యటించిన సందర్భంగా వక్క మార్కెట్, పరిశ్రమ ఏర్పాటుతో పాటు హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. మార్కెట్, పరిశ్రమ నిర్మాణం ఎప్పుడు మొదలవుతుందో..కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని కర్షకులు ఎదురుచూస్తున్నారు. **అప్పు చేయాల్సి వస్తోంది- సిద్ధేశ్వర, నాగోనపల్లి, అమరాపురం మండలం**

వక్క తోట 5 ఎకరాల్లో సాగు చేశాను. ఏడాదికి 20 క్వింటాళ్ల ఎండిన వక్క దిగుబడి వస్తోంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో 25 క్వింటాళు ఇంట్లోనే నిల్వ చేసుకున్నా. రెండేళ్లుగా పెట్టుబడి, ఇంటి ఖర్చుల కోసం రూ.8 లక్షలు అప్పు చేశాను. **మార్కెట్ అందుబాటులోకి రావాలి- ఉగ్రనరసింహ, వక్క సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, గౌడనకుంట**గత ఏడాది ఎండలు, తెగుళ్ల కారణంగా నాణ్యత తగ్గింది. వెయ్యి అడుగులు తవ్వించిన బోర్లలో ఫ్లోరైడ్ నీరు వస్తోంది. మరోవైపు వాటిని తోటకు పెట్టడం వల్ల దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం త్వరితగతిన మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

# అ ‘జెండా’ లేని శాఖ




విశాఖపట్నం : పర్యాటక పరంగా దేశంలో విశాఖకు ప్రత్యేక స్థానం ఉంది. బీచ్‌లకు సందర్శకుల సంఖ్య పెరగాలంటే సౌకర్యాల స్థితి పరిశీలించి ఇచ్చే ‘బ్లూఫ్లాగ్’ గుర్తింపు కీలకం. అది రాష్ట్రంలో రుషికొండ బీచ్‌కే ఉంది. అయితే.. ఆ ప్రతిష్ఠను నిలబెట్టుకోవాల్సిన తరుణంలో ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడి అసౌకర్యాల నేపథ్యంలో ‘బ్లూఫ్లాగ్’ గుర్తింపును నిర్వాహకులు తాత్కాలికంగా ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ శాఖలో ఎప్పుడు ఏం చేయాలనే శ్రద్ధ కరవైనట్లు చర్చ సాగుతోంది. పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం, ఉన్నతాధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడం, అధికారుల మధ్య సమన్వయలోపం స్పష్టమవుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా... ఇప్పుడు కళ్లుతెరిచి దిద్దుబాటు చర్యలకు దిగారు. రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ నిర్వహణపై ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఉన్నతాధికారులు సరైన సమయంలో స్పందించకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందనే విమర్శలున్నాయి. గత ఏడాది అక్టోబరుతో నిర్వహణ ఏజెన్సీ గడువు ముగిసింది. ఆ నివేదిక పంపినా తర్వాత ఏం చేయాలన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. పాత ఏజెన్సీ సక్రమంగా నిర్వహించకపోయినా కొత్తగా టెండర్లు పిలిచి అప్పగించలేదు. రాష్ట్రంలో బీచ్‌ల పర్యవేక్షణకు ప్రత్యేక కన్సల్టెన్సీ ఉన్నా రుషికొండ బీచ్‌పై దృష్టిసారించలేదు. పర్యవేక్షణ లోపాన్ని పట్టించుకోకుండా కేవలం జిల్లా అధికారులను మార్చుతూ మమ అనిపించారు. ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ గత డిసెంబరులో బీచ్‌ను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు చెప్పినా... నత్తనడకన చేయడంతో బ్లూఫ్లాగ్ గుర్తింపు పైనే ప్రభావం పడింది.

త్వరలో కమిటీ రాక: బ్లూఫ్లాగ్ గుర్తింపు తాత్కాలిక ఉపసంహరణ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై పనులు ఆరంభించినా కొన్ని నెమ్మదిగా సాగుతున్నాయి. ఈ నెల 15కు వాటన్నింటినీ పూర్తిచేయాలన్నది లక్ష్యం. ఇప్పటికే బీచ్‌లో చేపట్టే పనులపై ఓ నివేదికను కలెక్టరు హరేంధిరప్రసాద్ బ్లూఫ్లాగ్ బృందానికి పంపించారు. వీటిపై ఆ కమిటీ కొంత సంతృప్తి వ్యక్తం చేసింది. త్వరలో ఆ కమిటీ బీచ్‌ను తనిఖీ చేయనుంది.

**ఇన్‌ఛార్జ్‌ల పాలనే:** శాఖలో సమస్యలకు ప్రధాన కారణాలను విశ్లేషించకుండా ఒకరిద్దరు అధికారులను మార్చి ఉన్నతాధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. ఇటీవల జిల్లా పర్యాటకశాఖాధికారిగా ఉన్న జ్ఞానవేణిని తప్పించి అదే శాఖలోని దాసుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఉన్నతాధికారులు హడావుడిగా కాంట్రాక్టు ఉద్యోగికి బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు రావడంతో అతన్నీ తప్పించారు. ప్రస్తుతం జిల్లా పర్యాటకాధికారిగా హెచ్‌పీసీఎల్ ప్రత్యేక ఉపకలెక్టరు సుధాసాగర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. గత ప్రభుత్వం నుంచి ఈ పోస్టు ఇన్‌ఛార్జులతోనే సాగుతుంది. పర్యాటకశాఖ ఆర్‌డీ పోస్టును కూడా ఇన్‌ఛార్జితోనే నడిపిస్తుండటం గమనార్హం.

# అనుమతా.. అదొక్కటీ అడగొద్దు!



అనకాపల్లి : క్వారీలు నడపాలంటే ముందు మైనింగ్ ప్లాన్ ఉండాలి. పర్యావరణ అనుమతులు (ఈసీ) తెచ్చుకోవాలి. ఎంత విస్తీర్ణంలో తవ్వేది ముందస్తు సమాచారం ఇవ్వాలి. రవాణాకు పర్మిట్లు తీసుకోవాలి. ఇవేవీ లేకుండానే అక్రమార్కులు కొండలను కరిగించేస్తున్నారు. సర్కారు ఖజానాకు కన్నం పెడుతున్నారు. అనకాపల్లి జిల్లా గనులశాఖ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా యంత్రాలు పెట్టి కొండలను తొలిచేసి మెటల్ మాయం చేస్తున్నారు. అధికారులకు తెలిసినా నేతల ఒత్తిళ్లు, నెలవారీ మామూళ్లకు తలొగ్గి అటుగా కన్నెత్తి కూడా చూడడం లేదు. పైగా తమశాఖ విజిలెన్స్ బృందం వచ్చి పట్టుకున్నా స్థానిక అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం.అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో సుమారు 236 క్వారీలకు పర్యావరణ అనుమతులే లేవు. వేటజంగాలపాలెం సర్వే నంబర్ 84లో ఒకే కొండ చుట్టూ 20 పైగా రాయి క్వారీలున్నాయి. వాటిలో ఒక్కదానికి కూడా అనుమతుల్లేకపోయినా దర్జాగా పేలుళ్లు జరుపుతున్నారు. రాళ్లను భారీ లారీలు, టిప్పర్లలో లోడ్ చేసి అధికారుల కళ్లెదుటే తరలించుకుపోతున్నారు. విజయనగరం కేంద్రంగా పనిచేస్తున్న గనుల శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేసి పట్టుకుంటున్నారు తప్పా జిల్లాలో అధికారులు మాత్రం క్వారీలు తనిఖీలు చేసింది లేదు.. అక్రమ మైనింగ్ అడ్డుకున్నదీ లేదు.. ఎవరైనా అడిగితే మాకు తగినంత సిబ్బంది లేరు. ఫిర్యాదులపై విచారణలతో సరిపోతుందని సర్దిచెప్పుకొంటున్నారు. కుంచంగి సర్వే నంబర్ 316లోని క్వారీల్లో కూడా అనుమతుల్లేకుండానే కొండలను కరిగించేస్తున్నారు. అల్లూరి జిల్లాలో అనంతగిరి, అడ్డతీగల, జి.మాడుగుల లోనూ అక్రమ మైనింగ్ జోరుగా సాగుతోంది.

గనులశాఖ తవ్వకాలకు, రవాణాకు జారీచేసే పర్మిట్లతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఖనిజాన్ని బట్టి క్యూబిక్ మీటర్‌కు రూ.100 నుంచి రూ.207 వరకు రాయల్టీ రూపంలో చెల్లించాలి. అక్రమ మైనింగ్ చేయడం వల్ల ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరడం లేదు. అక్రమార్కుల జేబుల్లోకి పోతోంది.

**అక్రమ మైనింగ్ చేస్తే కేసులే..**

అనుమతుల్లేకుండా ఎవరు మైనింగ్ చేసినా కేసులు పెట్టి భారీగా జరిమానాలు విధిస్తాం. ఇటీవల సబ్బవరంలో ఓ గ్రావెల్ లారీని పట్టుకుని రూ.లక్ష అపరాధ రుసుం కట్టించాం. వేటజంగాలపాలెంలో క్వారీల్లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారనే సమాచారంతో దాడిచేసి యంత్రం సీజ్‌చేశాం. నిర్వాకులపై కేసులు పెడతాం. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిని విడిచిపెట్టం. –అశోక్‌కుమార్, గనుల శాఖ విజిలెన్స్ సహాయ సంచాలకులు

# ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం

తాడిపత్రి : అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కొంతమంది రాజకీయ నాయకుల తోడ్పాటు అందించడంతో మున్సిపాలిటీల పరిధిలో ప్రజల ఉపయోగార్థం కేటాయించిన రిజర్వుడు స్థలాల్లో కొన్ని అన్యాక్రాంతమయ్యాయి. ఈ స్థలాల్లో కొందరు ఇళ్లను నిర్మించుకుని నివాసముంటుండగా మరికొందరు ఇతరులకు అద్దెకిచ్చి బాడుగలు తీసుకుంటున్నారు. గుంతకల్లులో డీఎస్పీ కార్యాలయం, రెండో పట్టణ పోలీసుస్టేషన్ తదితర ప్రభుత్వ భవనాలు కూడా రిజర్వుడు స్థలాల్లో నిర్మించడం గమనార్హం. ప్రారంభంలోనే స్థలాల రక్షణకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గుంతకల్లు పట్టణంలో 11 కాలనీల్లో దాదాపు రూ.79 కోట్ల విలువచేసే రిజర్వుడు స్థలాల్లో 53,240 చదరపు గజాల స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. మున్సిపాలిటీలో మొత్తం 111 రిజర్వుడు స్థలాలుండగా 11 అన్యాక్రాంతమయ్యాయి. అధికారులు ఇందులో 71 స్థలాలకు కంచె, గోడలు ఏర్పాటు చేశారు. అన్యాక్రాంతమైన స్థలాలతో పాటు మిగిలిన 29 స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలో ఇళ్లను నిర్మించుకున్న వారు కొందరు రిజర్వుడు స్థలాల్లో కొంత స్థలాన్ని ఆక్రమించి అనుభవిస్తున్నారు. రిజర్వుడు స్థలాల్లో ఇళ్లను నిర్మించుకున్నవారిలో 90 శాతం మందికి వేరేచోట స్థలాలు కేటాయించారు. కానీ, వారు ఇళ్లు నిర్మించుకోకుండా రిజర్వుడు స్థలాల్లోనే నివాసముంటున్నారు. వారిని ఖాళీ చేయించడానికి రాజకీయ నాయకులు సుముఖత వ్యక్తం చేయడం లేదు.

తాడిపత్రి మున్సిపాలిటీలో దాదాపు 90 రిజర్వుడు స్థలాలుండగా ఇందులో 20 దాకా ఆక్రమణలకు గురయ్యాయి. స్థలాల్లో కొందరు పక్కా భవనాలు నిర్మించుకుని అనుభవిస్తున్నారు. స్థలాల పరిరక్షణకు



అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. గుత్తి మున్సిపాలిటీలో ఏడు రిజర్వుడు స్థలాలుంటే ఇందులో మూడు ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణలను తొలగించే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆక్రమణల కారణంగా ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే భవనాలు, పార్కులను ఏర్పాటు చేయలేకపోతోంది.

**రూ. 1.97 కోట్లతో రక్షణ చర్యలు**

– శ్రీనివాసులు, సహాయ సిటీ ప్లానర్

గుంతకల్లు మున్సిపాలిటీలోని రిజర్వుడు స్థలాలను కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగం 28 స్థలాలకు రూ.1.97 కోట్లతో ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు టెండర్లు నిర్వహించి పనులు గుత్తేదారులకు అప్పగించాం. రిజర్వుడు స్థలాల్లో నివాసముంటున్నవారికి స్థలాలు కేటాయించినందున అక్కడి ఇళ్లను తొలగిస్తాం.

# రీసర్వే రగడ

విశాఖపట్నం : ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవెన్యూ పరిధి చందక గ్రామంలో తొమ్మిదెకరాల స్థలానికి గతంలో నలుగురు వ్యక్తుల పేర్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాస్తవానికి ఆ స్థలం మీద అనుభవదారులుగా ఎనిమిది మంది రైతులున్నారు. దీంతో రీసర్వే వివాదానికి దారి తీసింది. గొట్టిపల్లిలో ఓ కుటుంబానికి చెందిన నాలుగెకరాల స్థలంలో హద్దుల సమస్య తలెత్తింది. అది తేలాకే రీసర్వేకు ముందుకెళ్లాలని తేల్చిచెప్పడంతో ఆపేశారు.

భీమిలి మండలం దాకమర్రిలో కుటుంబ సభ్యుల మధ్య పంపకాల్లో స్పష్టత లేక సర్వే చేయడం కుదరలేదు. ఆ కుటుంబానికి చెందినవారంతా ఒక మాటమీదకొచ్చాక చేస్తామని అధికారులు వెనుదిరిగారు. ప్రస్తుతం రీసర్వే జరుగుతున్న దాకమర్రి, గొట్టిపల్లి, గంధవరం గ్రామాల్లో చిత్రవిచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎక్కడ రీసర్వే చేపడుతున్నారో ముందుగానే సంబంధిత రైతులకు సమాచారం అందిస్తున్నా క్షేత్రస్థాయిలోకి వెళ్లేసరికి అధికారులకు భిన్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వంలో అంతా ఇష్టానుసారంగా సాగింది. చాలా చోట్ల రికార్డుల్లోని కొలతలను తగ్గించేసి వైకాపా అనుకూల వ్యక్తుల పేరున రాయించేశారు. ఇప్పుడు కొంత ఆలస్యమవుతున్నా వివాదరహితంగా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్కడక్కడ ఇబ్బందులు తప్పడం లేదు. **ఇదీ పరిస్థితి:** అన్నదమ్ముల మధ్య వాటాల విషయంలో వివాదాలు తలెత్తుతున్నాయి. గతంలో ఒకరి పేరునే పాసుపుస్తకాలు ఉండేవి. ఇప్పుడు వాటి పంపకాల్లో విభేదాలు వస్తున్నాయి.

భూమి అనుభవదారులను, రికార్డుల్లో ఉన్న వారిని అధికారులు పిలుస్తున్నారు. ఈ సమయంలో కొత్త వివాదాలొస్తున్నాయి. ఎవరికివారు పత్రాలు చూపిస్తుండటంతో ఎవరిదని తేల్చే విషయంలో జాప్యం జరుగుతోంది.

ఇక్కడ కమతాలు చిన్నవి. రైతులకు వేరువేరుగా స్థలాలున్న ప్రతి దగ్గర వాటికి వేరువేరుగా చల్తా నంబరు కేటాయిస్తున్నారు. గతంలో అంతటికీ కలిపి ఒకటే ఇచ్చేవారు. దీంతో ఈ నంబర్ల కేటాయింపునకు శ్రమించాల్సి వస్తోంది. వివాదాస్పద భూముల్లో రీసర్వే చేస్తున్నప్పుడు సరిహద్దులు గుర్తించి వదిలేస్తున్నారు. రైతుల మధ్య సఖ్యత లేక సర్వే చేయడం లేదు.

కొన్ని చోట్ల సర్వేను సచివాలయ, ఇతర కింది స్థాయి సిబ్బందిపై వదిలేస్తున్నారు. వివాదం రేగినప్పుడు కనీసం పరిష్కరించడానికైనా కొన్ని చోట్ల జోక్యం చేసుకోవడంలేదు. తరచూ కలెక్టర్, జేసీ పర్యవేక్షిస్తున్నా వారొచ్చినప్పుడు కనిపించి మిగిలిన సమయాల్లో శ్రద్ధ పెట్టడం లేదు.

తేల్చుకోమన్నారు: ‘మా కుటుంబానికి చెందిన భూమి పంపకాల విషయంలో విభేదాలు ఉండడంతో రీసర్వే మొదలుపెట్టలేదు. అంతా ఏకాభిప్రాయానికి వచ్చాక చేస్తామని అధికారులన్నారు. అందర్నీ కూర్చోపెట్టి సందేహాలు నివృత్తి చేసి హద్దులు నిర్ణయిస్తే అభ్యంతరం లేదు. తర్వాత చిక్కులు రాకుండా చేస్తే చాలు’ అని ఓ రైతు పేర్కొన్నారు.

**ఆలస్యమైనా:** ‘కాస్త ఆలస్యమైనా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రీసర్వే చేయిస్తున్నాం. ఎక్కడా రైతుల మధ్య విభేదాలు, గొడవలు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముందుకు వెళుతున్నాం. పంపకాల విషయంలో రైతులను ముందుగా తేల్చుకొని రమ్మంటున్నాం. అన్ని పూర్తయ్యాక తుది నివేదికను గ్రామాల్లో ప్రదర్శిస్తాం. అప్పటికీ అభ్యంతరాలుంటే తెలపొచ్చు’ అని జేసీ మయూర్ అశోక్ పేర్కొన్నారు.

## కమీషన్ కొట్టు.. సరకు పట్టు

పలమనేరు : తెదేపా హయాంలో టమాట రైతుల కోసం విడుదల చేసిన ఓ జీవోకు వైకాపా ప్రభుత్వం గ్రహణం పట్టించింది. దీంతో అన్నదాతలకు భారమైనా పది శాతం కమీషన్ చెల్లిస్తూ అవస్థలు పడుతున్నారు. అప్పట్లో తెదేపా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పళ్లు, కూరగాయలకు సెస్ వసూలు చేసే విధానాన్ని రద్దు చేసింది. కమిటీకి అంతవరకు రైతు చెల్లిస్తూ వచ్చిన ఒక శాతం సెస్ మిగిలిపోయింది. అయితే ఏజెంట్ల వ్యవస్థను మాత్రం అధికారులు అదుపు చేయలేకపోయారు. రైతుల పంటను మధ్యవర్తిత్వంతో విక్రయించినందుకు పది శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వం ఆ పది శాతం కమీషన్‌ను నాలుగు శాతానికి తగ్గించింది. కొంత కాలానికి దాన్నీ వసూలు చేయరాదని జీవో విడుదల చేసింది. వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులు దీన్ని గాలికొదిలేసి అనధికారికంగా పది శాతం వసూలు చేశారు. ఈ విషయమై పలుమార్లు రైతులు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ధరలు పడిపోయినా కమీషన్ ఇవ్వాల్సి రావడంతో



టమాటా పంట రోడ్లపై పారేస్తున్నామంటూ రైతులు వాపోతున్నారు. ఒకోసారి వచ్చిన ఆదాయం కమీషన్‌కే సరిపోగా అన్నదాతలు తమ గ్రామాలకు వెళ్లడానికి ఛార్జీలకూ డబ్బుల్లేని పరిస్థితిని ఎదుర్కొన్నారు.

**యూజర్ ఛార్జీల వసూలు**

ప్రభుత్వం కూరగాయలు, పళ్లకు సెస్‌ను రద్దు చేసింది. దీంతో ఒక్క పలమనేరు వ్యవసాయ మార్కెట్ ఏటా రూ.కోటి వరకు ఆదాయం కోల్పోతోంది. ప్రత్యామ్నాయంగా యూజర్ ఛార్జీ పేరిట వర్తకుల నుంచి ఒక శాతం వసూలు చేసుకోవాలని సూచించింది. కానీ పది శాతం వసూలు చేసుకోవడంలో వర్తకులు మార్కెట్ కమిటీ వెలుపల వ్యాపారం చేసుకుంటామని అల్టిమేటం జారీ చేస్తుంటారు. దీంతో అధికారులు మిన్నకుండిపోతున్నారు.

**ఉన్నతాధికారుల పరిశీలనలో..**


రైతుల నుంచి పది శాతం కమీషన్ వసూలు విషయంలో ఆలోచిస్తున్నాం. ప్రభుత్వ జీవో అమలుకు ప్రయత్నిస్తున్నాం. నూతన అంతర్జాతీయ మార్కెట్ వచ్చాక మార్పు వస్తుంది. ఈ సమస్య అన్ని చోట్ల ఉండటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. సంజీవకుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

## రోగ నిర్ధారణ భారం..

విశాఖపట్నం : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంఆర్ఐ తరహా వైద్య పరీక్షలు తలకు మించిన భారంగా మారాయి. విశాఖలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లో మాత్రం ఒకటే ఎంఆర్ఐ యంత్రముంది. ఈ నేపథ్యంలో ఉచితంగా అత్యాధునిక రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు 'సిటీ డయాగ్నస్టిక్ సెంటర్', ఔషధాలు నిల్వ చేసేందుకు వీలుగా విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ప్రాంగణంలో భవనాలు నిర్మించారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) నిధులు దాదాపు రూ.22 కోట్లతో పనులు చేపట్టారు. నిర్మాణాలు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించలేదు. దీంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులపైనే ఆధారపడుతున్నారు.

**ఔషధాలు నిల్వ చేయడానికి..:** విశాఖలో ఔషధ నిల్వల కేంద్రాన్ని పెదవాల్తేరులోని తాత్కాలిక భవనంలో నిర్వహిస్తున్నారు. నగరంలోని ఆసుపత్రులతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు అవసరమైన ఔషధాలను నిల్వ చేసేందుకు ప్రాంతీయ ఔషధ నిల్వల కేంద్రం నిర్మించారు. దీన్ని ప్రారంభిస్తే ఇంజక్షన్లు, టీకాలు, ఖరీదైన ఔషధాలు, శస్త్రచికిత్స పరికరాలను నిల్వ చేసి అవసరాలను బట్టి జిల్లాలకు పంపించొచ్చు. భవనంలో చిన్నపాటి పనులున్నాయని, వాటిని వేగంగా పూర్తిచేస్తామని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు తెలిపారు. తాత్కాలిక భవనంలో నిల్వలు కొనసాగిస్తూనే.. కొత్త భవనంలోకి కొన్ని ఔషధాలు తరలిస్తామన్నారు.

**వారందరికీ కేజీహెచ్‌లోనే..:** సిటీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో అత్యాధునిక రేడియాలజీ, పాథాలజీ, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలన్నీ ఒకే చోట




నిర్వహించేందుకు వీలుంది. బోధనాసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులోని పరీక్షలనూ ఇక్కడ చేయొచ్చు. నగరంలోని నేత్ర, ఈఎన్‌టీ, మానసిక, చెస్ట్, ఆర్సీడీ ఆసుపత్రుల్లో సీటీ, ఎంఆర్ఐ యంత్రాలు లేవు. అక్కడి రోగులకు స్కానింగ్ అవసరమైతే కేజీహెచ్‌కు పంపిస్తున్నారు. కేజీహెచ్‌లో రోగ నిర్ధారణ పరీక్షలకు ఒక్కోసారి నమూనాలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో డయాగ్నస్టిక్ సెంటర్ వీలైనంత త్వరగా అందుబాటులోకి వస్తే నగర ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. దీనిపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎంపీ శ్రీభరత్ ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు.

**అధికారులు ఏమంటున్నారంటే..**

రాష్ట్రంలో విశాఖతోపాటు విజయవాడ, తిరుపతిలో ఒకే తరహాలో డయాగ్నస్టిక్ సెంటర్లు నిర్మించారు. విజయవాడలో ప్రయోగాత్మకంగా 'హబ్ అండ్ స్పోక్' నమూనాలో 20 యూపీహెచ్‌సీలకు అనుసంధానం చేసి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇది ఇటీవల ప్రారంభించామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. నెల రోజులు పూర్తయితే తిరుపతి, విశాఖ కేంద్రాల్లో అవసరమయ్యే యంత్రాలు, చేయాల్సిన మార్పులపై అంచనా వస్తుందంటున్నారు. త్వరలో భవనాలను అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.

# కియోస్క్‌లు కుయ్యో!



అనకాపల్లి : వైకాపా ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చుచేసి ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కియోస్క్‌లు రైతులకు సేవలు అందించకుండా మూలకు చేరాయి. రైతులకు నాణ్యమైన సేవలందిస్తామని చెప్పి రైతు భరోసా (ప్రస్తుతం రైతు సేవా) కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. సాగుదారులు రాయితీలపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు వీలుగా వైకాపా ప్రభుత్వం వచ్చిన కొత్తలోనే వీటిని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కొద్ది మంది రైతులు ఎరువులు, పురుగు మందులు యంత్రం ద్వారా కొనుగోలు చేశారు. ఈ యంత్రం పనిచేయాలంటే అంతర్జాల సౌకర్యం ఉండాలి. కానీ వైకాపా ప్రభుత్వం యంత్రాలిచ్చింది తప్ప అంతర్జాల సౌకర్యం కల్పించలేదు. దీంతో సిబ్బందే సొంత డబ్బుతో ఈ సదుపాయం ఏర్పాటు చేసుకుని కొద్ది రోజులు సేవలు అందించారు. తర్వాత ఫోన్‌లోనే ఇందుకు సంబంధించిన యాప్ ఉండటంతో యంత్రాల జోలికి ఎవరూ పోలేదు. ఫలితంగా రైతు సేవా కేంద్రాల్లోని యంత్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో అయితే గోదాముల్లో పడేశారు. ముందువెనుకా ఆలోచించకుండా వైకాపా పాలకులు లక్షలాది ప్రజాధనంతో వీటిని కొనుగోలు చేశారు.

**రైతు నేరుగా నమోదు చేసుకునేలా...** వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే కేంద్రాలకు వచ్చి స్వయంగా వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్రాలు, పశుగ్రాసం వంటివి అవసరమైన పరిమాణంలో కియోస్క్‌ల ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఇందుకు అవసరమైన డబ్బు రైతు చెల్లిస్తే 48 గంటల్లో అందిస్తామని ప్రకటించారు. మార్కెట్లో పంటల ధరలు, వాతావరణ మార్పుల వంటి విషయాలను రైతులు తెలుసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. కానీ వైకాపా ప్రభుత్వం అన్నదాతలకు ఈ యంత్రాల ప్రయోజనంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యతను విస్మరించింది.

**రూ.70.40 లక్షలు వృథా:** అనకాపల్లి డివిజన్ పరిధిలోని అయిదు మండలాల్లో 88 కియోస్క్‌లను 2020 జూన్‌లో ఏర్పాటు చేశారు. ఒక్కో యంత్రానికి రూ. 80 వేలు వెచ్చించి కొనుగోలు చేశారు. తొలి ఏడాది వరి విత్తనాలు, ఎరువులను రైతులు యంత్రాల ద్వారా నమోదు చేసుకున్నారు. 2022 నుంచి క్రమేపీ వీటి వినియోగం ఆగిపోయింది. డివిజన్ పరిధిలో వీటి కోసం రూ. 70.40 లక్షలు ఖర్చు చేశారు. ఈ డబ్బు అంతా వృథా అయింది.

# తీరంలో ఇష్టారాజ్యం



విశాఖపట్నం : విశాఖ తీరం వైకాపా నేతల గుప్పిట్లో విలవిల్లాడుతోంది. బార్ అండ్ రెస్టారెంట్లు, రిసార్ట్స్, హోటళ్ల పేరుతో తీరం వెంబడి తిష్టవేసి విధ్వంసాలు సృష్టిస్తున్నారు. తీర ప్రాంత నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) నిబంధనలు ఉల్లంఘించి దర్జాగా కాంక్రీట్ నిర్మాణాలు చేస్తున్నారు. తెన్నేటి పార్కు నుంచి భీమిలి వరకు తీరంలో అనుమతుల్లేని నిర్మాణాలు పుట్టగొడుగుల్లా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా సముద్ర తీర ప్రాంతం దెబ్బతిని, మత్స్యకారుల జీవనోపాధికి నష్టం వాటిల్లుతోంది. తాజాగా హైకోర్టు దీనిపై అక్షింతలు వేసి తీర ప్రాంతం సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని ఆదేశిస్తూ ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ అథారిటీ, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లతో ఓ కమిటీని నియమించింది. **నిబంధన ఇదీ:** సముద్ర తీర ప్రాంతం ఆనుకుని భారీ భవన నిర్మాణాలకు, పరిశ్రమలకు, వాణిజ్య వ్యాపారాలకు ఎలాంటి అనుమతులివ్వకూడదు. విశాఖలోని బీచ్ రోడ్డు తూర్పు దిశలో ఇసుక ఉన్న ప్రాంతం, పశ్చిమ దిశలో జాతీయ సముద్ర పరిశోధన సంస్థ (ఎన్ఐవో) గుర్తించిన ఆటుపోట్లు (హెచ్‌టీఎల్) నుంచి 500 మీటర్ల వరకు, అలాగే సముద్రంలో కలిసే వాగులకు రెండువైపులా 100 మీటర్ల దూరంలో ఉన్న ప్రదేశాలు సీఆర్‌జెడ్-3 కిందకు వస్తాయి. ఆర్కే బీచ్ నుంచి రుషికొండ వరకు మురుగు నీరు ఎక్కడైతే శుద్ధి చేసి సముద్రంలోకి వదులుతారో అక్కడ సీఆర్‌జెడ్-2 పరిధిలోకి వస్తుంది. సీఆర్‌జెడ్ 1,2,3 పరిధిలో ఎక్కడా బోర్లు వేసి భూగర్భ జలాలు తోడకూడదు.

**విధ్వంసాలకు మచ్చుక:** భీమిలి ఎస్‌వోఎస్ కూడలి వద్ద శ్మశానవాటికకు చెందిన కొంత స్థలాన్ని ఆక్రమించి ఓ రెస్టో బార్ ఏర్పాటు చేశారు. దీనిపై స్థానిక మత్స్యకారులు ఇటీవల రెండు వారాల పాటు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఇదే స్థలంలో గతంలో నిర్వహించిన ఓ రెస్టారెంట్‌ను జీవీఎంసీ అధికారులు కూల్చేశారు. మళ్లీ అదేచోట కొద్ది నెలలకే ఎలాంటి అనుతులు లేకుండానే ఓ వైకాపా నేత అండతో నిర్మాణం చేపట్టడం గమనార్హం. తొట్లకొండకి ఎదురుగా ఏపీటీడీసీ అభివృద్ధి చేసిన రిసార్టును వైకాపా ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీను, విశాఖ వైకాపా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, జీవీఎంసీ మాజీ కో-ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు భాగస్వాములుగా నిర్వహిస్తున్నారు. దీనిలో రెస్టారెంటు, గేమ్ జోన్ వంటి వ్యాపార విస్తరణకు సీఆర్‌జెడ్ నిబంధనలను తుంగలోకి తొక్కారు. స్విమ్మింగ్ పూల్‌తోపాటు, పలు శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. అంతేనా ఇటీవల తీరంలో ఏకంగా టెంట్లు వేసి మందు పార్టీల నిర్వహణకు అద్దెకివ్వడం గమనార్హం.

**ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు:** తీరంలో శాశ్వత నిర్మాణాలకు అంచెలంచెలుగా పావులు కదుపుతున్నారు. తొలుత ఎర్రమట్టి, భవన వ్యర్థాలు తెచ్చి కుప్పలుగా పోస్తున్నారు. రాత్రిళ్లు ఇసుక తిన్నెలను పూడ్చి చదును చేస్తున్నారు. ఆ తర్వాత అధికారులతో ఒప్పందాలు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. బీచ్ రోడ్డులో పరిశీలిస్తే... వుడా పార్కు సమీపంలో రెండు హోటళ్లు, సాగర్ నగర్ ఆర్చీ ఎదురుగా వ్యాపార కేంద్రాలు, రుషికొండలో ఓ రిసార్ట్, ఐదు నక్షత్రాల హోటల్, ఎర్రమట్టి దిబ్బల సమీపంలో కంటైనర్ క్యాంటీన్, పదుల సంఖ్యలో హ్యాచరీలు.. ఇలా నిబంధనలు ఉల్లంఘించినవే. వైకాపా హయాంలో విజయసాయిరెడ్డి సీఆర్‌జెడ్ నిబంధనల పేరుతో ప్రతిపక్ష పార్టీల హోటళ్లు, వ్యాపార కేంద్రాలు, బార్ అండ్ రెస్టారెంట్లను తొలగించి హడావుడి చేశారు. వేధింపులతో పార్టీ మారేలా చేసి మళ్లీ యథేచ్ఛగా నిర్మాణాలకు కొమ్ముకాశారు. ఆ పాపమే ఇప్పటికీ తీరాన్ని వెంటాడుతోంది. నిబంధనల పేరుతో అప్పట్లో హడావుడి చేసిన విజయసాయిరెడ్డి కుమార్తె ఇటీవల భీమిలి వద్ద తీరంలో సీఆర్‌జెడ్ ఉల్లంఘించి కాంక్రీటు నిర్మాణాలు చేపట్టడంపై కోర్టు ఆదేశాలతో జీవీఎంసీ అధికారులు కట్టడాలు కూల్చడం విదితమే. తాజా కమిటీ సర్వే చేసి సీఆర్‌జెడ్ పరిధి నిర్ణయించడంతోపాటు, అక్రమంగా ఉన్న కట్టడాలను తొలగించాలని విశాఖవాసులు కోరుతున్నారు.

# అడ్డుకోవాల్సిన వారిదే అడ్డగోలు దందా!

అనకాపల్లి : గనులశాఖలో అధికారుల తీరు వివాదాస్పదం అవుతోంది. మైనింగ్ అక్రమాలను అడ్డుకోవాల్సినవారే అడ్డదారుల్లో లీజులు కట్టబెట్టేలా చక్రం తిప్పుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ అనుమతులకు సిఫార్సు చేస్తున్నారు. ఉన్నతాధికారులు, నేతల ఒత్తిళ్లు, ముడుపులకు తలొగ్గి అడ్డగోలు వ్యవహారాలకు తెరలేపుతున్నారు. ఇటీవల అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల మైనింగ్ అధికారులు సమస్యాత్మక ప్రాంతాల్లో లీజుల కోసం ప్రయత్నింస్తుండటం స్థానికంగా చర్చనీయాంశం అవుతోంది. మరోవైపు మైనింగ్ అక్రమార్కులను గుర్తించినా అపరాధ రుసుములు విధించకుండా తాత్సారం చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కరక, సాలిక మల్లవరం రంగురాళ్ల క్వారీ మూతపడి 20 ఏళ్లు దాటింది. ఆ ప్రాంతంలో ఎవరూ ప్రవేశించకుండా అటవీశాఖ బేస్ క్యాంపు నిర్వహిస్తోంది. అక్కడ మైనింగ్ అనుమతులు ఇవ్వాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాకనే అధికారులు ముందుకు వెళ్లాలి. అటవీ, రెవెన్యూ, గనులశాఖ కలిపి సంయుక్త సర్వే జరపాలి. ఆ తర్వాతే మిగతా ప్రక్రియ చేపట్టాలి. కాని గనులశాఖలో ఉన్నతాధికారి ఎవరో చెప్పారని ప్రైవేటు వ్యక్తులను వెంటపెట్టుకుని ఆ శాఖ ఆర్.ఐ. ఒకరు కరక కొండపైకి వెళ్లి జియో కోఆర్డినేట్లు తీసుకున్నారు. ఇది నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. దీనిపై రెండు శాఖల మధ్య వివాదం నడుస్తోంది. అనకాపల్లికి సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని రెండు భారీ లేఅవుట్లు ఉన్నాయి. లోతుట్టుగా ఉన్న తమ లేఅవుట్లను గ్రావెల్, రఫ్ మెటల్‌తో నింపి చదును చేసుకున్నారు. వాటిని తవ్వి తరలించడానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. సాధారణ ఎన్నికలకు ముందే గనులశాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో ఈ విషయాన్ని గుర్తించారు. వారిపై రూ.కోట్లలో అపరాధ రుసుము విధించాలని అప్పటి గనులశాఖ అధికారులకు సిఫార్సు



చేశారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు మారిపోవడంతో విజిలెన్స్ సిఫార్సులు బుట్టదాఖలు చేశారు.

వీటి విషయమై నర్సీపట్నం డివిజనల్ గనులశాఖ అధికారి శివాజి వద్ద ప్రస్తావించగా రంగురాళ్ల క్వారీ కోసం 14 దరఖాస్తులు వచ్చాయి. అందుకే పరిశీలనకు వెళ్లారు. అందులో తప్పేమీ లేదని సమర్థించుకున్నారు. రాంబిల్లి మండల పరిధిలో ఒక హెక్టారు విస్తీర్ణంలో గ్రావెల్ లీజుకు అనుకూలంగా అనకాపల్లి జిల్లా అధికారులు దస్త్రాలు సిద్ధం చేశారు. వీరు లీజు ఇవ్వాలనుకున్న భూమి రక్షిత అటవీ భూములకు కేవలం 20 మీటర్ల దూరంలో ఉంది. వాస్తవానికి అటవీ భూములకు 500 మీటర్ల లోపల మైనింగ్ అనుమతులు ఇవ్వడానికి వీల్లేదు. ఒకవేళ ఇవ్వాలంటే సంబంధిత శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందాలి. పైగా అక్కడ అటవీ భూములుగా చెబుతున్న వాటిని రక్షణ శాఖకు ఇదివరకే అప్పగించారు. అలాంటి చోట్ల మైనింగ్ చేయకూడదని తెలిసినా అధికారులు ముందుకువెళ్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

## బృహత్తర ప్రణాళికకు ఏకైక అడ్డంకి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయం బృహత్తర ప్రణాళిక అమలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల. రానున్న వందేళ్లలో ఆలయానికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా పనులు చేపట్టాలని ఏడేళ్ల కిందటే ప్రణాళిక రూపొందించారు. భూసేకరణలో ఏకైక అడ్డంకిగా ఉన్న సమస్యా మంత్రుల చొరవతో తొలగనుంది. ముక్కంటి ఆలయానికి వారాంతంలో వచ్చే భక్తుల రద్దీతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. తిరుమల తరహాలో క్యూ సముదాయాలు, విశాలమైన భవనాలు, అందమైన రోడ్లు, ఆహ్లాదాన్ని పంచే ఉద్యానాలతో అద్భుతంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి విడతలో భూసేకరణ వేగంగా జరిగినా తర్వాత జఠిలంగా మారింది. ప్రధానంగా వాణిజ్య సముదాయ భవనాల తొలగింపునకు అడ్డు ఏర్పడింది. ప్రణాళికలో మార్పుచేసి కొత్తది రూపొందించాలని, వైకాపా హయాంలో నేతలు నిధులు వృథా చేశారే తప్ప.. చేకూరిన ప్రయోజనం శూన్యం.

**అధికారులకు దిశానిర్దేశం**

సన్నిధివీధిలో రోడ్డు విస్తరణకు ఒక్క భవనం అడ్డుగా మారింది. దీనికి



ముందు, వెనుక రోడ్డు విస్తరించారు. ఈ భవనాన్ని అప్పగించేందుకు అందరి కంటే ముందుగా అంగీకరించిన ఈ భవన యజమాని పరిహారం విష యమై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన సమీక్షలో జిల్లా మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డిలు నిర్వాసితులను సంప్రదించి పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**నిధులకు కొదవ లేదు..**

భూసేకరణ పూర్తయితే నిధులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం. మంత్రుల ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు వేగవంతం చేశాం. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాం టి ఇబ్బందులు రాకుండా పనులు పూర్తి చేస్తున్నాం. టి.బాపిరెడ్డి, ఈవో, శ్రీకాళహస్తీశ్వరాలయం

భూసేకరణ విస్తీర్ణం: 3.9 ఎకరాలు
బృహత్తర ప్రణాళిక ప్రారంభం: 2018
ప్రతిపాదిత వ్యయం: రూ.99 కోట్లు
నిర్వాసితులు: 199 మంది
పరిహారం తీసుకుంది: 198

## మన్ను పెద్దల కన్ను

నంద్యాల : నల్లమల అటవీ ప్రాంతంలో చెరువులు, డీకేటీ భూములను మట్టిదొంగలు తోడేస్తున్నారు. విలువైన ఎర్రమట్టిని పట్టపగలే తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. గత 20 రోజులుగా మరింత రెచ్చిపోతున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండానే జిల్లా కేంద్రానికి తీసుకొస్తున్నారు. టిప్పర్ రూ.20 వేలు, ట్రాక్టర్ మట్టిని రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు. పట్టపగలే లెక్కలేనన్ని వాహనాలు బారులు తీరుతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. చెరువును చెరపట్టారు

రుద్రవరం మండలం కోటకొండ సమీపంలోని కృష్ణవేణి చెరువులో మట్టిని తోడేస్తున్నారు. టిప్పర్ల ద్వారా నంద్యాల సమీపంలోని ఇటుకబట్టీలకు తరలించేస్తున్నారు. చెరువులో పెద్ద ఎత్తున గుంతలేర్పడటంతో సమీప ప్రాంతంలోని బోరు బావులు ఒట్టిపోతున్నాయి. వాహనాలు తెలుగుగంగ ప్రధాన కాల్వ వెంట సామర్థ్యానికి మించి వెళ్తుండటంతో కట్టకు ప్రమాదం పొంచి ఉంది. కృష్ణవేణి చెరువులో మట్టిదందాకు నంద్యాల, ఆళ్లగడ్డకు చెందిన కొందరు పెద్దల అండ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 'వాటాలు' వేసుకుని పని కానిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఉబుకుతున్న 'ఊట'** గోపవరం, నందిపల్లె ప్రాంతాల్లోని డీకేటీ భూముల్లో 30 అడుగుల లోతులో తవ్వేస్తూ మట్టిని తీస్తుండటంతో పెద్ద ఎత్తున 'ఊట' ఊరుతోంది. దీంతో చిన్నపాటి చెరువుల్ని ఈ ప్రాంతం తలపిస్తోంది. తవ్వకాలకు ఊట అడ్డంకిగా మారడంతో ఉదయం ట్రాక్టర్లకు పైపులు వేసి పెద్దఎత్తున మోటార్లు పెట్టి నీటిని తోడేస్తున్నారు. పగలంతా నీటిని తోడి రాత్రివేళ పెద్ద ఎత్తున యంత్రాలతో మట్టిని తరలించేస్తున్నారు.

**పేదల భూముల్లో**

మహానంది మండలం గోపవరం చెరువు సమీపంలో, నందిపల్లెలోని మదార్‌వలి దర్గాకు సమీపంలోని డీకేటీ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారు. ప్రభుత్వం నిరుపేదలకు డీకేటీ పట్టాలిచ్చింది. మట్టిమాఫియా ఆయా భూములను కొనుగోలు చేసి మట్టిని తవ్వేస్తున్నారు. డీకేటీ భూముల్లో తవ్విని మట్టిన నంద్యాల-గిద్దలూరు రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆయా పనులకు కావాల్సిన మట్టిని అనుమతి ఇచ్చిన ప్రాంతం నుంచే తీసుకోవాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా డీకేటీ భూముల్లో రాత్రింబవళ్లు తోడేస్తున్నారు. **పంట ఎదుగుదలపై మట్టి- గద్దం నాగపాములేటి, గాజులపల్లె.** మూడెకరాల్లో అరటి సాగు చేస్తున్నా. ఇప్పటికి రూ.2 లక్షలు ఖర్చు చేశా. మట్టిని తరలించే టిప్పర్ల కారణంగా రేగుతున్న మట్టి మొక్కలపై పడి పంట ఎదుగుదల ఆగింది. ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించాలి.

## బయోమె'ట్రిక్'

నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని హంద్రీనీవా సుజల స్రవంతి కార్యాలయంలో బయోమెట్రిక్‌ను పక్కదారి పట్టించి సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. హాజరు పట్టికలో దొంగ సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది కొంత మంది ముందస్తుగా వీడియోను ఓ కిందిస్థాయి సిబ్బంది సెల్‌ఫోన్‌తో కార్యాలయం ఆవరణలో రికార్డింగ్ చేశారు. ఆ వీడియో ఆధారంగా బయోమెట్రిక్ వేసి విధులకు హాజరవుతున్నట్లు చూపిస్తున్నారు. ఇదంతా ఇద్దరు లస్కర్లు నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆధార్ నంబరుతో బయోమెట్రిక్ వేయాల్సి రావడంతో దీన్ని తప్పుదారి పట్టించడమే గాకుండా హాజరుపట్టీలో సంతకాలు ఫోర్జరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తగా బయోమెట్రిక్‌లో ఏఐకి సంబంధించిన యాప్ అందుబాటులోకి వచ్చినా ఈ కార్యాలయంలో నవీకరించలేదు. ఏఐతో వచ్చిన యంత్రంలో బయోమెట్రిక్ వేయాలంటే కచ్చితంగా వ్యక్తి అందుబాటులో ఉండాలి. రికార్డు చేసిన వీడియోలు చూపిస్తే రిజెక్టు చేస్తుంది.

ఈ కార్యాలయంలో 43 మంది పనిచేస్తున్నారు. సుమారు 30 మంది వరకు ఉద్యోగులు విధులకు డుమ్మా కొడుతున్నట్లు తెలిసింది. హాజరుపట్టీలో దొంగ సంతకాలు ఫోర్జరీ చేస్తున్నందుకు కార్యాలయంలో పనిచేసే ఓ వ్యక్తికి ఒక్కొక్కరు రూ.1500 చొప్పున 30 మంది రూ.45వేలు చెల్లిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో వారు సక్రమంగా విధులకు హాజరు కాకపోయినా అంతా ఆ వ్యక్తే చక్రం తిప్పుతున్నారు. ఆ వ్యక్తికి స్థానికంగా ఓ రాజకీయనాయకుడి అండదండలు ఉండటంతో అతని ఆటలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఎక్కువవుతున్నాయి.

## ప్రయాణికుల అభిప్రాయాల సేకరణకు క్యూఆర్ కోడ్

పుట్టపర్తి: ప్రయాణీకులు ప్రయాణ సమయంలో ఎదురయ్యే సమస్యలు, అసౌకర్యాలు తెలుసుకునేందుకు రోడ్డు రవాణా సరికొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. బస్సుల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు ఈనెల ఒకటో తేదీ నుంచి క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న వసతులు, అపరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, బస్సుల్లో వసతులు, సిబ్బంది పనితీరు ఇతరత్రా సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోపాలున్నా, ప్రయాణీకులు నేరుగా క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేస్తే... ప్రజారవాణా శాఖకు తెలియజేసే విధానాన్ని అమలు చేస్తోంది. పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఐదు చోట్ల ప్రయాణికులు కూర్చునే ప్రాంతాలు, ప్లాట్‌ఫారం, రిజర్వేషన్ కౌంటర్, తాగునీటి కేంద్రం, ఇలా ప్రతిచోటా క్యూఆర్ కోడ్ చిత్రాలు ప్రదర్శిస్తున్నారు. పుట్టపర్తి డీపో పరిధిలోని 44 బస్సుల్లో ప్రథమంగా క్యూఆర్ కోడ్ అమలు చేస్తున్నారు. అన్ని బస్టాండ్‌లో, బస్సుల్లో ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

**చరవాణి ద్వారా నమోదు చేయవచ్చు:**
చరవాణి ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఏపీఎస్ఆర్టీసీసర్వే.కామ్




అనే లింక్ తెరుచుకుంటుంది. అందులో "ఆర్టీసీ బస్సుస్టేషన్‌పై సర్వే" అనే అయిదు అంశాలుంటాయి. మీ పూర్తి అనుభవాన్ని తెలియజేవచ్చు. కూర్చొనే సదుపాయం, నిరీక్షణ కేంద్రాలు, నిర్వహణతో మీరు సంతృప్తి చెందారా.., తాగునీరు సౌకర్యం ఉందా, మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయా, బస్సులు సమయానికి అనుగుణంగా వస్తున్నాయా.. లేదా?, అని సమాధానం తెలియజేయాల్సి ఉంటుంది. ఆయా వివరాలు పూర్తి చేసి సబ్‌మిట్ చేయగానే, నేరుగా ఏపీ సర్వేసైట్‌కు చేరుతుంది. అక్కడి నుంచి జిల్లా అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ తెలిపారు.

## ఏకేయూకు మంచి రోజులు!

ఒంగోలు : జిల్లాలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయాన్ని వైకాపా పాలకులు అంపశయ్య పైకి నెట్టారు. పేరుకే విశ్వవిద్యాలయం.. పట్టుమని పది గదులూ ఉండవు. ఒంగోలు నగరం సమీపంలోని పేర్నమిట్ట కొండపై కేటాయించిన 110 ఎకరాల స్థలంలో పదేళ్ల క్రితం నిర్మించిన పరిపాలనా భవనమే నేటికీ దిక్కు. అందులోనూ అంతర్గత పనులు పూర్తిచేయక వినియోగంలో లేదు. నిధులు అవసరమని జిల్లా కలెక్టర్ ద్వారా గతంలో ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. మంత్రి మండలి ఆమోదంతో మంజూరు చేయిస్తామని అప్పటి విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ ప్రకటించి చేతులు దులుపుకొన్నారు. అయిదేళ్లలో పైసా నిధులు మంజూరు చేసింది లేదు. చివరికి అధికారులు డిగ్రీ కళాశాలల నుంచి వచ్చిన రుసుములతో కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది.

**రూ. 50 కోట్లకు వినతి:** కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల కలిశారు. రాష్ట్రంలో మరికొన్ని విశ్వవిద్యాలయాలతో పాటు ఏకేయూకు రూ.50 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఏకేయూకు మంచి రోజులు రానున్నాయని సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నిధులివ్వాలని మంత్రి లోకేశ్ కోరడం శుభపరిణామని ఉప కులపతి డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు హర్షం వ్యక్తం చేశారు.

**కూటమి ప్రభుత్వంలో కదలిక**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలనా భవనానికి మరమ్మతులు చేపట్టింది. నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి రావాల్సిన నిధుల్లో కొంత మంజూరు చేయించింది. దీంతో ఇటీవల కొండ మీది స్థలాలకు తారు రోడ్డు నిర్మించారు. ప్రజాప్రతినిధుల సూచనలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా వసతి భవన నిర్మాణానికి మినరల్ డెవలప్ ఫండ్ నుంచి రూ.4.62 కోట్లు కేటాయించారు.

## దొరలెందరు.. దొంగలెవరు!

ఒంగోలు : వైకాపా ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు- పేదలందరికీ ఇల్లు' కార్యక్రమంలో భాగంగా ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. అందుకుగాను జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ భూములు సేకరించింది. గ్రామాల్లో ఒకటిన్నర, పట్టణాల్లో సెంటు చొప్పున పట్టాలిచ్చింది. వీరిలో కొందరు రెండు పట్టాలు తీసుకున్నారని, మరికొందరు అనర్హులున్నారని అప్పట్లోనే ప్రతిపక్షాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అయినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో జగనన్న లేఅవుట్ల భూ సేకరణ, పక్కాగృహాల నిర్మాణంపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. తాజాగా ఇంటి పట్టాల లబ్ధిదారుల్లోనూ అనర్హుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీసీఎల్ఏ నుంచి కలెక్టరేట్‌కు ఆదేశాలు అందాయి.

పునఃపరిశీలనకు బృందాలు: లబ్ధిదారుల అర్హతలపై క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేయనున్నారు. మండల తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లతో బృందాలను ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఈ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. గత ప్రభుత్వం పేర్కొన్న ఆరంచెల విధానం ద్వారానే అనర్హులను గుర్తించనున్నారు. లబ్ధిదారుని పేరు మీద గతంలో ఎక్కడైనా ఇంటికి విద్యుత్తు మీటరు ఉందా.. లేదా పరిశీలిస్తారు. ఇంటి పన్ను చెల్లింపు, కారు, ఆదాయ పన్ను, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా..? తదితర వివరాలపై ఆరా తీస్తారు.

**ఇప్పటికే ఒంగోలులో మొదలు:** ఒంగోలు నగరానికి చెందిన 20,800 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ నిమిత్తం వెంగముక్కపాలెం, ఎన్.అగ్రహారం వద్ద గత ప్రభుత్వ హయాంలో భూమి సేకరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా హడావుడిగా పట్టాలు పంపిణీ చేశారు. భూ సేకరణ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా.. లబ్ధిదారులకు వాటిల్లో గత పాలకులు, రెవెన్యూ అధికారులు పొజిషన్ చూపలేదు. అప్పట్లోనే లబ్ధిదారుల జాబితాలో సగం మంది అనర్హులున్నట్లు విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అనర్హుల ఏరివేతపై దృష్టి పెట్టారు. ఆ మేరకు రెవెన్యూ, విద్యుత్తు, నగరపాలక సంస్థ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకెళ్లి పూర్తి వివరాలను ఇప్పటికే సేకరిస్తున్నారు.

## పక్కా ప్రణాళిక.. అధ్యాయాల ఎంపిక



అనంతపురం : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 2 నుంచి ఆరంభం కానున్నాయి. ఒకేషనల్ విద్యార్థులకు ఇప్పటికే ప్రయోగ పరీక్షలు మొదలయ్యాయి. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ప్రయోగ పరీక్షలు ఈనెల 10 నుంచి ప్రారంభమవుతాయి. థియరీ పరీక్షలకు సంబంధించి సైన్స్ విద్యార్థులకు గణితం, భౌతిక, రసాయన, వృక్ష, జంతుశాస్త్రాలతోపాటు తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృతం భాషా పరీక్షలూ ఉంటాయి. వాటిలో సైన్స్ సబ్జెక్టులే కీలకం. వాటిని ప్రణాళికాబద్ధంగా చదివితే సులువుగా ఉత్తీర్ణత సాధించడంతోపాటు మంచి మార్కులు సాధించవచ్చని సబ్జెక్టుల నిపుణులు పేర్కొంటున్నారు. వారి సూచనలు, సలహాలు మీకోసం ఇలా..

**భౌతికశాస్త్రం చాలా సులువు**
నారాయణస్వామి, అధ్యాపకులు కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం
ఈ పరీక్ష (థిమరీ) 60 మార్కులకు ఉంటుంది. ఈ సబ్జెక్టు చాలా సులువు. కేంద్రకం చాప్టర్ నుంచి కేంద్రక రియాక్టర్, రేడియో ధార్మిక్షయం గురించి నేర్చుకొంటే 8 మార్కుల ప్రశ్న తప్పకుండా ఉంటుంది.
: విద్యుత్తు ప్రవాహం, కిర్కాక్ నియమాలు పొటెంటియో మెటల్‌కు సంబంధించి 2 ప్రశ్నలు చదువుకొంటే 8 మార్కులు సాధించినట్లే.
పరమాణువు, వర్ణపట శ్రేణులు, బోర్ సిద్ధాంత పరామితులు, బోర్ ప్రతిపాదనలు, రూథర్‌ఫర్డ్ పరామితులపై అవగాహన ఉంటే 4 మార్కులు సులువుగా వస్తాయి.
తరంగ దృశాశాస్త్రం, కాంతిలో డాప్లర్ ప్రభావం, వ్యతికిరణం, వివర్తనం, శక్తినిత్యత్వ నియమాలు, కంటి పృథక్కరణ సామర్థ్యంపై అవగాహన ఉంటే 4 మార్కులు వస్తాయి.
కిరణ దృశాశాస్త్రం, అర్థవాహక ఎలక్ట్రానిక్ సులభమైన చాప్టర్లు. సైక్లోట్రన్, అంపీరియర్స్ గురించి అభ్యసించాలి. అయస్కాంత తత్త్వం, వికిరణం, ద్రవ్యాల ద్వంద్వస్వభావం అధ్యాయాల నుంచి 2 మార్కుల ప్రశ్నలు 4 వస్తాయి. ఎలక్ట్రానిక్స్ సంసర్గ వ్యవస్థలు, కిరణ దృశాశాస్త్రం కూడా నేర్చుకొంటే మంచి మార్కులు సాధించవచ్చు.

**వృక్షశాస్త్రంలో 3 అధ్యాయాల్లో 50 మార్కులు**
రామాంజనేయులు, అధ్యాపకులు పాతూరు జూనియర్ కళాశాల అనంతపురం వృక్షశాస్త్రంలో 60 మార్కులకు పరీక్ష ఉంటుంది. మొదటి అధ్యాయం వృక్ష శరీర ధర్మశాస్త్రంలో 2 మార్కుల ప్రశ్నలు రెండు, 4 మార్కుల ప్రశ్నలు నాలుగు, 8 మార్కుల ప్రశ్న ఒకటి వస్తుంది. రెండో అధ్యాయం సూక్ష్మజీవశాస్త్రంలో 2 మార్కుల ప్రశ్న ఒకటి, 4 మార్కుల ప్రశ్న 1 వస్తాయి. 4వ అధ్యాయం జీవసాంకేతిక శాస్త్రంలో 2 మార్కుల ప్రశ్నలు 2, 4 మార్కులు ఒకటి.. 8మార్కుల ప్రశ్న 1 వస్తుంది. ఈ మూడు అధ్యయాలు చదివినా 50 మార్కులు సులువుగా సాధించవచ్చు.

**గణిత సూత్రాలు జ్ఞాపకం పెట్టుకోండి**
సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, జూనియర్ కళాశాల, అనంతపురం
ఎంపీసీ విద్యార్థులకు ద్వితీయ సంవత్సరంలో 2ఏ, 2బీ అనే రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపరు 75 మార్కులకు ఉంటుంది. మొత్తం 150 మార్కులకు రాస్తారు. ఎంఈసీ కోర్సు వారికి 50 మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండు గ్రూపులకు ఒకటే సిలబస్ ఉంటుంది. 2ఏ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలంటే ప్రధాన సూత్రాలను బాగా జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
ద్విపద సిద్ధాంతం, విస్తరణ కొలతలు, సంభావ్యత, యాదృచ్ఛిక, చరరాశులు, సంభావ్యత విభాజనం అధ్యాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. వాటిని సాధన చేస్తే 60 మార్కులు సాధించవచ్చు. 2 మార్కుల ప్రశ్నలపై శ్రద్ధ వహిస్తే వంద శాతం మార్కులు సొంతం చేసుకోవచ్చు.
పేపర్ 2బీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉన్న 1బీతో ఎక్కువ అనుబంధం ఉంటుంది. వృత్తాలు, వృత్తసవరణలు, పరావలయం, దీర్ఘవృత్తం, అతిపరావలయం అధ్యాయాలు బాగా నేర్చుకోవాలి.
సమాకలనం, నిశ్వాత సమాకలనం, అవకలన సమీకరణాలు అధ్యాయాలపై దృష్టి పెట్టాలి. ప్రథమ సంవత్సరంలోని సూత్రాలు కూడా నేర్చుకొని ఉంటే 2బీ పేపరులో ఎక్కువ మార్కులు సాధించడానికి వీలు కలుగుతుంది.

**రసాయనంపై తికమకపడొద్దు**
పుష్పలత, అధ్యాపకురాలు బాలుర జూనియర్ కళాశాల, అనంతపురం
ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 60 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. 21 మార్కులు వస్తే ఉత్తీర్ణులవుతారు. గణస్థితి, ద్రావణాలు, విద్యుత్తు రసాయనశాస్త్రం- రసాయన గతిశాస్త్రం అనే అధ్యాయాలు ఉన్నాయి. మూడో అధ్యాయం విద్యుత్తు రసాయనశాస్త్రం, రసాయన గతిశాస్త్రం చదివితే 10 మార్కులు వస్తాయి. 4వ అధ్యాయం ఉపరితల రసాయనశాస్త్రం.. ఇందులో 4 మార్కుల ప్రశ్న ఒకటి వస్తుంది. లోహసంగ్రహణ శాస్త్రం నుంచి 4 మార్కుల ప్రశ్న వస్తుంది. పి-బ్లాక్ మూలకాల అధ్యాయం నుంచి 12 మార్కులకు 3 ప్రశ్నలు వస్తాయి. డీఎఫ్-బ్లాక్ మూలకాల నుంచి 4 మార్కుల ప్రశ్న ఒకటి, రెండు మార్కుల ప్రశ్న ఒకటి వస్తుంది. ఇవి చదివినా సులువుగా ఉత్తీర్ణులు కావొచ్చు.
జీవాణువులు, పాలిమర్లు, నిత్యజీవితంలో రసాయనశాస్త్రం అనే చిన్నచిన్న అధ్యాయాలు 3 ఉన్నాయి. వాటిపై దృష్టిపెడితే చాలు. రసాయన శాస్త్రంపై తికమక పడాల్సిన అవసరం లేదు.

**జంతుశాస్త్రంలో నాలుగు కీలకం**
జయరాంనాయక్, అధ్యాపకులు పాతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం
బైపీసీ విద్యార్థులకు జంతుశాస్త్రంలో 60 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. నాలుగు అధ్యాయాలు అభ్యసిస్తే చాలు ఉత్తీర్ణులు కావొచ్చు. జీర్ణక్రియ, శోషణం, శ్వాసక్రియల గురించి తెలుసుకోవాలి.
రెండో అధ్యాయంలో మానవ ప్రత్యుత్పత్తి, ప్రత్యుత్పత్తి సంబంధ ఆరోగ్యంపై బాగా చదవాలి. వాటిలో 12 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. జన్యుశాస్త్రంలో 12 మార్కులు సులువుగా తెచ్చుకోవచ్చు. శరీరద్రవాలు, ప్రసరణ, విసర్జక పదార్థాలు గురించి అభ్యసించాలి.

## పంచాయతీల్లో పరుగులు పెట్టని పన్ను వసూళ్లు




గోరంట్ల: పంచాయతీలకు స్థిరంగా వచ్చే ఆదాయం పన్నుల వసూళ్లు. ప్రతిఏటా ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31లోపు అన్ని రకాల పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయాలి. ఆ నిధులను అభివృద్ధికి వినియోగించుకోవాలి. ఇది సాధారణంగా జరుగుతున్న ప్రక్రియ. అయితే జనవరి వరకు పన్నుల వసూళ్లను పెద్దగా పట్టించుకోరు. మిగిలిన మూడు నెలల్లో గరిష్ఠంగా వసూలు చేయడానికి చర్యలు చేపడతారు. ప్రస్తుతం జిల్లాలో అదే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో మిగిలి ఉన్న రెండు నెలల్లో 75 శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉంది. పన్నులు రెండు రకాలు. ఒకటి ట్యాక్సెస్ మరొకటి నాన్‌ట్యాక్సెస్. కేవలం ఇంటి పన్ను మాత్రం ట్యాక్సెస్ పరిధిలోకి వస్తుంది. కుళాయి, కుళాయి డిపాజిట్టు, వేలం పాటలు, ఇంటి నిర్మాణ అప్రూవల్స్ ఇలాంటి రకాల పన్నులన్నీ నాన్‌ట్యాక్సెస్ పరిధిలోకి వస్తాయి. నాన్‌ట్యాక్సెస్ కింద వార్షిక డిమాండ్ రూ.6.98 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.1.94 కోట్లు మాత్రం వసూలైంది. రూ.5.04 కోట్లు వసూలు కావాల్సి ఉంది.
జిల్లాలో గుడిబండ, సోమందేపల్లి, తనకల్లు మండలాలు వసూళ్లలో చాలా వెనుకబడి ఉన్నాయి. జిల్లాలోనే అత్యధికంగా గోరంట్ల మండలంలో ట్యాక్సెస్ పన్ను డిమాండ్ రూ.74.55లక్షలు ఉంది, ఇప్పటి వరకు రూ.18.78లక్షలు మాత్రం వసూలు చేశారు. అలాగే నాన్‌ట్యాక్సెస్ పన్నుల్లో కొత్తచెరువు రూ.1.32కోట్లతో జిల్లాలోనే మొదటిస్థానంలో ఉండగా ఇప్పటివరకు రూ.48.05లక్షలు వసూలు చేశారు.

**ఈ నెల 15 నుంచి స్పెషల్‌డ్రైవ్**
జిల్లా వ్యాప్తంగా మార్చి 31 నాటికి వందశాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యంతో ఫిబ్రవరి 15 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. సమత, జిల్లా పంచాయతీ అధికారి

## టౌన్‌బ్యాంక్‌లో రూ.2 కోట్ల రుణమాఫీ?

తిరుపతి : తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో వైకాపా పాలకవర్గం కొలువుదీరినప్పటి నుంచి ప్రతిదీ వివాదాస్పదంగా మారుతోంది. 2022 ఎన్నికలతో ప్రారంభమైన వివాదం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. గతంలో ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసం 8.5 వడ్డీ రేటుతో శ్రీవారి ఖజానా నుంచి రూ.10 కోట్ల నిధులను డిపాజిట్ చేయడం, తిరుమల శాఖలో బ్యాంక్ సిబ్బంది బంగారానికి బదులు నకిలీ బంగారం తాకట్టు పెట్టి రూ.20 లక్షలు శఠగోపం పెట్టడం, పూచీకత్తు రుణాల్లో రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు మాత్రమే తగ్గించే నిబంధనలు పాలకమండలి, బ్యాంక్ అధికారులకు ఉన్నప్పటికీ ఆ నిబంధనలను తుంగలో తొక్కి, వైకాపా ప్రజాప్రతినిధుల సిఫార్సుతో రూ.6 లక్షల వరకు మాఫీ చేయడం వంటివి చోటుచేసుకున్నాయి. తాజాగా బ్యాంక్ నిబంధనలు పాటించకుండా రూ.2 కోట్లు రుణమాఫీ చేశారన్న ఆరోపణలు రావడంతో జిల్లా సహకార శాఖ (డీసీవో) అధికారులు బ్యాంక్‌లో విచారణ మొదలుపెట్టారు. పాలకవర్గం నియమాలు పాటించకుండా రుణమాఫీ జరిగిందన్న అంశాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. రుణమాఫీ ఎంతమంది ఖాతాదారులకు



చేశారు? ఎంతమొత్తంలో చేశారు? ఏ ప్రాతిపదికన చేశారు? అన్న అంశాలపై విచారణ సాగుతోంది. విచారణ పూర్తయ్యేంత వరకు రుణమాఫీకి సంబంధించిన అంశాలను గోప్యంగా ఉంచి, తదుపరి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

## ఒక్క హాయ్.. 161 పౌర సేవలు

చిత్తూరు: కుప్పం మండలానికి చెందిన మోహన్ వివాహ ధ్రువపత్రం కోసం 'మన మిత్ర' (వాట్సప్ గవర్నెన్స్)లో మెసేజ్ చేశారు. రెవెన్యూ సేవల్లోకి వెళ్లగా ఆధార్ వివరాలు, వ్యక్తిగత వివరాలు నమోదు చేసిన తర్వాత నిర్ణీత రుసుం చెల్లించారు. త్వరలోనే మీకు ధ్రువపత్రం అందుతుందని వాట్సప్‌లోనే మెసేజ్ వచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా కూటమి ప్రభుత్వం ఒక్క క్లిక్‌తో పౌర సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. 'వాట్సప్' ద్వారా 161 సేవలను అందిస్తూ పౌరులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితిని తప్పించింది. ఈ విప్లవాత్మక కార్యక్రమానికి జనాల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. యంత్రాంగం కూడా దీనిపై మరింత అవగాహన కల్పిస్తే ప్రతి జరిగే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు వచ్చే వారికి వ్యయప్రయాసలు తగ్గుతాయి.

**ఇంటర్ హాల్ టికెట్లు కూడా..**



తాజాగా ఇంటర్ హాల్ టికెట్లు కూడా వాట్సప్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది.

**మెసేజ్ చేస్తే చాలు**
గత నెల 30న ప్రభుత్వం 'మన మిత్ర' పేరుతో వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం '95523 00009' నంబరును కేటాయించింది. ఈ నంబరుకు 'హాయ్' అని మెసేజ్ చేస్తే ఏయే సేవలు అందుబాటులో ఉన్నాయో.. అందులో మీకు అవసరమైనది ఎంచుకోమని సూచిస్తుంది.

**ఆలయాల దర్శనం సైతం**
దేవాదాయ శాఖ తరఫున ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు ఆలయాలకు సంబంధించి దర్శనం, సేవలు పొందవచ్చు.
ఇందులో కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలూ ఉన్నాయి. ఏరోజు కావాలంటే ఆరోజు మనం దర్శన టికెట్లు పొందే సౌలభ్యం ఉంది. రెండో విడతలో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే)కు సంబంధించిన సేవలు అందుబాటులోకి తేనున్నారు.
ధ్రువపత్రాలు పోయినా పొందొచ్చు..
ప్రజలు ఏవైనా ధ్రువపత్రాలు పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్ల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిందే. ఎస్పైను కలిసి విన్నవించుకోవాలంటే ముందుగా కొందరు సిబ్బంది ఈసడింపులు భరిస్తూ అడిగినంత ఇచ్చుకోవాలి. 'మన మిత్ర' ద్వారా పత్రాలు, వస్తువులు పోయాయని నమోదు చేసుకుంటే తదనంతరం పురోగతి కూడా వాట్సప్ ద్వారానే తెలుసుకోవచ్చు.

**అందించే సేవలివీ..** దేవాదాయ, ఏపీఎస్ఆర్టీసీ, విద్యుత్తు, పురపాలక, రెవెన్యూ, ఆరోగ్య కార్డులు, పోలీసు శాఖకు సంబంధించిన 161 సేవలు ప్రస్తుతం ప్రవేశపెట్టారు. ఆలయాల దర్శనం, సేవలు, విరాళాలనూ వాట్సప్ ద్వారానే ఎంచుకునే సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. కీలకమైన రెవెన్యూ శాఖకు సంబంధించి వ్యవసాయ ఆదాయ ధ్రువపత్రం, కుటుంబసభ్యుల ధ్రువపత్రం, అడంగల్, ఆర్వోఆర్, నీటి తీరువా, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, టైటిల్ డీడ్ పాస్ పుస్తకం ప్రింటింగ్, వివాహ ధ్రువపత్రం వంటి సేవలను ప్రవేశపెట్టారు. 80 శాతం మంది సామాన్యులు తరచూ వీటి గురించే అర్జీలిస్తున్నారు. వాట్సప్ ద్వారానే ఇవి అందుతున్నందున ఎన్నో ఇబ్బందులు తొలగనున్నాయి.

## సౌర.. ఔరా అనేలా!

చిత్తూరు : ఇంటి నుంచే విద్యుదుత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాయి. ఎస్సీ, ఎస్టీ సర్వీసుదారులకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సౌరపలకలు ఏర్పాటు పనులు శరవేగంగా చేస్తున్నారు.

**మిగులు విద్యుత్తు గ్రిడ్‌కు..**
సౌర పలకల ఏర్పాటుతో ఉత్పత్తి అయ్యే యూనిట్లలో 200 వరకు ఎస్సీ, ఎస్టీలకు సర్వీసులకు ఉచితంగా సరఫరా చేస్తారు. మిగులు విద్యుత్తును నేరుగా గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. వచ్చే మొత్తాన్ని సదరు ఉత్పత్తిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.



**ఇతర వర్గాలకూ ఇలా..**
ఎస్సీ, ఎస్టీ వర్గాల సర్వీసులతో పాటు ఓసీ, బీసీ ఇతరులకు సంబంధించిన గృహ సర్వీసులకు కూటమి ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తోంది. ఓసీ, బీసీలు తమ గృహాలపై పది కిలోవాట్ల సామర్థ్యం వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. కేంద్రం రూ.78 వేలు రాయితీ ఇస్తుంది. మిగిలిన మొత్తం వినియోగదారు భరించాల్సి ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు 185 గృహాలకు సౌర పలకలు అమర్చారు. మరో 25 గృహాలు సిద్ధంగా ఉన్నాయి.

**ప్రభుత్వానికి నివేదించాం**
సూర్యఘర్ పథకం కింద ఉచితంగా సౌర పలకల ఏర్పాటుకు అనువైన 47,500 ఎస్సీ, ఎస్టీ సర్వీసుల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు రాగానే ఎంపిక చేసిన సదరు గృహాలపై వీటిని ఏర్పాటు చేస్తాం. ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ
రాష్ట్ర ప్రభుత్వం భరించే మొత్తం:రూ.70 వేలు
జిల్లాలో ఎస్సీ, ఎస్టీల విద్యుత్తు సర్వీసులు: 67 వేలు
సౌర పథకానికి అర్హమైన సర్వీసులు: 47,500
ఒక్కో సర్వీసుకు వ్యయం: రూ.1.30 లక్షలు
కేంద్ర ప్రభుత్వ రాయితీ: రూ.78 వేలు గరిష్ఠంగా

# కీర్తి సురేష్‌ను భయపెట్టిన పాత్ర ఏంటంటే..!


కేరళలో పుట్టినప్పటికీ తమిళ్‌లో ఎక్కువ సినిమాలు చేసి తమిళ ముద్దుగుమ్మ అనిపించుకున్న కీర్తి సురేష్ ఇటీవలే పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని మొదలు పెట్టింది. సుదీర్ఘ కాలంగా ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడంతో కీర్తి సురేష్ చాలా ఆనందంగా ఉంది. కోలీవుడ్‌లో వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్‌గా దూసుకు పోతుంది. మరో వైపు బాలీవుడ్‌లోనూ హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం వెబ్ సిరీస్‌ను సైతం అక్కడ చేస్తుంది. టాలీవుడ్‌లోనూ ఈ అమ్మడికి మంచి క్రేజ్, డిమాండ్ ఉంది. ఇంతగా బిజీగా ఉన్న సమయంలో కీర్తి సురేష్ పెళ్లి చేసుకోవడంను చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. మరో ఐదేళ్లు ఆగిన తర్వాత పెళ్లి చేసుకుని ఉంటే కెరీర్‌లో చాలా సాధించి ఉండేవారు అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కీర్తి సురేష్ ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా తన కెరీర్‌లో అత్యంత కఠినమైన సమయం ఏంటని, తన కెరీర్



మొత్తం మీద షూటింగ్ చేస్తున్న సమయంలో ఛాలెంజింగ్‌గా అనిపించిన సినిమా ఏంటి అనే విషయాలపై కీర్తి సురేష్ స్పందించింది. తెలుగులో నటించిన మహానటి సినిమా సమయంలో కీర్తి సురేష్ తీవ్రమైన ఒత్తిడికి గురి అయిందట. మహానటి సావిత్రి పాత్రను తాను పోషించగలనా అనే అనుమానం వ్యక్తం చేసిందట. ఎంతో మంది చేయలేం అంటూ తిరస్కరించిన తర్వాత కీర్తి సురేష్ ఛాలెంజ్‌గా తీసుకుని సావిత్రి పాత్రలో నటించింది. సినిమాలో అద్భుతంగా నటించి ఏకంగా జాతీయ అవార్డును సైతం సొంతం చేసుకుంది. మహానటి సినిమాలోని కీర్తి సురేష్ నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అంతే కాకుండా ఆ సినిమా కారణంగా పాన్ ఇండియా రేంజ్‌లో కీర్తి సురేష్ కి మంచి డిమాండ్ పెరిగింది. ఇండస్ట్రీలో కీర్తి సురేష్ అంటే ఓ బ్రాండ్ అనే స్థాయిలో మహానటి సినిమా ఆమెకు పేరు తెచ్చి పెట్టింది. ఆ సినిమా కారణంగా చాలా లేడీ ఓరియంటెడ్ సినిమా ఆఫర్లు కీర్తి సురేష్ వద్దకు వచ్చాయి. అందులో కొన్నింటికి ఓకే చెప్పిన కీర్తి సురేష్ ఆ సినిమాల్లోనూ తన నటనతో మెప్పించింది. కీర్తి సురేష్ టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోల సినిమాల్లో ఆఫర్ల కోసం వెయిట్ చేస్తుంది. మరో వైపు కోలీవుడ్‌లో మాత్రం క్రమం తప్పకుండా సినిమాలు చేసేందుకు గాను ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. సావిత్రి పాత్ర పోషించిన సమయంలో మొదట కొన్ని రోజులు మానసిక ఒత్తిడికి గురి అయినట్లు చెప్పిన కీర్తి సురేష్ కొన్ని రోజుల్లోనే ఆ ఒత్తిడిని జయించి సినిమాలో నటించడం మొదలు పెట్టాను. సినిమా కొన్నాళ్లు షూటింగ్ జరిగిన తర్వాత కొందరి నుంచి వచ్చిన ప్రశంసలతో రెట్టించిన ఉత్సాహంతో సినిమాలో నటించినట్లు కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది. టాలీవుడ్‌లో ఈమె రీ ఎంట్రీ కోసం అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే అక్క అనే వెబ్ సిరీస్‌తో నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ వెబ్ సిరీస్‌లో కీర్తి సురేష్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని సమాచారం అందుతోంది. రాధిక ఆప్టే ఆ వెబ్ సిరీస్‌లో కీలక పాత్రలో కనిపించబోతుంది.

# తెలుగు లోగిళ్లలో భాగ్యం నాటి నాయికల్లా!

తెలుగు అమ్మాయే అయినా ఓన్ చేసుకోవడానికి మాత్రం ఐశ్వర్యా రాజేష్ విషయంలో చాలా సమయం పట్టింది అన్నది వాస్తవం. భా అంటూ భాగ్యం ఒక్క డైలాగుతో తెలుగు అమ్మాయి పెర్ఫార్మెన్స్ అంటే ఇలా ఉంటుంది? అని నిరూపించింది. సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో విక్టరీ వెంకటేష్ కి భార్య పాత్రలో నటించిన ఐశ్వర్యా రాజేష్ కిప్పుడు తెలుగు ఆడియన్స్ నీరాజనాలు పడుతోన్న సంగతి తెలిసిందే. ఆమెకంటూ ప్రత్యేకమైన అభిమమానులు ఏర్పడ్డారు. ఫ్యామిలీ ఆడియన్స్ లో ఓ ప్రత్యేక నటిగా గొప్ప స్థానాన్ని సంపాదించింది. ఒకప్పుడు ఇలాంటి ఇల్లాలి పాత్రలు పోషించాలంటే? సౌందర్య, ఆమని, రమ్యకృష్ణ లాంటి నటులు మాత్రమే సరితూగేవారు. అప్పట్లో వాళ్ల నటనకు మాత్రమే అలాంటి ఆడియన్స్ ఉండేవారు. మళ్లీ చాలా కాలానికి అలాంటి అభిమానుల్ని ఐశ్వర్యా రాజేష్ ఒక్క సినిమాతో సంపాదించుకుంది. అయితే ఈ సక్సెస్ ఐశ్వర్యకు అంత తేలిగ్గా రాలేదు. తెలుగు అమ్మాయి అయినా ఐశ్వర్యకు తెలుగు వాళ్లు అవకా



లివ్వలేదు. చిన్నప్పుడు రాజేంద్ర ప్రసాద్ నటించిన రాంబంటులో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించింది. కానీ హీరోయిన్ గా మాత్రం కోలీవుడ్ అవకాశిలిచ్చింది. అక్కడ నిరూపించుకున్న తర్వాత టాలీవుడ్ లో ప్రయాణం మొదలు పెట్టింది. ఆరేళ్ల క్రితమే కౌసల్య కృష్ణమూర్తి సినిమాలో నటించింది. ఆ తర్వాత మిస్ మ్యాచ్, వరల్డ్ ఫేమస్ లవర్, రిపబ్లిక్ లాంటి చిత్రాల్లో నటించింది.

ఇవేవి కూడా ఐశ్వర్యని టాలీవుడ్ లో బిజీ నటిగా మార్చలేకపోయాయి. దీంతో కోలీవుడ్ లో కొనసాగుతూనే ఇక్కడ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో దర్శకుడు అనీల్ రావిపూడిలో ఆమె లో కొత్త యాంగిల్ చూసాడు. అలా సంక్రాంతికి వస్తున్నాం లో వెంకీ భార్య పాత్రకు అవకాశం వచ్చింది. ఈ సినిమా సక్సెస్ తో ఐశ్వర్యకు అవకాశాలు క్యూ కడుతున్నాయని సమాచారం.





# కన్నప్ప 'లవ్' - రొమాంటిక్ ట్రాక్ లో ఊహించని సాంగ్




మంచు విష్ణు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'కన్నప్ప' నుండి మరో లిరికల్ వీడియో సాంగ్ విడుదలైంది. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విష్ణు సరసన ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తోంది. భారీ మైథలాజికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా ఏప్రిల్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమాలో మోహన్ బాబు, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, శరత్‌కుమార్ వంటి స్టార్ క్యాస్ట్ ప్రత్యేక పాత్రల్లో నటిస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలున్నాయి. తాజాగా విడుదలైన లవ్ లిరికల్ వీడియో "సగమై చేరి సగమై.." ప్రేమ, భావోద్వేగాలతో నిండిన పాటగా సాగింది. స్టీఫెన్ దేవసీ సంగీతం అందించగా, రేవంత్, హరిచరన్, చిన్మయి, సాహితి, షాన్, నజీమ్ అర్షద్ వంటి గాయకులు ఈ పాటను భాషలకు తగ్గట్టుగా ఆలపించారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైన ఈ పాటలో హీరోహీరోయిన్ మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రభుదేవా - బృంద మాస్టర్ కలిసి ఈ పాటకు కొరియోగ్రఫీ అందించగా, లొకేషన్స్ కూడా అందంగా కుదిరాయి. పాట విజువల్స్ పరంగా చూస్తే.. ప్రకృతి సోయగాలతో కూడిన లొకేషన్లు ఆకట్టుకున్నాయి. మంచు విష్ణు, ప్రీతి ముకుందన్ జంట మీద చిత్రీకరించిన ఈ పాటలో నీటి మధ్య, అడవుల మధ్య రొమాంటిక్ ఎమోషన్లు ప్రధానంగా చూపించారు. ప్రీతి ముకుందన్ గ్లామర్ లుక్, నేచురల్ లొకేషన్స్ పాటకు ప్లస్ పాయింట్ అయితే, కంపోజిషన్ పరంగా చూసుకుంటే అదోకే ఓకే అనిపించే స్థాయిలో ఉంది.

అయితే కన్నప్ప లాంటి సినిమాలో ఇలాంటి లవ్ రొమాంటిక్ సాంగ్ ఉంటుందని ఎవరు ఊహించలేదు. మేకర్స్ కన్నప్ప కథను సరికొత్తగా ప్రజెంట్ చేయనున్నట్లు తెలుస్తోంది. విష్ణు, ప్రీతి ముకుందన్ మధ్య రొమాంటిక్ మూమెంట్స్ హైలైట్ అయ్యాయి. అలాగే మ్యూజిక్ పరంగా స్టీఫెన్ దేవసీ మంచి బాణీలను ఇచ్చారు. పూర్తిగా మైథలాజికల్ టచ్‌తో రొమాన్స్ మిక్స్ చేసినట్లు కనిపిస్తోంది. ఇక బిగ్ స్క్రీన్‌పై ఎంత వరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.


# నాని 'ది ప్యారడైజ్'.. ట్రెండుకు తగ్గట్లే డబుల్ డోస్




టాలీవుడ్‌లో ఎప్పుడూ కొత్త కథలతో ప్రేక్షకులను ఆకట్టుకునే నాని, ఈసారి తన కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్ కోసం సిద్ధమయ్యాడు. 'దసరా'తో మాస్ హీరోగా మరో స్థాయికి వెళ్లిన నేచురల్ స్టార్, 'ది ప్యారడైజ్' అనే విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇటీవల నాని ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఈ ప్రాజెక్ట్‌ను 'ఇండియన్ మ్యాడ్ మ్యాక్స్' లా ఊహించొచ్చని చెప్పాడు. నాని ఫస్ట్ లుక్ చూసినప్పుడు అదే ఫీలింగ్ రావడం విశేషం. ఇప్పుడు దీనికి మించి, ఈ కథలో చెప్పాల్సిన అంశాలు చాలా ఎక్కువగా ఉండటంతో, ఒక సినిమాగా మించి మరో పార్ట్ కూడా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. టాలీవుడ్‌లో ఇటీవల భారీ బడ్జెట్ చిత్రాలు రెండు భాగాలుగా తెరకెక్కడం ట్రెండ్‌గా మారింది. ఆ ట్రెండ్‌లోనే 'ది ప్యారడైజ్' కూడా నిలవనుందని తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌లో నాని లుక్ చాలా ఇంటెన్స్‌గా ఉంది. రంగు రంగుల బ్యాక్‌డ్రాప్, నాని వేషధారణ, గడ్డం, మెడలో గొలుసులు, రెండింటికి విడదీయరాని కాకిలా ఉన్న గ్రాఫిక్స్.. ఇవన్నీ సినిమా టోన్‌ను మరింత ఆసక్తికరంగా మార్చేశాయి. అలాగే ట్రాన్స్ జెండర్ అనే షాకింగ్ గాసిప్స్ కూడా వైరల్ అవుతున్నాయి. మాస్ హీరోగా పూర్తిగా కొత్త అవతారం ఎత్తిన నాని, ఈ పాత్రలో రఫ్ లుక్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరచబోతున్నాడు. ఈ లుక్ సినిమాకు సంబంధించిన సస్పెన్స్‌ను మరింత పెంచేలా ఉంది. పైగా ఇది మామూలు కమర్షియల్ సినిమాతో పోల్చదగినది కాదు, కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చిన సినిమా అని ఫస్ట్ గ్లింప్స్‌తోనే అర్థమైంది. 'ది ప్యారడైజ్' భారీ స్థాయిలో తెరకెక్కుతోంది. 'దసరా'తో మంచి విజయాన్ని అందుకున్న శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తుండటంతో, ఈసారి దర్శకుడి మేకింగ్ మరింత డిఫరెంట్‌గా ఉంటుందని అంచనాలు ఉన్నాయి. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఎప్పుడూ క్వాలిటీ ప్రాజెక్ట్‌లను ప్రొడ్యూస్ చేసే బ్యానర్ అయిన %వాూఎ% సినిమాస్‌లో ఈ మూవీ రూపొందుతోంది. సంగీతం అనిరుధ్ అందిస్తుండటంతో, సినిమా మ్యూజిక్ పరంగా కూడా మరింత క్రేజీగా ఉండే అవకాశం ఉంది. ఈ సినిమాకు భారీ బడ్జెట్ ఖర్చు అవుతోందని, ఇప్పటివరకు నాని చేసిన ప్రాజెక్ట్స్‌లో ఇదే అత్యంత ఖరీదైనదని టాక్. ఫస్ట్ పార్ట్ 2026 మార్చి 26న విడుదల కాబోతోంది. అయితే రెండో భాగం కోసం మాత్రం ఇంకొంత సమయం పట్టే అవకాశం ఉంది. రెండు భాగాలుగా తెరకెక్కించే చిత్రాలు ఎక్కువ టైమ్ తీసుకునే అవకాశం ఉండటంతో, 'ది ప్యారడైజ్ 2' ఎప్పుడు రానుందన్నది ఉత్కంఠ రేపుతోంది. కానీ ఈ కథకు ఒకే సినిమా సరిపోదని, ప్రేక్షకులు రెండు భాగాలుగా చూస్తేనే అసలైన అనుభూతి అందుకుంటారని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ ట్రెండుకు తగ్గట్లే నాని ఎలాంటి విజయాలను అందుకుంటాడో చూడాలి.

# అనసూయ గోల్డెన్ రాయల్ లుక్.. స్టన్నింగ్!

అనసూయ భరద్వాజ్.. నాన్ గ్లామర్ లుక్‌లో కూడా తనదైన స్టైల్‌తో కట్టిపడేస్తుంటుంది. ఎప్పుడూ ట్రెండీ లుక్స్‌లో దర్శనమిచ్చే ఈ భామ ఈసారి సంప్రదాయ వస్త్రధారణలో కనిపించింది. ఆకుపచ్చ-బంగారు రంగుల పట్టు చీరలో, జరీ అంచుతో మెరిసిపోతూ, విలక్షణమైన ఆభరణాలతో, గజ్జెలు, బిగిన గాజులతో సంప్రదాయాన్ని చాటింది. ఈ ఫోటోషూట్‌లో అనసూయ తన ఎక్స్‌ప్రెషన్స్‌తో, హావాభావాలతో మరోసారి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. రెడ్ బ్యాక్‌డ్రాప్ ముందు కూర్చొని, ఖద్దరు సెట్‌లో రాజసంగా కనిపించిన అనసూయ.. తన హుందాతనాన్ని, సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించేలా కనిపించింది. వెండితెరపై ఎప్పుడూ స్టైలిష్ లుక్స్‌లో కనిపించే ఆమె ఈసారి రాయల్ లుక్‌లో సరికొత్త అందాన్ని చూపించింది. క్లాసిక్ డిజైన్ బ్లౌజ్, మట్టి రంగుల్లో తళుకులీనే నాజూకైన నగలు ఆమె



అందాన్ని మరింత పెంచాయి. కెమెరా ముందు అనసూయ ఇచ్చిన స్టిల్స్ చూస్తుంటే ఆమె స్టైలింగ్‌కు ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టిందని అర్థమవుతోంది. ఆమె చూపులు, హుందాతనం కలిగిన భంగిమలు.. ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫోటోషూట్‌ను షేర్ చేసిన అనసూయపై అభిమానులు కామెంట్స్, లైక్స్‌తో ఓ రేంజ్‌లో స్పందిస్తున్నారు. ట్రెండీ దుస్తులు, మోడ్రన్ అవుట్‌ఫిట్స్‌తోనే కాకుండా.. ఇలాంటి సంప్రదాయ సాంప్రదాయ దుస్తుల్లో కూడా అనసూయకు ఎంతలా కుదిరిందో ఈ ఫోటోలు చెబుతున్నాయి. ఆమె ఎక్కడి లుక్ అయినా ఒంటి చేసుకుని మెరిసిపోవడం ఆమె ప్రత్యేకత. మరీ ముఖ్యంగా ఈ పట్టు చీరల లుక్‌లో అనసూయ ఎంతో గ్రేస్‌తో కనిపించడం విశేషం. సినీ రంగంలో నటిగా, యాంకర్‌గా, సోషల్ మీడియాలో ఫ్యాషన్ ఐకాన్‌గా మారిన అనసూయ.. ఈ ఫోటోషూట్ ద్వారా మరోసారి తన ట్రెండ్ సెట్టింగ్ స్టైల్‌ను నిరూపించింది. ఆమె అందాన్ని పొగుడుతూ అభిమానులు కామెంట్స్‌తో హోరెత్తిస్తున్నారు. ఇక ప్రస్తుతం ఆమె తెలుగులో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

# అవార్డుల్లో హంసలా మెరిసిన కృతి

ప్రతిష్ఠాత్మక ఐఫా డిజిటల్ అవార్డ్స్ -2025 వేడుకలు జైపూర్‌లో కన్నుల పండుగగా సాగాయి. డిజిటల్ స్ట్రీమింగ్ లో ఉత్తమమైన సినిమాలు, సిరీస్ లను పురస్కారాలు వరించాయి. ఉత్తమ నటిగా 'దోపట్టీ' కోసం కృతి సనోన్ ఐఫా పురస్కారాన్ని గెలుచుకుంది. ఈ సినిమాతో కృతి సనోన్ నిర్మాతగాను ఆరంగేట్రం చేసింది. ఆ ఆనందం ఆవర్ణం అయిన వేళ కృతి సనోన్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. కృతి ఈ అవార్డుల కార్యక్రమంలో మెరుపులా కనిపించింది. 'వైట్ అండ్ వైట్'లో రాణీ హంసలా మెరిసిపోయిన కృతి ఫోటోగ్రాఫ్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ గా మారాయి. ముఖ్యంగా కృతి అవార్డ్స్ నైట్‌లో షో స్టాపర్ గా నిలిచింది. అవార్డ్ గెలుచుకున్న సందర్భంగా కృతి తన ఆనందాన్ని అస్సలు దాచుకోలేకపోయింది. నా మొదటి ప్రొడక్షన్ చదోపట్టీకి 'ఐఫా ఫస్ట్ డిజిటల్'లో ఉత్తమ నటిగా మొదటి అవార్డును అందుకున్నానని కృతి



మురిసిపోయింది. దో పట్టీకి రెండు పెద్ద విజయాలు. నా భాగస్వామి కనికాథిల్లాన్ (ఉత్తమ కథారచయిత) కి అభినందనలు !! బెస్ట్ స్టోరి.. బెస్ట్ యాక్టర్ అవార్డులు దక్కాయి! అని కృతి తెలిపింది. ఐఫాకు, ప్రేక్షకులందరి ప్రేమ మద్దతుకు ధన్యవాదాలు! అని ఆనందం వ్యక్తం చేసింది. ఈ గొప్ప క్షణం కోసం తనను వేదికపై ఉత్తమంగా కనిపించేలా చేసినందుకు తన బృందానికి అభినందనలు! తెలిపింది. తన కాస్ట్యూమ్స్- మేకప్ టీమ్ ని మరువకుండా ధన్యవాదాలు తెలిపింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. కృతి సనన్ చివరిసారిగా నెట్‌ఫ్లిక్స్ ఫిల్మ్ దో పట్టిలో కనిపించింది. శశాంక చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కాజోల్, షహీర్ షేక్ కూడా కీలక పాత్రల్లో నటించారు. కరీనా, టబులతో కలిసి నటించిన 'క్రూ' చిత్రంతో కమర్షియల్ విజయం అందుకున్న సంగతి తెలిసిందే. మరోవైపు ప్రముఖ బిజినెస్ మేన్ వారసుడితో కృతి షికార్లు చర్చనీయాంశంగా మారాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536